

'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 342

శుక్రవారం 25-8-2023


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రాజూ, బంటూ.. అమ్మే

అమ్మకు ఎత్తులు పైఎత్తులు తెలియవు.. కొడుకు మీద ప్రేమ తప్ప, అతన్ని రాజును చేయాలనే తపన తప్ప.. చెస్ వరల్డ్ కప్‌లో సంచలనం సృష్టించిన ప్రజ్ఞానందకు రాజుగా, బంటుగా ఉంటూ తీర్చిదిద్దిన తల్లి నాగలక్ష్మిపై కథనం..

- వివరాలు 11లో



జాబిల్లిపై భారత్ నడక

చంద్రుడిపై రోవర్ ప్రజ్ఞాన్ అడుగు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ 'చందమామపై భారత్ నడుస్తోంది' అని ఇస్రో హర్షం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



విమాన ప్రమాదంలోనే మృతి..

విమాన ప్రమాదంలో వాగ్నర్ గ్రూప్ అధినేత ప్రిగోజిన్ మృతి చెందారని రష్యా పౌర విమానయాన సంస్థ ధ్రువీకరించింది.

వివరాలు 6లో ▸



బ్రిక్స్‌లోకి మరో ఆరు దేశాలు

బ్రిక్స్ కూటమిలోకి అర్జెంటీనా, ఈజిప్టు, సౌదీ, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ చేరినట్టు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రమఫోసా ప్రకటించారు.

వివరాలు 6లో ▸



పసిఫిక్‌లోకి అణు జలాల విడుదల

ఫ్యుకుషిమా అణు ప్లాంట్ వ్యర్థ జలాలను జపాన్ పసిఫిక్ సముద్రంలోకి విడుదల చేయగా.. పలు దేశాలు ఖండించాయి.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

రామోజీ.. ఇవి చేతలు కావా?

- రూ.110 కోట్లతో 20 టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు, 20 పాలీహౌస్‌లు, షేడ్‌నెట్లు..
- పరిశ్రమల క్రమబద్ధీకరణ కింద 100 మైక్రో సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లు ఏర్పాటు
- డిసెంబర్ నాటికి మరో 5 వేల యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు
- కర్నూలు జిల్లా గూడూరు వద్ద ఉల్లి–టమాటా రేకులను పౌడర్‌గా మార్చే సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్
- పత్తికొండలో రూ.10 కోట్లతో 12 వేల టన్నుల సామర్థ్యంతో టమాటా ప్రాసెసింగ్ యూనిట్
- నాలుగేళ్లలో 76,383 ఎకరాల్లో టమాటా తోటలకు బిందు, తుంపర పరికరాలు
- 1,577 మంది రైతులకు రూ.102.76 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ జమ
- నాలుగేళ్లలో రూ.10.26 కోట్ల విలువైన 3,193.53 టన్నుల టమాటా సేకరణ.. రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు సబ్సిడీ ధరలకు పంపిణీ
- టమాటా రైతుకు అన్ని విధాలుగా ప్రభుత్వం బాసట

5 లో

తగ్గేదే లే

తెలుగు సినిమాకు పది అవార్డులు

జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్



తొలిసారిగా తెలుగు నటుడికి..

- జాతీయ సినిమా అవార్డులు-2021 ప్రకటన
- అత్యధికంగా ఆర్‌ఆర్‌ఆర్‌కు 6 పురస్కారాలు
- ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఉప్పెన
- ఉత్తమ తెలుగు ఫిల్మ్ క్రిటిక్‌గా పురుషోత్తమాచార్యులు
- జాతీయ ఉత్తమ నటీమణులుగా ఆలియాభట్, కృతిసనన్
- ఉత్తమ చిత్రంగా రాకెట్రీ
- సీఎం జగన్ సహా ప్రముఖుల అభినందనలు

తెలుగు సినిమా.. ఎత్తర జెండా

12 లో


ఆర్‌ఆర్‌ఆర్ ▼ ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం


దేవిశ్రీ ప్రసాద్ ▼ ఉత్తమ సంగీతం (పుష్ప)


కీరవాణి ▼ ఉత్తమ నేపథ్య సంగీతం (ఆర్‌ఆర్‌ఆర్)


చంద్రబోస్ ▼ ఉత్తమ గీత రచయిత (కొండపొలం)


కాలభైరవ ▼ ఉత్తమ నేపథ్య గాయకుడు (ఆర్‌ఆర్‌ఆర్)


ప్రేమ్ రక్షిత్ ▼ ఉత్తమ కొరియోగ్రఫీ (ఆర్‌ఆర్‌ఆర్)

శ్రీనివాస్ మోహన్ స్పెషల్ ఎఫెక్ట్స్

కింగ్‌సాల్మన్ యాక్షన్ డైరెక్టర్ (ఆర్‌ఆర్‌ఆర్)

నవరత్నాల లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రులు, అధికారులు



ఇంటికే 'ఆరోగ్యం'!

ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలి: సీఎం జగన్

- విలేజ్ క్లినిక్స్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు, ఆశావర్కర్ల ద్వారా ప్రచారం
- సేవలను పొందడంపై ప్రతి ఒక్కరికీ వివరంగా చెప్పాలి
- సెప్టెంబరు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం
- ప్రతి కుటుంబానికీ ఆరోగ్యశ్రీ సేవలపై సమగ్ర వివరాలతో బుక్‌లెట్
- డిశ్చార్జి రోజే రోగికి ఆరోగ్య ఆసరా డబ్బులు.. అత్యంత సమర్థంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్వహణ
- వైద్య, ఆరోగ్య శాఖపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఆదేశాలు

2 లో

అర్హులకు లబ్ధే లక్ష్యం

అధికారం అంటే అజమాయిషీ కాదు.. ప్రజల పట్ల మమకారం

మిగిలిపోయిన వారికి లబ్ధి కల్పించే కార్యక్రమంలో సీఎం

- 2,62,169 మంది ఖాతాల్లో బటన్ నొక్కి రూ.216.34 కోట్ల నగదు జమ చేసిన సీఎం జగన్
- కొత్తగా 1.49 లక్షల మందికి సామాజిక పెన్షన్లు
- మొత్తంగా పెన్షన్ల లబ్ధిదారులు 64.27 లక్షలు
- గత ప్రభుత్వంలో కేవలం 39 లక్షలే.. కొత్తగా 12,069 మందికి ఇళ్ల పట్టాలు.. మొత్తంగా 30,84,935 మంది

2 లో

మార్గదర్శిపై కేసు నమోదు

- సామర్లకోటలో ఫిర్యాదు చేసిన బాధితుడు
- మార్గదర్శిలో 2020 మార్చిలో లక్ష రూపాయల చిట్లు రెండు వేసిన మోజెస్
- నాలుగు నెలల తర్వాత ఒకటి పాడినట్లు వెల్లడి
- రూ.80 వేలు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని ఫిర్యాదు

3 లో

డీఈడీ అభ్యర్థులకే

ఎస్జీటీ పోస్టులు

సుప్రీంకోర్టు తీర్పు మేరకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిర్ణయం

దీంతో అవకాశం కోల్పోయిన బీఈడీ అభ్యర్థులు

3 లో

సమున్నతం!

ఉన్నత విద్యలో నాలుగేళ్లలో కీలక మార్పులు

- విద్యా దీవెన, వసతి దీవెనకు రూ.14,912.43 కోట్లు వ్యయం
- డిగ్రీ పట్టాతోపాటే ఉద్యోగం, ఉపాధి లక్ష్యంగా నైపుణ్య శిక్షణ
- 27 వేల సంస్థల్లో ఇంటర్న్‌షిప్, 144 కాలేజీల్లో వర్చువల్ క్లాసులు
- విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం చేసుకున్న తొలి రాష్ట్రం ఏపీ
- అధ్యాపకుల నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగం
- యూజీసీ కంటే ముందే పీజీ కోర్సుల ప్రవేశాలకు కామన్ ఎంట్రన్స్
- జాతీయ సగటుకు మించి గణనీయంగా పెరిగిన 'జీఈఆర్'



సాక్షి, అమరావతి: పునాది బాగుంటేనే ఓ భవనమైనా, చదువులైనా పది కాలాల పాటు పటిష్టంగా ఉంటాయి! ప్రాథమిక స్థాయి నుంచి విద్యారంగ సంస్కరణలను చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ఇందుకోసం నాలుగేళ్లలో రూ.65 వేల కోట్లకుపైగా వెచ్చించడం చదువులకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనం. ఉన్నత విద్యలోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తూ తల్లిదండ్రులపై ఫీజుల భారం పడకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతో పాటు భోజన, వసతి ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది. ఇంటర్ తర్వాత ఏ విద్యార్థి చదువుకూ ఆటంకం కలుగకుండా 2019 జూన్ నుంచి ఈ ఏడాది జూలై వరకు దాదాపు 27 లక్షల మంది విద్యార్థులకు మొత్తం రూ.14,912.43 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో జగనన్న విద్యాదీవెన కింద రూ.10,636.67 కోట్లు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయగా విద్యార్థుల వసతి, భోజన ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన కింద మరో రూ.4275.76 కోట్లు అందించింది. ఇక జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా

మిగతా 3వ పేజీలో ▶



దొంగ ఓట్ల తొలగింపుతో

బాబు గగ్గోలు




- ఉరవకొండలో ఓట్ల తొలగింపును ఎన్నికల సంఘం తప్పుపట్టలేదు: సజ్జల
- తొలగింపు ప్రక్రియలో నిబంధనల మేరకు వ్యవహరించలేదని మాత్రమే పేర్కొంది
- 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో 3,98,34,776 ఓట్లు.. గత మార్చి 31 నాటికి ఉన్న ఓట్లు 3,97,96,678
- ఓట్లు ఎక్కడ పెరిగాయో చంద్రబాబు, ఎల్లో మీడియా చెప్పాలి
- చంద్రబాబు హయాంలో సేవా యాప్ ద్వారా 50 లక్షలకుపైగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించారు
- కుప్పంలో 40 వేలు, విశాఖ తూర్పులో 30 వేల దొంగ ఓట్లను చేర్పించారు

5 లో

డేంజర్ జోన్‌లో

టీడీపీ..



- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి 151కి పైగా స్థానాలు ఖాయం
- టీడీపీలో ఉన్న వాళ్లంతా సంఘ వ్యతిరేక శక్తులే.. 'పచ్చ' పతనాన్ని జీర్ణించుకోలేకపోతున్న కాషాయంలో ఉన్న పచ్చ బ్యాచ్
- చంద్రబాబు పిచ్చి పీక్స్‌కు చేరింది
- చంద్రయాన్ విజయాన్ని చంద్రబాబు విజయంగా టీడీపీ సంబరాలు
- దక్షిణ కోస్తా జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి

- వివరాలు 3లో

క్లుప్తంగా...

విద్యార్థుల చేరికల నిష్పత్తిలో తెనాలి ఫస్ట్

సాక్షి, అమరావతి: విద్యార్థుల గరిష్ట చేరికల నిష్పత్తి (జీఈఆర్)లో 100 శాతం సాధించిన తొలి మండలంగా తెనాలి నమోదైనట్టు రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. 2005 సెప్టెంబర్ 1 నుంచి 2018 ఆగస్టు 31లోపు జన్మించిన వారందరినీ పాఠశాలలకు పంపించాలన్న లక్ష్యంతో చేపట్టిన 100 శాతం జీఈఆర్ కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తున్నట్టు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ, వార్డు కార్యదర్శుల సహకారంతో జూలై 1 నుంచి ఈ కార్యక్రమం చేపట్టగా.. ఇప్పటికి 59,602 వలంటీర్లు 100 శాతం జీఈఆర్ బ్యాడ్జీలను పొందినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 464 గ్రామ సచివాలయాలు 100 శాతం జీఈఆర్ నమోదు చేయగా.. అందులో 120 సచివాలయాలతో నంద్యాల మొదటిస్థానంలో ఉన్నట్టు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో తెనాలిలో 47 సచివాలయాలు ఉండగా.. 100 శాతం చేరుకోవడం ద్వారా తొలి పట్టణ మండలంగా తెనాలి రికార్డు సాధించిందన్నారు. బడికి వెళ్లని పిల్లలను తిరిగి పాఠశాలలకు పంపే విధంగా సచివాలయ కార్యదర్శులు చేపడుతున్న కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. త్వరలోనే 679 మండలాలు 100 శాతం జీఈఆర్‌కు చేరుకోవడం ద్వారా దేశంలోనే తొలి రాష్ట్రంగా ఏపీ రికార్డు సాధిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఎస్టీపీల భూసేకరణకు రూ.50 కోట్లు విడుదల



సాక్షి, అమరావతి: పట్టణాల్లోని ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం నిర్మించే ఎస్టీపీల భూసేకరణకు రూ.50 కోట్ల అదనపు నిధులను విడుదల చేస్తూ గురువారం పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా ఈ ఎస్టీపీలను నిర్మించనున్నారు. రాష్ట్రంలోని 72 యూఎల్బీల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు.

మరింత సమర్థంగా ఈహెచ్‌ఎస్ అమలు



సాక్షి, అమరావతి: ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ప్రభుత్వ స్పెషలిస్ట్, సూపర్ స్పెషాలిటీ వైద్యులతో విజయవాడలో బుధ, గురువారాల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వర్క్‌షాప్ నిర్వహించింది. పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయడానికి వైద్యులు సలహాలు, సూచనలు అందజేశారు. సీఈవో డాక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర సచివాలయంలో ఉచిత వైద్య శిబిరం



ఉద్యోగులకు సేవలందించిన వైద్యులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మణిపాల్ ఆస్పత్రి వైద్యులు ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, జనరల్ ఫిజిషియన్ స్పెషలిస్ట్, క్యాన్సర్ వైద్య పరీక్షలతో పాటు, ఈసీజీ, 2డీ ఎకో ఇతర వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 750 మంది వైద్య సేవలు పొందారు. శిబిరంలో డాక్టర్ వేణు గోపాల్‌రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శివ, ఏపీ సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్వా స్టార్టప్ కంపెనీ ప్రతినిధులకు సీఎం జగన్ అభినందన



సాక్షి, అమరావతి: ఆక్వా రంగంలో అంతర్జాతీయ అవార్డు అందుకున్న రాష్ట్రానికి చెందిన స్టార్టప్ కంపెనీ ఆక్వా ఎక్స్ఛేంజ్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్‌తో కలిసి ఆక్వా ఎక్స్ఛేంజ్ కో–ఫౌండర్ బండి కిరణ్‌కుమార్, సీఈవో పవన్‌కృష్ణ కలిసి ఇటీవల బెంగళూరులో జరిగిన జీ–20 డిజిటల్ ఇన్నోవేషన్ అలయెన్స్ సమ్మిట్–2023లో సాధించిన గ్లోబల్ అవార్డును చూపించారు. అవార్డు సాధించిన ఆక్వా ఎక్స్ఛేంజ్ ప్రతినిధులను అభినందించిన సీఎం.. చిన్న, సన్నకారు ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించేలా ఆలోచనలు చేయాలని సూచించారు.

అర్హులకు లబ్ధే లక్ష్యం

అధికారం అంటే అజమాయిషీ కాదు.. ప్రజల పట్ల మమకారం

మిగిలిపోయిన వారికి లబ్ధి కల్పించే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్

- కొత్తగా 1.49 లక్షల మందికి సామాజిక పెన్షన్లు.. కొత్త వారికి వచ్చే నెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ
- మొత్తంగా పెన్షన్ల లబ్ధిదారులు 64.27 లక్షలు
- గత ప్రభుత్వంలో కేవలం 39 లక్షలే
- ఈ నాలుగేళ్లలో కొత్తగా 25.27 లక్షల మందికి పెన్షన్లు.. కొత్తగా 2,00,312 మందికి బియ్యం కార్డులు మంజూరు
- ఫలితంగా 1.48 కోట్లకు చేరిన బియ్యం కార్డులు.. కొత్త బియ్యం కార్డుదారులకు వచ్చే నెల నుంచి రేషన్
- కొత్తగా 4,327 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు.. మొత్తంగా 1.42 కోట్లు
- కొత్తగా 12,069 మందికి ఇళ్ల పట్టాలు.. మొత్తంగా 30,84,935 లక్షలు
- 2,62,169 మంది ఖాతాల్లో బటన్ నొక్కి రూ.216.34 కోట్లు జమ



కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్న సీఎం వైఎస్ జగన్

> ప్రతి ఇంట్లో మంచి జరగాలని తాపత్రయ పడుతున్నాం. అధికారం అంటే ప్రజలకు పలు విధాలా మేలు చేయడమే అని నమ్మి.. ఆ దిశగా నాలుగేళ్లుగా అడుగులు వేస్తున్నాం. అర్హత ఉండీ.. ఏ ఒక్కరూ ఏ ఒక్క పథకానికీ దూరం కాకూడదని మళ్లీ మళ్లీ అవకాశం కల్పిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఇలాంటి అవకాశం ఎప్పుడూ లేదనే విషయాన్ని గమనించండి. వాళ్లు పథకాల్లో ఎలా కోతలు కోయాలని చూస్తే.. మనం ఎలా లబ్ధి కలిగించాలని ఆరాటపడుతున్నాం. వాళ్లకు, మనకు మధ్య ఇదీ తేడా.
> – సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కొత్తగా మరో 1,49,875 మందికి సామాజిక పెన్షన్లు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల నుంచి వీరికి పెన్షన్లు అందుతాయని చెప్పారు. అలాగే కొత్తగా 2,00,312 బియ్యం కార్డులు మంజూరు చేశామని, వీరికి వచ్చే నెల నుంచి రేషన్ అందుతుందన్నారు. 4,327 మందికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయడంతో పాటు మరో 12,069 మందికి ఇళ్ల స్థలాలను కూడా ఇస్తున్నామని తెలిపారు. 2022 డిసెంబర్ నుంచి 2023 జూలై వరకు అమలైన వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఏ కారణం చేతనైనా లబ్ధి అందని 2,62,169 మంది అర్హులకు లబ్ధి చేకూరుస్తూ గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి వారి ఖాతాల్లో రూ.216.34 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కడా లంచాలు, వివక్షకు చోటు ఇవ్వకుండా.. కులం, మతం, ప్రాంతం, పార్టీ చూడకుండా.. మనకు ఓటు వేయకపోయిన ఫర్వాలేదు, అర్హత ఉంటే చాలు ప్రతి ఒక్కరికీ కచ్చితంగా లబ్ధి కలిగించాలని తాపత్రయ పడుతూ అడుగులు ముందుకు వేస్తున్న ప్రభుత్వం మనదని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ ఏ కారణం వల్ల అయినా లబ్ధి కలుగకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మేలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఇవాళ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అధికారం అంటే అజమాయిషీ చేయడం కాదని, ప్రజల పట్ల మమకారం చూపడమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

కొత్తగా పింఛన్, బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు

- ఈ ఆరు నెలల్లో కొత్తగా పింఛన్, బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల స్థలాలకు సంబంధించి కూడా కొత్తగా దరఖాస్తు పెట్టుకుంటే.. వెరిఫికేషన్ చేసి మంజూరు చేస్తున్నాం. ఇందులో భాగంగా 1,49,875 మందికి కొత్తగా పెన్షన్‌లు ఇవ్వడంతో.. రాష్ట్రంలో మొత్తం పెన్షన్ల సంఖ్య దాదాపు 64.27 లక్షలకు చేరుకుంది.
- గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు అంటే 2018 అక్టోబర్ వరకు కేవలం 39 లక్షలు మాత్రమే ఉన్నాయి. ఇవాళ ఆ సంఖ్య 64.27 లక్షలకు పెరిగింది. అప్పట్లో ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు అంటే 4 సంవత్సరాల పది నెలల కాలంలో కేవలం రూ.1,000 పింఛన్ మాత్రమే ఇస్తున్న పరిస్థితి. ఇవాళ రూ.2,750 ఇస్తున్నాం.
- ఇప్పుడు కొత్తగా మంజూరు చేసిన 2,00,312 కార్డులతో కలుపుకుంటే.. మొత్తం 1,48,12,934 బియ్యం కార్డులు ఉన్నాయి. అదే విధంగా కొత్తగా మంజూరు చేస్తున్న 4,327 ఆరోగ్యశ్రీ కార్డులతో కలుపుకుంటే.. మొత్తం వాటి సంఖ్య 1,42,15,820కు చేరింది. ఈ రోజు మంజూరు చేస్తున్న ఇళ్ల పట్టాలు 12,069 కలుపుకుంటే.. మొత్తంగా వాటి సంఖ్య 30,84,935కు చేరింది.

జగన్ మళ్లీ సీఎం కావాల్సిందే

రాష్ట్రంలో ప్రజలు ఎప్పుడూ ఆనందంగా ఉండాలని సీఎం జగన్ అనుక్షణం పరితపిస్తున్నారు. ఎక్కడా రూపాయి లంచం లేకుండా శాచురేషన్ మోడ్‌లో పథకాలు అందిస్తున్నారు. మేం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజల్లో జగన్ పట్ల నమ్మకం స్పష్టంగా కనిపించింది. మా మనవడు మాకు మేలు చేస్తున్నారని అవ్వాతాతలు, మా మామ సాయం చేస్తున్నారని చిన్నారులు, మా అన్న వల్ల మేం బాగుపడుతున్నామని అక్కచెల్లెమ్మలు సంతోషంగా చెప్పడం స్వయంగా విన్నాం. ఈ రాష్ట్రానికి జగన్ మళ్లీ సీఎం కావాల్సిందేనని, అప్పుడే ఆనందంగా ఉంటామని ప్రజలు చెబుతున్నారు.
– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

పేదల కళ్లలో ఆనందం

పారదర్శకత, కుల మతాలకు.. ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ లబ్ధి కల్పించడం, జవాబుదారీతనం ప్రతి దశలోనూ కనిపిస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగింది. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా రూ.2.33 లక్షల కోట్లు సాయం చేయడం దేశంలోనే రికార్డు. గత ప్రభుత్వాలు ఎన్నడూ ఇలా చేయలేదు. ఏ పథకాలు ఎవరికి ఇచ్చారో తెలియని పరిస్థితి. ఇప్పుడు అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూరుస్తున్నారు. ప్రతి పేదవాడి కళ్లలో సంతోషం కనిపిస్తోంది. ఇది ప్రతిపక్షాలకు కంటగింపుగా మారింది.
– ఆదిమూలపు సురేష్, మంత్రి

వివిధ పథకాల కింద 2.62 లక్షల మందికి లబ్ధి

- జగనన్న చేదోడు కార్యక్రమం ద్వారా 43,170 మందికి మళ్లీ లబ్ధి కలిగిస్తున్నాం. 207 మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా అందిస్తున్నాం. 1,08,000 మంది రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నాం. జగనన్న విద్యా దీవెన సొమ్మును మరో 32,770 మంది తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.
- జగనన్న వసతి దీవెన ద్వారా 36,898 మంది తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. 8,753 మందికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం, 267 మందికి వైఎస్సార్ నేతన్న నేస్తం, 16,717 మందికి జగనన్న అమ్మఒడి.. ఇలా మొత్తంగా 2.62 లక్షల మందికి వివిధ పథకాలను అందిస్తున్నాం.

94,62,184 మందికి సర్టిఫికెట్లు

- రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 15,004 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రతి ఇంటికీ వెళ్లి.. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాలకు అర్హులైన వారెవరూ మిగిలిపోకూడదన్న తపనతో ఈ కార్యక్రమం చేపట్టాం. ఇందులో భాగంగా 94,62,184 మందికి వివిధ సర్టిఫికెట్లు ఇచ్చాం.
- ఇలా ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు 12,405 మంది అర్హులై ఉండి.. వివిధ కారణాల వల్ల మిగిలిపోయిన వారికి కూడా లబ్ధి చేకూరుస్తున్నాం. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా.. కాల్ సెంటర్‌కు ఫోన్ చేసిన 1,630 మంది కూడా అర్హులని తేలడంతో వారికి కూడా మంచి చేస్తున్నాం.

మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటాం



నమస్తే సార్.. నేను చేనేత కార్మికుడిని. గతంలో కూలి మగ్గం నేసేవాడిని. ఇప్పుడు సొంత మగ్గం నేస్తున్నాను. గత జూలైలో నేతన్న నేస్తం పథకానికి దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ సమయంలో లేకపోవడంతో రాలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు అప్రూవ్ అయ్యి డబ్బులు రావడంతో సంతోషంగా ఉంది. ఈ డబ్బుతో పనితనం మరింత మెరుగు పరుచుకుంటాను. మీ వల్ల సొంతింటి కల నెరవేరింది. ఇతర పథకాలు కూడా అందుతున్నాయి. స్కూళ్ల స్వరూపం పూర్తిగా మార్చేశారు. సచివాలయంలోనే అన్ని పనులు జరుగుతున్నాయి. మళ్లీ మిమ్మల్నే గెలిపించుకుంటాం.
– నాగేశ్వు, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా

ఇలాంటి పాలన చూడలేదు



అన్నా.. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మ ఒడి మూడో విడత రాలేదు. ఎందుకు రాలేదని బాధ పడుతుండగా, వలంటీర్ వచ్చి మీ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ కాలేదన్నారు. లింక్ చేసి వలంటీర్‌కు చెప్పాక అమ్మ ఒడి వచ్చింది. గతంలో ఏదైనా పథకం కోసం మేం ఆఫీస్‌ల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు గడప దగ్గరకే అన్నీ వస్తున్నాయి. మా పాలిట మీరు దేవుడు అన్నా. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిపాలన చూడలేదు.
– కళ్యాణి, భీమిలి మండలం, విశాఖపట్నం జిల్లా

డైనమిక్ లీడర్ అంటే మీరే..



అన్నా నమస్కారం.. నేను 15 ఏళ్లుగా టైలరింగ్ వృత్తిలో ఉన్నాను. టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల రెండోసారి చేదోడు పథకం కింద లబ్ధిపొందలేకపోయాను. తిరిగి దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు మంజూరైంది. మా ఇద్దరు పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివించలేకపోయాననే బాధ గతంలో ఉండేది. ఇప్పుడు కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ స్కూల్స్‌ను మార్చారు. ఇంత మార్పు వస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు. అందరూ లీడర్స్ అవుతారు కానీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయే డైనమిక్ లీడర్ మీరే అన్నా..
– నాగరాజు, తిమ్మాయపాలెం, అద్దంకి మండలం, బాపట్ల జిల్లా

సీఎంను కలిసిన ‘గల్ఫ్ సమన్వయకర్తలు’



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: గల్ఫ్ దేశాలకు చెందిన పలువురు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సమన్వయకర్తలు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు గురువారం సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. గల్ఫ్ దేశాల్లోని ఏపీ వాసులకు అందిస్తున్న సాయం.. వారి సంక్షేమా చర్చించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ, సహకారాలు అందుతున్నట్లు వివరించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం (మైనార్టీ వెల్ఫేర్) అంజాద్ బాషా, ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ ప్రెసిడెంట్ వెంకట్ ఎస్.మేడపాటి, కువైట్ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజనల్ కోఆర్డినేటర్‌లు నాయని మహేష్‌రెడ్డి, ఎంవీ నరసారెడ్డి, దుబాయ్ కోఆర్డినేటర్ సయ్యద్ నాసర్ వలీ, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, ఖతార్ కన్వీనర్ డి.శశికిరణ్, దుబాయ్ కన్వీనర్ సయ్యద్ అక్రమ్, సౌదీ అరేబియా కన్వీనర్ రెవెల్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు హజ్ పవిత్ర జలం

డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్ బాషా, హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి హజ్ పవిత్ర జలాన్ని అందజేశారు.

కేంద్ర గిరిజన వర్సిటీకి నేడు సీఎం శంకుస్థాపన

- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో పనులు ప్రారంభించనున్న సీఎం జగన్
- విజయనగరం జిల్లాలో రూ.834 కోట్లతో 561.88 ఎకరాల్లో ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజనుల జీవితాల్లో విద్యా కుసుమాలు విరబూసేలా విజయనగరం జిల్లా సాలూరులో ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. విజయనగరం జిల్లా మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో 561.88 ఎకరాల్లో, రూ.834 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఈ విశ్వవిద్యాలయానికి కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారు.

విభజన హామీల్లో ఒకటైన ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటును గత చంద్రబాబు ప్రభుత్వం గాలికొదిలేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకున్నారు.

గిరిజన ప్రాంతంలోనే యూనివర్సిటీ

గిరిజన విశ్వవిద్యాలయం గిరిజన ప్రాంతంలోనే ఏర్పాటు చేయాలనే సత్సంకల్పంతో దత్తిరాజేరు మండలం మర్రివలస, మెంటాడ మండలం చినమేడపల్లి పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు భూమి సేకరించారు. విశాఖపట్నం–రాయగడ జాతీయ రహదారికి సమీపంలో, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి రైల్వే స్టేషన్లకు అందుబాటులో ఉండేలా స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందుకోసం భూములిచ్చిన రైతులకు రూ.29.97 కోట్ల పరిహారం చెల్లించారు. మౌలిక వసతుల కల్పనకు మరో రూ. 28.49 కోట్లు ఖర్చు చేశారు.

అందించే కోర్సులు

ఈ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఇంగ్లిష్, సోషియాలజీ, ట్రైబల్ స్టడీస్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, జర్నలిజం, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, డిగ్రీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, బి.కామ్‌లో ఒకేషనల్ తదితర 14 కోర్సులను అందిస్తారు. వీటితో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, ఒకేషనల్, జాబ్ ఓరియెంటెడ్ షార్ట్ టర్మ్ కోర్సులను కూడా అందిస్తారు. గిరిజన తెగల వ్యక్తిగత, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధిని ఈ యూనివర్సిటీ ద్వారా ప్రోత్సహిస్తారు. ఇప్పటికే విజయనగరం జిల్లా కొండకరకంలోని ఆంధ్రా యూనివర్సిటీ పాత పీజీ క్యాంపస్ భవనాల్లో నిర్వహిస్తున్న వర్సిటీ తరగతుల్లో 385 మంది విద్యార్థులున్నారు.

ఇంటికే ‘ఆరోగ్యం’!

ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించాలి: సీఎం జగన్



వైద్య ఆరోగ్య శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ సేవలను ఎలా పొందాలనే అంశంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఆరోగ్యశ్రీ సమాచారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేసి రూ.5 లక్షలు లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకాన్ని వర్తింపజేస్తున్నామని, తద్వారా రాష్ట్రంలో 95 శాతం జనాభాను పథకం పరిధిలోకి తెచ్చామని తెలిపారు. ఈ క్రమంలో పథకం కింద రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా ఉచితంగా వైద్య సేవలను పొందటంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇందుకోసం వచ్చే నెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఆరోగ్యశ్రీ పథకం, నాడు–నేడు, వైద్య శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల పురోగతిని అధికారులు వివరించారు. 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు ప్రగతిని సీఎం అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాలల నిర్మాణం వేగంగా ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభమైన నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం కొత్త కళాశాలల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లకు మంచి స్పందన వచ్చిందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో ప్రవేశాలు పొందడానికి ప్రైవేట్ కంటే ప్రభుత్వ కళాశాలల వైపే విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. వచ్చే ఏడాది పులివెందుల, పాడేరు, ఆదోని మార్కాపురం, మదనపల్లె మెడికల్ కళాశాలలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కళాశాలలు, బోధనాస్పత్రుల కోసం ఇప్పటికే పోస్టులను కొత్తగా సృష్టించిన నేపథ్యంలో భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. 2025–26లో మిగిలిన ఏడు మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నామన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

సమగ్ర వివరాలతో బుక్‌లెట్

గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్ మాత్రమే ఉండేవి. మన ప్రభుత్వం వచ్చాక వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే ప్రతి ప్రొసీజర్స్‌ను పథకంలోకి తెచ్చి ప్రొసీజర్లను ఏకంగా 3,257కు పెంచాం. నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను గణనీయంగా పెంచి హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా మనవారికి ఉచిత వైద్యం అందిస్తున్నాం. ఈ క్రమంలో వచ్చే నెల 15 నుంచి ప్రారంభించే ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమంలో ప్రతి కుటుంబానికి పథకం గురించి సమగ్ర వివరాలతో బుక్‌లెట్ అందజేయాలి. ఆ బుక్‌లెట్‌ను చూస్తే పథకం సేవలను ఎలా పొందాలి? ఏ సేవలు ఉంటాయి? లాంటి అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన రావాలి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్‌ఎం, ఆశావర్కర్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ గురించి సవివరంగా తెలియజేయాలి. అనారోగ్యం బారినపడినా, దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగినా ఆరోగ్యశ్రీ కింద ఎలా చికిత్స పొందాలన్న దానిపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలి. ప్రజలు ఉంటున్న ప్రాంతానికి అత్యంత సమీపంలోని నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఎలా చికిత్స పొందాలో వివరించాలి. ఆరోగ్యశ్రీ సేవలపై సంపూర్ణ సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడమే కాకుండా సమర్థంగా సేవలు అందుకునేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే పథకం సేవలపై యాప్ తీసుకొచ్చాం. ఒక్క యాప్ ద్వారానే కాకుండా కాల్ సెంటర్ల ద్వారా కూడా సేవలు పొందడంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలి.

- సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి డా.మంజుల, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి, సీఈవో హరేందిరప్రసాద్, సలహాదారు గోవిందహరి, ప్రత్యేకాధికారి అశోక్‌బాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ వెంకటేశ్వర్, ఫైనాన్స్ సెక్రటరీ గుల్జార్, డీఎంఈ డాక్టర్ నరసింహం, నాడు–నేడు డైరెక్టర్ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా నిర్వహణ

వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్మాణం, పరికరాలు సమకూర్చడం ఎంత ముఖ్యమో వాటిని ఉత్తమంగా నిర్వహించడం కూడా అంతే ముఖ్యం. అలా చేయకపోతే పరిస్థితులు మళ్లీ మొదటికే వస్తాయి. ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్వహణ అత్యంత సమర్థంగా ఉండాలి. నిర్వహణకు నిధుల సమస్య రాకుండా చూసుకోవాలి. ఇందుకోసం ఒక విధానం తీసుకురావాలి. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద అందించే సేవలకుగాను ప్రభుత్వం నుంచి వెళ్లే నిధులు ఆయా ఆస్పత్రుల నిర్వహణకు వినియోగించేలా ఒక పద్ధతి తీసుకురావాలి. ఇలా చేయకపోతే ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల నిర్వహణ నాణ్యతతో చేయడం కష్టం. అలాగే ప్రభుత్వ విద్యా సంస్థలకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బుల్లో కూడా కొంత ఆయా సంస్థల నిర్వహణకు వినియోగించేలా ఒక విధానం తేవాలి. అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువచేయడానికి అత్యంత ప్రతిష్టాత్మకంగా 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నాం. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు ఏర్పాట్ల పనులు పూర్తి కావాలి. పాలకొల్లు, పార్వతీపురం కళాశాలల పనులను మరింత వేగవంతం చేయాలి.

ఫిర్యాదులు చేయడంపై అవగాహన ఉండాలి

ఆరోగ్యశ్రీ సేవలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, లంచాల ప్రస్తావన వచ్చినా వెంటనే ఫిర్యాదు చేసేలా కూడా ప్రజలకు అవగాహన కల్పించాలి. ఫిర్యాదులకు సంబంధించిన నెంబర్లను కూడా ప్రజలకు తెలియచెప్పాలి. నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆయా ప్రాంతాల్లో తప్పనిసరిగా హెల్త్ క్యాంపులు నిర్వహించాలి. ఈ విధానం కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. విలేజ్ క్లినిక్స్, సచివాలయ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఈ శిబిరాలు అమలు జరిగేలా చూడాలి.

డిశ్చార్జ్ అయిన రోజే ‘ఆసరా’

ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేసిన రోగులకు వైద్యులు సూచించిన విశ్రాంత సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద నెలకు రూ.5 వేల వరకూ జీవన భృతి ఇస్తున్నాం. రోగికి అందించే ఈ సాయాన్ని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రోజే ఇవ్వాలి. దీనికి కావాల్సిన ఎస్‌ఓపీని రూపొందించండి.

వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లకు వ్యతిరేకంగా..
ఒక్క సాక్ష్యమూ లేదు

- హియర్ సే ఎవిడెన్స్... చట్ట ప్రకారం చెల్లదు
- ఎన్నికల గొడవలు అన్నది ఓ కల్పన మాత్రమే
- గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికమని ఆ సంస్థే చెప్పదు
- వీటి ఆధారంగా నిందితులుగా పేర్కొనడం చెల్లదు
- సీబీఐ దర్యాప్తు అంతా తప్పులతడకగా ఉంది
- తెలంగాణ హైకోర్టులో వైఎస్ భాస్కర్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు
- బెయిల్ పిటిషన్లపై తీర్పును రిజర్వు చేసిన న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డిలను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఉద్దేశపూర్వకంగా ఇరికించిందని, వారికి వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం కూడా లేదని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో సుదీర్ఘ వాదనలు వినిపించారు. ఎన్నికలు, సీట్ల గొడవలు లేవని, గూగుల్ టేక్ అవుట్‌ను ఆ సంస్థే సర్టిఫై చేయడం లేదని నివేదించారు. నిందితులు ఏ 1 నుంచి ఏ 4 వరకు వివేకాను హత్య చేయడానికి వేర్వేరు కారణాలున్నాయన్నారు. గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి వెనుక శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ఉన్నారని 'హియర్ సే ఎవిడెన్స్' ఆధారంగా పేర్కొనడం చెల్లదన్నారు. కిరాయి హంతకుడు చెప్పినా, చట్టప్రకారం చెల్లని దాన్ని సాక్ష్యంగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. సీబీఐ దర్యాప్తు అంతా తప్పులతడకగానే సాగిందన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం లేనందున బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు తమ బెయిల్ పిటిషన్లను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు.

దర్యాప్తు ఇప్పటికే పూర్తయ్యింది

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'జూన్ 30 నాటికే దర్యాప్తు పూర్తయింది. కేవలం దస్తగిరి వాంగ్మూలం మినహా నేరం మోపడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఢిల్లీలో రెండున్నర నెలలు సీబీఐ వద్ద ఉన్న దస్తగిరి ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. ఆ తర్వాత ముందస్తు బెయిల్‌కు అనుమతి రాగానే నేరాన్ని అంగీకరిస్తూ అప్రూవర్‌గా మారాడు. బెయిల్ ఇచ్చే సమయంలో ఎలాంటి షరతులు విధించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ముందస్తు బెయిల్ ఇచ్చిన వెంటనే క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. దీనికి సంబంధించి కేసు రికార్డులను కోర్టు ముందు ఉంచలేదు. క్షమాభిక్ష పిటిషన్‌లో దస్తగిరికి సీబీఐ పూర్తిగా సహకరించింది. కడప కోర్టు రికార్డులను పరిశీలించకుండానే క్షమాభిక్షను ఆమోదించింది. రికార్డులన్నీ పులివెందుల కోర్టులో ఉండగా కడప కోర్టు నిర్ణయం తీసుకుంది. కేసు వివరాలేమిటో కూడా తెలియకుండా క్షమాభిక్షను ఎలా మంజూరు చేస్తారు? గూగుల్ టేక్ అవుట్ అనేది చట్టపరంగా చెల్లదు. తమ గూగుల్ టేక్ అవుట్ ప్రామాణికం అని ఆ సంస్థే సర్టిఫికెట్ ఇవ్వడంటే దాన్ని ప్రామాణికతను అర్థం చేసుకోవచ్చు. సీబీఐ అధికారి రాంసింగ్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఆయనపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో అత్యున్నత న్యాయస్థానం కేసు దర్యాప్తు బాధ్యత నుంచి ఆయన్ను తప్పించి మరొకరిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది' అని నివేదించారు.

రాజకీయ విభేదాలు లేవని సునీతే చెప్పారు

'కేవలం ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సీబీఐ దర్యాప్తు జరిపింది. వివేకాకు అవినాశ్‌రెడ్డి కుటుంబంతో రాజకీయ విభేదాలున్నాయని చెప్పడం కేవలం ఊహాజనితమే. అవినాశ్‌రెడ్డి అప్పటికే కడప ఎంపీగా ఉన్నారు. తర్వాత ఎంపీ టికెట్ కూడా పార్టీ అధిష్టానం ఆయనకే ఇచ్చింది. వివేకా కూడా అవినాశ్ తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే విషయాన్ని హత్య జరిగిన తర్వాత వివేకా కుమార్తె సునీత కూడా మీడియాకు వెల్లడించారు. అవినాశ్‌రెడ్డి తొలిసారి ఎంపీగా గెలవడంలో తన తండ్రి కీలక పాత్ర పోషించారని చెప్పారు. అంటే వివేకాకు అవినాశ్ కుటుంబంతో ఎలాంటి విభేదాలు లేవని తెలుస్తోంది. వివేకా ఇంట్లో కనిపించకుండా పోయిన పత్రాలు, ఆయన రాసిన లేఖ గురించి సీబీఐ అసలు పట్టించుకోలేదు. వాచ్‌మెన్ రంగన్న స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చినా దాన్ని పక్కన పెట్టింది. ఏ–1 నుంచి ఏ–3 వరకు వివేకాను హత్య చేసేందుకు ఒక్కొక్కరికి ఒక్కో కారణం ఉంది. ఇక ఏ–4 దస్తగిరి ఓ కిరాయి హంతకుడు. డబ్బు కోసమే వివేకా హత్యలో పాల్గొన్నానని చెప్పాడు. ఒక్క దస్తగిరితోనే తమకు కావాల్సిన విధంగా స్టేట్‌మెంట్ తీసుకుని కావాలనే కొందరిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. ఓ ఐఏఎస్ స్థాయి అధికారి నుంచి వాంగ్మూలం ఎలా తీసుకోవాలో కూడా సీబీఐకి తెలియదు. చట్టప్రకారం అనుసరించాల్సిన విధానాన్ని పాటించలేదు. ఐఏఎస్ అధికారి వద్ద వాంగ్మూలం తీసుకుంది ఒకరైతే.. చార్జిషీట్‌లో సంతకం పెట్టింది మరొకరు. ఇలా అడుగడుగునా సీబీఐ విచారణంతా తప్పుల తడకగానే సాగింది' అని నిరంజన్‌రెడ్డి వెల్లడించారు.


వెంటనే బెయిల్ ఇవ్వాలి..

'72 ఏళ్లు పైబడిన వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆరోగ్యం సరిగా లేక తీవ్రంగా సతమతం అవుతున్నారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. ఎలాంటి ఆధారాలు లేకుండానే సీఆర్‌పీసీ 120 బీ, 202 కేసులు పెట్టారు. నిందితులిద్దరూ నాలుగు నెలలుగా జైలులో ఉంటున్నారు. సీబీఐ దర్యాప్తు ముగిసింది. చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. గతంలో రెండు చార్జిషీట్లు వేశారు. నిందితులకు వ్యతిరేకంగా ప్రాథమికంగా ఒక్క ఆధారం కూడా లేదు. ఈ అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకొని వెంటనే భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌లకు బెయిల్ మంజూరు చేయాలి' అని నిరంజన్‌రెడ్డి కోరారు. వివేకా హత్యతో ఈ ఇద్దరికీ సంబంధం ఉందని, బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ తరఫున అనిల్ థోమర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం 29న

వివేకా హత్య కేసులో ఏ–5 శివశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఈనెల 29న నిర్ణయం తీసుకుంటామని సీబీఐ కోర్టు పేర్కొంది. బెయిల్ పిటిషన్‌లో వాదనలు పూర్తయ్యాయి. దర్యాప్తు పూర్తిచేసి సీబీఐ చార్జిషీట్ వేసిందని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి సీహెచ్. రమేశ్‌బాబు విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో తీర్పును వాయిదా వేశారు.

సమున్నతం!



▶ మొదటి పేజీ తరువాయి

మరో రూ.132.41 కోట్లను 1,858 మంది విద్యార్థులకు అందచేసి ఉన్నత చదువులకు అండగా నిలిచింది. మరోవైపు ఇంజనీరింగ్‌తో పాటు సంప్రదాయ డిగ్రీ కోర్సులు చదివిన వారికి చక్కటి ఉపాధి, ఉద్యోగాలు లభించేలా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టింది.

తొలిసారిగా ప్రైవేట్ వర్సిటీల్లో 35 శాతం సీట్ల కోటా

ప్రైవేట్ వర్సిటీల్లో రూ.5 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సిన ఇంజనీరింగ్ లాంటి కోర్సులకు సంబంధించి దేశంలోనే తొలిసారిగా ఆ వర్సిటీల్లో 35 శాతం సీట్ల కోటాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తద్వారా పేద మెరిట్ విద్యార్థులకు వాటిల్లో చదువుకునే అవకాశాన్ని కల్పించింది.

27 వేల సంస్థల్లో ఇంటర్న్‌షిప్

గతంలో డిగ్రీ చేతికొచ్చినా తగినన్ని నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగం, ఉపాధి లభిస్తుందన్న నమ్మకం లేదు. దీన్ని సరిదిద్ది నూతన బోధనా విధానాలపై శిక్షణ కార్యక్రమాలతోపాటు ఎడెక్స్ లాంటి ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ సంస్థల ద్వారా సర్టిఫికేషన్ కోర్సులను అందుబాటులోకి తెస్తోంది. ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది. ఇంజనీరింగ్ తదితర ప్రొఫెషనల్ కోర్సులకు ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ అమలు చేస్తుండగా నాన్ ప్రొఫెషనల్ కోర్సుల్లో నాలుగేళ్ల డిగ్రీ (ఆనర్స్) కోర్సులు చదివే వారికి ఏడాది ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టారు. మూడేళ్లలో డిగ్రీ కోర్సు నుంచి బయటకు వచ్చేవారికి 10 నెలల ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేసింది. జిల్లాకు ఒక డిగ్రీ కాలేజీని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతోంది. ఇంటర్న్‌షిప్ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని 27,119 సంస్థలను గుర్తించారు. వీటిలో ఏపీ జెన్‌కో, హ్యుందాయ్, కియా మోటార్స్, విప్రో, అమర్‌రాజా బ్యాటరీస్, కోల్గేట్ పామోలివ్ (ఇండియా) లిమిటెడ్, హీరో మోటోకార్ప్ లిమిటెడ్, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, సెంబ్‌కార్ప్ ఎనర్జీ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, మైలాన్ లేబొరేటరీస్ లిమిటెడ్ లాంటి ప్రముఖ సంస్థలున్నాయి. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ లాంటి కోర్సులు చదివిన 2,91,022 మంది విద్యార్థులు తమ సర్టిఫికేషన్‌ను పూర్తి చేయడం విశేషం. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ కోసం యునిసెఫ్‌కు అనుబంధంగా ఐదు లక్షల మంది విద్యార్థులు తమ కోర్సును పూర్తి చేశారు.

ఉపాధికి ఊతమిచ్చేలా కోర్సులు

రాష్ట్రంలో 152 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, 111 ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలు, 1,022 ప్రైవేట్ డిగ్రీ కాలేజీలున్నాయి. వీటిలో మొత్తం 3,65,563 సీట్లుండగా 2 లక్షల నుంచి 2.5 లక్షల సీట్లే భర్తీ అవుతున్నాయి. కాలేజీ విద్యను పటిష్టం చేయడంలో భాగంగా ప్రమాణాలు పాటించని విద్యాసంస్థల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 30 మంది కన్నా తక్కువ చేరికలున్న కాలేజీలకు ముందుగా నోటీసులిచ్చి ఆ తర్వాత మూసివేతకు, కోర్సుల రద్దుకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఇతర కాలేజీలకు తరలించేలా ఏర్పాట్లు చేసింది. అన్ని డిగ్రీ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలోనే బోధించాలని నిర్ణయించి అమల్లోకి తెచ్చింది.

యూజీసీ కంటే ముందే ఉమ్మడి పీజీసెట్

దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు ఒకే ప్రవేశ పరీక్ష ఉండాలని సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు (సీయూఈటీ)ని యూజీసీ అమల్లోకి తెచ్చింది. దీనిద్వారా విద్యార్థులకు బహుళ పరీక్షలు రాసే ఇబ్బంది తప్పడంతో పాటు ఫీజుల వ్యయమూ తగ్గుతుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం యూజీసీ కంటే ముందే అన్ని యూనివర్సిటీల్లో పీజీ కోర్సులకు 2021లోనే కామన్ ఎంట్రన్స్ టెస్టును అమల్లోకి తెచ్చింది. యూజీసీ ఆలోచనలను ఏడాది ముందుగానే అమల్లోకి తెచ్చింది. విద్యారంగ సంస్కరణల్లో ఆంధ్రప్రదేశ్ అందరి కంటే ఒక అడుగు ముందే ఉంది.

జాతీయ సగటుకు మించి జీఈఆర్

పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తుండడంతో మన రాష్ట్రంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) గణనీయంగా పెరిగింది. 2020–21లో దేశంలో సగటు జీఈఆర్ 27.3 శాతం ఉండగా రాష్ట్రంలో 37.2 శాతంగా నమోదైంది. కాలేజీల్లో ఎస్సీ విద్యార్థుల చేరికల పెరుగుదలలో జాతీయ స్థాయిలో కంటే మన రాష్ట్రం మెరుగ్గా ఉంది. చదువుల వ్యయంతోపాటు ఇంటర్న్‌షిప్, స్కిల్ కోర్సులను అందిస్తుండటంతో జీఈఆర్ గణనీయంగా పెరిగింది. కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు యువతుల వివాహ వయసు 18 ఏళ్లు నిండడంతో పాటు 10వ తరగతి చదవడం తప్పనిసరి అనే నిబంధన విధించడంతో బాలికల విద్యా రేటు పెరిగింది. వీరిలో 50 శాతా నికి పైగా యువతులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

బడ్జెట్‌లో భారీగా నిధులు

యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ప్రత్యేక శిక్షణ సంస్థలనూ నెలకొల్పుతున్నారు. ఇందుకోసం 2022–23 బడ్జెట్‌లో రూ.969.91 కోట్లు కేటాయించడం గమనార్హం. 2035 నాటికి అన్ని కాలేజీలు స్వయం ప్రతిపత్తితో డిగ్రీలను ప్రదానం చేసే సంస్థలుగా ఎదగాలన్న యూజీసీ లక్ష్యం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కాలేజీల్లో విద్యలో సంస్కరణలను అమలు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డ్యూయల్ మేజర్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఆనర్స్) ప్రవేశపెట్టింది. 144 కాలేజీల్లో వర్చువల్ క్లాస్ రూములను ఏర్పాటు చేసి అధునాతన విధానాల్లో బోధించేలా చర్యలు తీసుకుంది. ఐసీటీ ఆధారిత బోధన, అభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు 56 కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూములను నెలకొల్పారు.

భారీగా ప్లేస్‌మెంట్స్

విద్యార్థులకు సాంకేతిక శిక్షణ అందించేందుకు నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్‌తో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంతో లక్ష మంది విద్యార్థులు మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబీఎం, సేల్స్‌ఫోర్స్ వంటి కంపెనీల్లో వర్చువల్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారు. ఎడ్యుస్కిల్, సేల్స్‌ఫోర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో మరో 1.45 లక్షల మంది విద్యార్థులు నైపుణ్యాభివృద్ధి కోర్సులు పూర్తి చేశారు. లక్షల మంది విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం చేసుకున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గమనార్హం. వీటివల్ల ప్లేస్‌మెంట్స్ గణనీయంగా పెరిగాయి. క్యాంపస్ ఎంపికల్లో 2019–20లో 52 వేల మంది, 2020–21లో 69 వేల మంది, 2021–22లో 85 వేల మంది ఉద్యోగాలు పొందగా 2022–23లో ఈ సంఖ్య 1.20 లక్షలకు పెరగడం విశేషం.

నైపుణ్యాలకు పదును

విద్యార్థులను ఉత్తమ రీతిలో తీర్చిదిద్దాలంటే అధ్యాపకులకు నైపుణ్యాలపై శిక్షణ అవసరం. ఇందుకోసం 400 మంది అధ్యాపకులకు వరంగల్‌లోని ఎన్ఐటీలో మరో వెయ్యి మంది అధ్యాపకులకు ఆన్‌లైన్ ద్వారా ఈ–కంటెంట్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు నచ్చిన సమయంలో కోరుకున్న సబ్జెక్టును చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. వీడియో పాఠాలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సమస్యలకు పరిష్కారాలు, ప్రశ్నాబ్యాంకు లాంటి వనరులను అందుబాటులో ఉంచుతున్నారు. 3,146 వీడియోలను సిద్ధం చేసి ఎల్ఎంఎస్‌కు జోడించారు. న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల ద్వారా కళాశాలల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు డిపార్ట్‌మెంట్ అకడమిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్‌ను ప్రభుత్వం చేపట్టింది.

డేంజర్ జోన్‌లో టీడీపీ..

దక్షిణ కోస్తా జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి. పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ స్థానాన్ని కూడా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకై వసం చేసుకుంటుందని దక్షిణ కోస్తా జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. పల్నాడులో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో నాయకులందరూ కలిసికట్టుగా పనిచేస్తున్నారని, పార్టీ పటిష్టంగా ఉందని.. కానీ, పచ్చ పార్టీ ప్రస్తుతం ఎరుపు రంగులో (డేంజర్ జోన్) ఉందన్నారు. ఇటీవల టైమ్స్ నౌ, ఇండియా టుడే వంటి జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వైఎస్సార్‌సీపీ 2024 ఎన్నికల్లో 24 నుంచి 25 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తుందని వెల్లడైందని, ఈ లెక్కన 175 అసెంబ్లీ స్థానాలకు 175 కూడా వైఎస్సార్‌సీపీ గెలుచుకునే అవకాశముందని సర్వేలు చెబుతున్నాయన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ గత ఎన్నికల్లో వచ్చిన 151కు మించి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

చంద్రయాన్ విజయాన్ని దేశ ప్రజలందరూ పండగ చేసుకుంటే అందులో చంద్రబాబు పేరుందని టీడీపీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. అలాగే, చంద్రయాన్ విజయం సాధించినట్లుగానే బాబూ విజయం సాధిస్తాడని ప్రచారం చేసుకుంటున్నారు. తాము అధికారంలోకి వస్తే తంతాం, పొడుస్తాం, చంపుతాం, గుడ్డలు ఊడదీస్తాం, ఉచ్చపోయిస్తాం అంటూ చంద్రబాబు, లోకేశ్‌లు అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారు.. అంత కుతూహలమే ఉంటే వారిద్దరూ సులభ్ కాంప్లెక్స్‌లు పెట్టుకోవాలి. అసలు ఆ పార్టీలో ఉన్నవాళ్లంతా సంఘ వ్యతిరేక శక్తులే. వాళ్లు హంతకులమని వారే ప్రచారం చేసుకుంటున్నారు.

చంద్రబాబు పిచ్చి పీక్స్‌కు..

విజయవాడలో యువగళం ముగించుకుని 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలూరులో నడన్గా లేచానని, లోకేశ్ చెప్పుకోవడం విఠలాచార్య సినిమాను తలపిస్తోంది. అలాగే, అందరికీ తావీద్ పంపిస్తున్నానని, అది కట్టుకుంటే కష్టాలు తీరిపోతాయని, తాను భగవంతుడికి అనుసంధానకర్తనని చంద్రబాబు చెబుతుండడం చూస్తే అతని పిచ్చి పీక్స్‌కు చేరినట్లు అర్థమవుతోంది. ఇప్పటికే అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న చంద్రబాబు 2047లో ఏ పరిస్థితిలో ఉంటాడో అర్థంచేసుకోవచ్చు. పచ్చ పార్టీ పతనమైపోతోందంటే కాషాయంలో ఉన్న పచ్చ బ్యాచ్ జీర్ణించుకోలేకపోతోంది. చంద్రబాబు స్క్రిప్టునే బీజేపీలో ఉన్న పురందేశ్వరి, సుజనాచౌదరి, సీపీఐ నారాయణ చదువుతున్నారు. చంద్రబాబు, లోకేశ్‌లు రాష్ట్రానికి పట్టిన అరిష్టం.

వారు అధికారంలోకి రాలేరు..

చంద్రబాబు, లోకేశ్ 2024లోనే కాదు, 2029, 2034లోనూ అధికారంలోకి రాలేరు. ఇక చిలకలూరిపేట సమావేశం జరిగినప్పుడు నాతో పాటు మంత్రి విడదల రజిని, ఆమె మరిది గోపి గంటన్నర పాటు చర్చించాం. కానీ, ఈనాడు పత్రిక ఏవేవో ఊహించుకుని ఇష్టమొచ్చినట్లు రాసింది. ఇక సజ్జల భార్గవ సారథ్యంలో పార్టీ సోషల్ మీడియా అద్భుతంగా పనిచేస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో సోమవారం సమావేశం అవుతున్నాం. టీడీపీ ఎన్ని దొంగ ఓట్లు చేర్పించిందో నిరూపిస్తాం. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, 'మండలి' చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిబంధనలను అనుసరించి
సోదాలు చేయొచ్చు

- నోటీసు ఇచ్చి లేదా ఇవ్వకుండా సోదాలు చేయొచ్చు
- చట్ట ప్రకారం తప్ప మార్గదర్శిలో ఎలాంటి సోదాలు చేపట్టొద్దు
- హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: చిట్‌ఫండ్ చట్ట నిబంధనల ప్రకారం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన అన్ని శాఖల్లో సోదాలు చేయవచ్చని హైకోర్టు స్పష్టంచేసింది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 46 ప్రకారం చిట్ పుస్తకాలు, రికార్డులను తనిఖీ చేసే అధికారం రిజిస్ట్రార్‌కు ఉందని తెలిపింది. అలాగే ప్రభుత్వం నియమించే అధీకృత అధికారి కూడా పని వేళలు లేదా పని దినాల్లో నోటీసు ఇచ్చి లేదా నోటీసు ఇవ్వకుండా తనిఖీలు చేయవచ్చని చెప్పింది. మార్గదర్శి రోజువారీ వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా సోదాలు చేయొచ్చని, ఈ విషయంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలను గౌరవించాలని తెలిపింది. చట్ట నిబంధనలకు అనుగుణంగా తప్ప, మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో ఎలాంటి సోదాలు నిర్వహించడానికి వీల్లేదంది. సీఐడీ లేదా ఇతర అధి కారులు సోదాల పేరుతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ వ్యా పార కార్యకలాపాలకు ఇబ్బంది కలిగించడానికి వీల్లేదని చెప్పింది. డిప్యూటీ రిజిస్ట్రార్ కొందరికి ఆథరైజేషన్ ఇవ్వడం చిట్స్ ఇన్‌స్పెక్టర్ల నియామకం కిందకు రాదని పేర్కొంది. అలాంటి ఆథరైజేషన్ అనుమతించదగ్గదా కాదా అన్న విషయాన్ని లోతుగా విచారిస్తామంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తమ సంస్థకు చెందిన అన్ని శాఖల్లో చిట్ రిజిస్ట్రార్లు చేస్తున్న సోదాలను సవాలు చేస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సోదాల నిమిత్తం జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను స్టే చేయడంతో పాటు తమ సంస్థ కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకుండా అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అనుబంధ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య రెండు రోజుల క్రితం మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ వాదనలు విని తన నిర్ణయాన్ని వాయిదా వేశారు. బుధవారం ఆయన తన నిర్ణయాన్ని వెలువరిస్తూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ శాఖల్లో సోదాలను నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే చట్ట ప్రకారం సోదాలు చేసేందుకు అనుమతినిచ్చారు.

మార్గదర్శిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

- సామర్లకోటలో ఫిర్యాదు చేసిన బాధితుడు
- మార్గదర్శిలో 2020 మార్చిలో రూ. లక్ష చిట్లు రెండు వేసిన మోజెస్
- నాలుగు నెలల తర్వాత ఒకటి పాడినట్లు వెల్లడి
- రూ.80 వేలు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని ఫిర్యాదు

సామర్లకోట: మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థలో చిట్టీ పాడుకొన్నప్పటికీ, సొమ్ము ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు. సామర్లకోట సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం కాకినాడలోని డెయిరీ ఫార్మ్ సెంటర్ రాజీవ్ గృహకల్పకు చెందిన పెంకె మోజెస్ 2020 మార్చిలో మార్గదర్శి ఏజెంట్ ద్వారా సామర్లకోట బ్రాంచిలో రూ.లక్ష విలువ కలిగిన రెండు చిట్స్ తీసుకొన్నారు. ఒక్కో చిట్‌కు నెలకు రూ.2,500 చెల్లిస్తున్నారు. నాలుగు నెలల తరువాత ఒక చిట్‌ను రూ.20 వేలకు పాడుకున్నారు. ఆయనకు రావలసిన రూ.80 వేలకు సంబంధించి మార్గదర్శి బ్రాంచి మేనేజరును సంప్రదించగా ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు, ఒక ప్రభుత్వ ఉద్యోగి స్యూరిటీ కావాలని చెప్పారు. ఇద్దరు ప్రైవేటు ఉద్యోగుల స్యూరిటీ ఇవ్వగా, ప్రభుత్వ ఉద్యోగి స్యూరిటీ ఇవ్వలేకపోయారు. దాంతో రూ.80 వేలు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని మోజెస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనిచ్చిన ఫిర్యాదుపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఈడీ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

- సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్‌సీటీఈ నిర్ణయం
- ప్రైమరీ టీచర్ పోస్టులకు డీఈడీ అభ్యర్థులే అర్హులని తేల్చిన సుప్రీంకోర్టు
- కోర్టు తీర్పు ప్రకారం నోటిఫికేషన్‌ల విడుదలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ఇకపై డీఈడీ(డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సు పూర్తి చేసిన వారికే సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) నియామకాల్లో అవకాశం దక్కనుంది. ఒకటి నుంచి 5వ తరగతి వరకు బోధించే ఎస్జీటీ పోస్టులకు డీఈడీతో పాటు బీఈడీ పూర్తి చేసిన వారికి ఎన్‌సీటీఈ గతంలో అవకాశం కల్పించింది. అయితే ఎన్‌సీటీఈ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను రాజస్తాన్ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం 11న తుది తీర్పు ప్రకటించింది. ఎలిమెంటరీ టీచర్ పోస్టులకు కేవలం డీఎడ్ శిక్షణ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని స్పష్టం చేసింది. నూతన విద్యావిధానం ప్రకారం ప్రాథమిక స్థాయిలోని పిల్లలకు విద్యాబోధన చేయాలంటే ప్రత్యేక మెళకువలు అవసరమని పేర్కొంది. డీఎడ్ శిక్షణ పొందిన వారే ఆ విధంగా బోధన చేయగలుగుతారని న్యాయస్థానం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పును ఎన్‌సీటీఈ తాజాగా తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. దానికి అనుగుణంగా నోటిఫికేషన్లలో నిబంధనలు చేర్చేలా రాష్ట్రాలకు దిశా నిర్దేశం చేసింది. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయ సంస్థలు వేలాది ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాయి. వీటిలో కొన్ని నియామక ప్రక్రియలు దాదాపు చివరి దశకు వచ్చాయి. అలాగే కొన్ని రాష్ట్రాల్లో టీచర్ పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ తరుణంలో సుప్రీంకోర్టు తీర్పు రావడంతో ఆ మేరకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు చర్యలు చేపట్టాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు డీఎడ్ వారికే అవకాశం కల్పించబోతున్నాయి.

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదు

• తెలంగాణ

- ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పు
- 2018 డిసెంబర్ 12 నుంచి డీకే అరుణనే ఎమ్మెల్యేగా పరిగణించాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మరో శాసనసభ్యుడి ఎన్నిక చెల్లదంటూ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ గురువారం తీర్పు ఇచ్చింది. ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన డీకే అరుణను 2018 డిసెంబర్ 12 నుంచీ ఎమ్మెల్యేగా పరిగణించాలని ఆదేశించింది. తప్పుడు ఎన్నికల అఫిడవిట్ సమర్పించిన కృష్ణమోహన్‌రెడ్డికి రూ.2,50,000 జరిమానా విధించింది. మరో రూ.50,000ను పిటిషనర్‌కు పరిహారంగా చెల్లించాలని సూచించింది.

డీకే అరుణ పిటిషన్‌తో..

2018 ఎన్నికల్లో గద్వాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా డీకే అరుణ పోటీ చేశారు. కృష్ణమోహన్‌రెడ్డికి 1,00,057 ఓట్లు, అరుణకు 71,612 ఓట్లు వచ్చాయి. అయితే ఎన్నికల సమయంలో కృష్ణమోహన్‌రెడ్డి సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగా ఉందని.. ఆయన ఎన్నికను రద్దు చేసి, తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని డీకే అరుణ హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్ గురువారం తీర్పు వెలువరించారు. అరుణ తరఫున న్యాయవాది యోగితా ప్రకాశ్, కృష్ణమోహన్‌రెడ్డి తరఫున న్యాయవాది మనోహర్ కోర్టు హాజరయ్యారు. అయితే ఈ కేసులో కృష్ణమోహన్‌రెడ్డి తరఫున వాదనలు వినిపించేందుకు ఆగస్టు 18న న్యాయవాది మనోహర్ వచ్చారని, ఈ మేరకు మధ్యంతర అప్లికేషన్ దాఖలు చేశారని రిజిస్ట్రీ హైకోర్టుకు వివరించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. ఈ పిటిషన్‌లో జూన్ 22నే తీర్పు రిజర్వు చేశామని, మధ్యంతర అప్లికేషన్‌ను అనుమతించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

రెవెన్యూ అధికారిపై టీడీపీ నేతల దౌర్జన్యం

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడమే కారణం

చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లాలో తెలుగుదేశం పార్టీ నాయకుల దౌర్జన్యకాండ ఇది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు రెవెన్యూ అధికారులపైనే టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. జిల్లాలోని చంద్రగిరి సమీపంలోని స్వర్ణముఖి నది వద్ద జేసీబీ సాయంతో ఇసుకను తవ్వేస్తున్నారని రైతులు బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాలతో చంద్రగిరి–1 వీఆర్‌వో భాస్కరయ్య వెంటనే ఇసుక తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. వాటిని సీజ్ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఇసుక తవ్వుతున్న వారు వాహనాలను అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జేసీబీ యజమాని యుగంధర్, మరికొందరు ఆ పార్టీ కార్యకర్తలు గురువారం తహసీల్దార్ కార్యాలయంలోకి ప్రవేశించారు. పెద్దగా కేకలు పెడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న భాస్కరయ్యపై దూషణలకు దిగారు. రాయలేని భాషలో దూషిస్తూ 'నీ అంతు చూస్తాం' అంటూ బెదిరించారు. టీడీపీ నాయకుల ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటావా? నీకు ఎవడు ఆ అధికారం ఇచ్చాడు? మా సంగతి నీకు తెలియదు. నీ అంతు చూస్తాం అంటూ దౌర్జన్యానికి దిగినట్లు బాధిత వీఆర్‌వో తెలిపారు. ఒక దశలో ఆయనపై దాడికి యత్నించడంతో అక్కడే ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు.

వీఆర్‌వోల సంఘం ఆగ్రహం

టీడీపీ నాయకులు రెవెన్యూ ఉద్యోగిపై.. అదీ ఒక దళిత వీఆర్‌వోపై దౌర్జన్యం చేయడం పట్ల వీఆర్‌వోల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఉద్యోగిపై టీడీపీ నాయకులు దాడికి యత్నించడం అమానుషమని వ్యాఖ్యానించింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తహసీల్దార్ శిరీషను సంఘం రాతపూర్వకంగా కోరింది. దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నేతలపై బాధిత వీఆర్‌వో భాస్కరయ్య, తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నా జాతి ప్రజలారా!
నిశ్చయంగా ఈ ఇహలోక జీవిత సుఖం తాత్కాలికమైనదే.
నిశ్చయంగా పరలోకమే శాశ్వతమైన నివాస స్థలము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 25 ఆగస్టు 2023

బ్రిక్స్‌కు కొత్త బలం!

కాలం అందరికీ... వ్యక్తులకైనా, సంస్థలకైనా అన్నీ నేర్పుతుంది. పదిహేనేళ్ల క్రితం అప్పట్లో ఆర్థికంగా జవసత్వాలు పుంజుకుంటున్న బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలతో బ్రిక్‌గా ఏర్పడిన సహకార కూటమి అనంతరకాలంలో దక్షిణాఫ్రికాను కూడా కలుపుకొని బ్రిక్స్‌గా రూపాంతరం చెందింది. జోహాన్నెస్‌బర్గ్‌లో మూడు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు గురువారం ముగిసే సమయానికి మరో ఆరు దేశాలకు– సౌదీ అరేబియా, యూఏఈ, అర్జెంటీనా, ఇథియోపియా, ఇరాన్, ఈజిప్టులకు ఈ సారి సభ్యత్వం లభించింది. ఈ దేశాల భాగస్వామ్యం వచ్చే జనవరి 1 నుంచి ప్రారంభమవుతుంది. ఇకపై దీన్ని బ్రిక్స్–11గా వ్యవహరిస్తారు. ఆరంభంలో ఆ కూటమి వైపు పెద్దగా దృష్టి సారించని దేశాలు అందులో భాగస్వాములై ఎదగాలని ఇప్పుడు తహతహలాడటం అనివార్య పరిణామం. కరోనా మహమ్మారితో, ఉక్రెయిన్ యుద్ధంతో కుదేలైన ఆర్థిక వ్యవస్థలకు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు విధానాలు ఇబ్బందికరంగానే ఉంటున్నాయి. మరోపక్క ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై పశ్చిమార్థ గోళ దేశాల ఆధిపత్యాన్ని, ముఖ్యంగా అమెరికా పెత్తనాన్ని బలహీన పరచాలని చూస్తున్న రష్యా, చైనాలకు ఈ పరిణామం సహజంగానే బలాన్నిస్తోంది. అయితే ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధంలో పీకల్లోతు కూరుకుపోయి అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అభిశంసనకు గురయిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ శిఖరాగ్ర సదస్సుకు హాజరు కాలేని నిస్సహాయస్థితిలో పడ్డారు. ఆ కోర్టులో దక్షిణాఫ్రికా సభ్యదేశంగా ఉండటం వల్ల అది పుతిన్‌పై జారీచేసిన అరెస్టు వారెంట్‌ను అమలుపరచక తప్పదు. నిజంగా దక్షిణాఫ్రికా ఆ పని చేస్తుందా లేదా అన్న సంగతి అటుంచితే ఈ స్థితిలో హాజరు కావటం పుతిన్‌కే అవమానకరమవుతుంది. దాంతో ఆయన శిఖరాగ్ర సదస్సును ద్దేశించి వీడియో లింక్ ద్వారా మాట్లాడారు. అయితే ఇప్పటికిప్పుడు బ్రిక్స్ దేశాలు అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగరేసే స్థితి లేదు. మన దేశం, బ్రెజిల్ అమె రికాకూ, ఇతర పాశ్చాత్య దేశాలకూ సన్నిహితంగా ఉంటున్నాయి. ఆ మాటకొస్తే చైనా సైతం వివిధ అంశాల్లో అమెరికాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా, దానితో బాహాటంగా ఘర్షణకు దిగాలనుకోవటం లేదు. రణరంగంలో నిలిచిన రష్యా ఒక్కటే ఇందుకు మినహాయింపు. సదస్సు ప్రారంభంలోనే ఈ ధోరణి కనబడింది. బ్రిక్స్ దేశాధినేతల్లో ఇతరులు సమానత్వం ఆధారంగా అంతర్జాతీయ సంబంధాలుండాలని మాట్లా డితే... పుతిన్ మాత్రం ఏ రకమైన పెత్తందారీ పోకడలకైనా తాము బద్ధ విరోధులమని కుండ బద్దలు కొట్టారు. తన శత్రువులు నయా వలసవాదాన్ని ప్రోత్సహిస్తున్నారని కూడా ఆరోపించారు. పనిలో పనిగా ఉక్రెయిన్‌లో వర్తమాన సంక్షోభానికి పాశ్చాత్య దేశాల పెత్తందారీతనమే కారణమన్నారు.

కూటమి విస్తరణ, దాని అమరిక ఎప్పుడూ ఒకేలా ఉండదు. సాధారణ పరిస్థితుల్లో ఉన్న కూటమి సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడు చెల్లాచెదురు కావొచ్చు. కొత్త దేశాలొచ్చి అందులో చేరవచ్చు కూడా. తన ప్రయోజనాలకు అనుగుణంగా బ్రిక్స్ విస్తరణ ఉండాలని చైనా ఏడాదిగా ప్రయత్నిస్తోంది. మన దేశం కూడా ఆ దిశగానే అడుగులు వేసింది. నిరుడు బీజింగ్‌లో జరిగిన సదస్సులోనే విస్తరణపై ఆలోచన బయల్దేరింది. సభ్యత్వానికి అర్హతలు, కూటమిలో చేరాక ఆ దేశాలు అనుసరించాల్సిన విధానాలు వగైరాలకు ఈ ఏడాదికాలంలో తుది రూపం ఇచ్చారు. పెద్ద ఆర్థిక వ్యవస్థలు, మెరుగైన వృద్ధి రేటు ఉండేవాటినే సభ్యదేశాలుగా చేర్చుకోవాలని బ్రిక్స్ మూలవిరాట్టులైన అయిదు దేశాలూ ఏకాభిప్రాయానికొచ్చాయి. అలాగే ఇకపై కూడా అయిదు దేశాలూ ఏకాభిప్రాయానికొస్తే తప్ప ఏ దేశానికీ సభ్యత్వం ఇవ్వరాదన్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదనకు అంగీకారం లభించింది. బహుళత్వం, సుస్థిర, శాంతియుత అభివృద్ధి, పరస్పర సహకారంతో ఎదుగుదల, సంస్థాగత అభివృద్ధి, బ్రిక్స్ దేశాల ప్రజానీకం మధ్య సంబంధాలు నెలకొల్పటం వగైరాల సాధనకు కృషి చేయాలన్న జోహాన్నెస్‌బర్గ్ డిక్లరేషన్ సంకల్పం నెరవేరే దిశగా అడుగులు పడితే సంస్థ భవిష్యత్తులో మరింత బలపడుతుంది. ఎప్పటిలాగే ఘర్షణల విషయం వచ్చేసరికి డిక్లరేషన్ ఆచితూచి వ్యవహరించిందనాలి. నిర్మాణాత్మక చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చి ఊరుకుంది. అంతేతప్ప ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించలేదు.

బ్రిక్స్ స్వభావరీత్యా స్వేచ్ఛా వాణిజ్య కూటమి వంటిది కాదు. దేశాల మధ్య సమన్వయం సాధించి, పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఎదగాలన్నది ఈ కూటమి ప్రధాన ధ్యేయం. బ్రిక్స్ కరెన్సీ అంటూ ప్రత్యేకించి లేకపోయినా ఆయా దేశాల కరెన్సీలు బలపడేందుకు అవసరమైన సాయాన్ని అందించటం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. ఈసారి శిఖరాగ్ర సదస్సులో ఉమ్మడి కరెన్సీ గురించిన ఆలోచన చేస్తారని వినబడినా అదేం జరగలేదు. అయితే 2015లో కూటమి ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) సమర్థవంతంగానే పనిచేస్తోంది. కూటమిలో కొంత వెనకబడిన దేశాలకు ఈ సంస్థ ద్వారానే సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇప్పటికైతే బ్రిక్స్‌లో చేరడానికి దక్షిణార్థ గోళ దేశాల ఉత్సాహాన్ని సంపన్న దేశాలు ఒక హెచ్చరికగా పరిగణించక తప్పదు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటున్న దేశాల ఆకాంక్షలను గుర్తించి తగినవిధంగా వ్యవహరించకుంటే బ్రిక్స్ మాత్రమే కాదు... భవిష్యత్తులో మరిన్ని కూటములు ఉనికిలోకొస్తాయి. ఒకటైతే నిజం – ఆవిర్భవించి పదిహేనేళ్లయినా బ్రిక్స్ సంస్థాగత స్వభావాన్ని సంతరించుకోలేదు. ఆ దేశాలమధ్య పరస్పర ఐక్యతగానీ, ఉమ్మడి లక్ష్యాలుగానీ లేవు. ఆ లోపాన్ని సవరించుకుంటే బ్రిక్స్ మరింత పటిష్టవంతమైన కూటమిగా రూపుదిద్దుకోవటం ఖాయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.నవమి రా.8.27 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.36 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.10.32 నుండి 12.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.26 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** రా.7.55 నుండి 9.31 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

మన సత్తా ఇప్పుడే తెలిసిందా?

సందర్భం



ప్రసాద్ నాయుడు

తెలుగు సినిమాను చాలాకాలం పాటు కేంద్ర ప్రభుత్వ అవార్డుల కమిటీ సభ్యులు, క్రిటిక్స్ తక్కువ చేసి చూపించడానికి ప్రయత్నించారు. కానీ, ఇప్పుడు తెలుగు సినిమా జూలు విదిలిస్తోంది. 2021కి గాను ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తెలుగు సినిమాకు 11 అవార్డులు దక్కాయి. నేషనల్ ఫిల్మ్ అవార్డుల చరిత్రలో తొలిసారిగా ఒక తెలుగు నటుడికి జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ రావడం అభిమానులనే కాదు – పరిశ్రమనూ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తెలుగు వాడికి టాలెంట్ ఎప్పుడూ ఉంది, కానీ ప్రపంచం ఇప్పుడే తెలుగు సినిమా ప్రతిభ తెలుసుకుంటోంది.

ఆగస్టు 23న చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశం, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులు అందరూ గర్వపడ్డారు. ఆ మరుసటి రోజునే తెలుగు సినిమా చంద్ర మండలం ఎక్కినంతగా సంబరం చేసుకుంటోంది. కారణం అందరికీ తెలిసిందే! 2021వ సంవత్సరానికి గాను ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తెలుగు సినిమాకు ఏకంగా 11 అవార్డులు దక్కాయి. సంఖ్యా పరంగానే కాకుండా – 69 సంవత్సరాల నేషనల్ ఫిల్మ్ అవార్డుల చరిత్రలో తొలిసారిగా ఒక తెలుగు నటుడికి జాతీయ ఉత్తమ నటుడు అవార్డ్ రావడం తెలుగు సినిమా అభిమానులనే కాదు– తెలుగు సినిమా పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇక్కడ మౌలికంగా ఓ ప్రశ్న తలెత్తుతుంది. తెలుగు సినిమా రంగంలో ఎందరో మహా నటులున్నారు. వారెవరికీ దక్కని గౌరవం, గుర్తింపు– అభిమానుల చేత 'ఐకాన్ స్టార్' అని పిలిపించుకునే అల్లు అర్జున్‌కు రావడం సంతోషదాయకం. అలాగని ముందు తరాల నటుల గురించి, ఏ మాత్రం తక్కువగా ఆలోచించినా మహాపరాధం!


ఒక నిజం ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా – తెలుగు సినిమాను చాలాకాలం పాటు కేంద్ర ప్రభుత్వ అవార్డుల కమిటీ సభ్యులు, మిగిలిన భాషా చిత్రాల మార్కెట్లు, క్రిటిక్స్ తక్కువ చేసి చూపించడానికి ప్రయత్నించారు. ఎన్.టి. రామారావు గారి 'పాతాళ భైరవి', అక్కినేని నాగేశ్వరరావు గారి 'సువర్ణ సుందరి' – హిందీలోనూ ఏడాది పైన ఆడిన చరిత్ర ఈ జనరేషన్‌కి తెలియకపోవచ్చు. అలాగే జకార్తా ఇంటర్ నేషనల్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో 'నర్తన శాల' సినిమాలో ఎస్.వి. రంగారావు పోషించిన కీచక పాత్రకు ఉత్తమ నటుడిగా లభించిన గౌరవం కొందరికే గుర్తుండవచ్చు.

పైగా పది, పదిహేనేళ్ళ క్రితం వరకూ అవార్డులను... నేచురల్‌గా ఉండే సినిమాలు అనండి, ఆర్ట్ ఫిలిమ్స్ అనండి... వాటికి మాత్రమే ఇవ్వాలనే ఒక ప్రత్యేక ధోరణి ఉండేది. బాక్సాఫీస్ దగ్గర డబ్బులు వసూలు చేసిన సినిమాలకూ, అందులో పని చేసినవాళ్ళకూ ఎక్కువ శాతం అవార్డులు వచ్చేవి కావు. వచ్చేవి కావు అనే కన్నా ఇచ్చేవాళ్ళు కాదనడం కరెక్ట్! పక్క భాషల నటులు ఒక్కొక్కరికి 2–3 అవార్డులు వచ్చిన సందర్భాలున్నాయి. అదే సమయంలో మన తెలుగు నటులను గుర్తించడం లేదేంటని బాధ పడుతుండేవాళ్ళు. అందుకే 30 ఏళ్ళ నుంచి ఉత్తమ వినోదాత్మక చిత్రం అవార్డ్ ప్రవేశపెట్టి, కమర్షియల్ సినిమా కన్నీరు తుడిచే ప్రయత్నం చేశారు.

అయిదారేళ్ళ క్రితం వరకూ భారతీయ వినోదాత్మక రంగం నుంచి వచ్చే ఆదాయంలో తెలుగు సినిమా వాటా 18–19 శాతం ఉండేది. బాలీవుడ్ రెవిన్యూ తర్వాత స్థానం తెలుగు సినిమాదే. ఇప్పుడు ఈ వాటా 30 శాతం వరకూ పెరిగిందని విన్నాను. కేవలం ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాదు! అన్ని వందల, వేల కోట్ల ఆదాయం ఎన్ని వేల కుటుంబాలకు ఉపాధి కలిగిస్తోందో అన్న విషయం ప్రధానంగా గమనించాలి.







ముఖ్యంగా ఇవాళ ఆర్ట్ ఫిలిమ్స్ తీసేవాళ్ళు, ఆదరించేవాళ్ళు తగ్గిపోయారు. అవతల ఆస్కార్ అవార్డుల్లో (మన వాళ్ళందరికీ అదే కొలమానం కాబట్టి) బాక్సాఫీస్ సక్సెస్ అయిన సినిమాలకూ, క్రైమ్ డ్రామాలకూ అవార్డులు ఇస్తున్నప్పుడు కమర్షియల్ సినిమాలు భారత దేశంలో ఏం పాపం చేసుకున్నాయి? జనం బాగా ఆదరించిన సినిమాల్లో కళాత్మక విలువలు ఉండవా? అత్యద్భుతమైన ప్రతిభా పాటవాలు ఉండవా? ఎన్ని పదుల, వందల కోట్ల పారితోషికాలు తీసుకున్నా, ప్రతి కళాకారుడూ కోరుకునేది తన పనిని ఎక్కువ మంది మెచ్చుకోవాలని! మేధావులు, అవార్డుల కమిటీల్లో గొప్పవాళ్ళ నుంచి ప్రశంసలు, సత్కారాలు అందుకోవాలని! ఇందులో తప్పేం ఉంది? అమితాబ్‌కి ఉత్తమ నటుడు అవార్డ్ వచ్చినప్పుడూ, రజనీ కాంత్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ప్రదానం చేసినప్పుడు కూడా కొన్ని విమర్శలు వచ్చాయి. వాళ్ళు దేశవ్యాప్తంగా పాపులర్ స్టార్స్ అయినంత మాత్రాన ప్రతిభావంతులు కారా?

ఎవరు అవునన్నా, కాదన్నా – రాజమౌళి 'బాహుబలి'తో ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ రీ–సౌండ్ తెలుగు సినిమా వినిపించింది. అప్పటి నుంచి తెలుగు సినిమా రంగం గురించి మన దేశంలోనే కాదు... ప్రపంచంలోని సినిమా అభిమానులందరికీ తెలిసింది. ఈ రోజు జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పనితనం, ప్రతిభ తెలిసిందంటే... తెలుగు సినిమా తనని తాను పెంచుకున్న స్థాయి. లాబీయింగ్ అంటే ఇదే! తెలుగు సినిమా తన టాలెంట్‌తో భారతదేశంలోని సినిమా అభిమానులు, కమిటీ సభ్యుల దగ్గర లాబీయింగ్ చేసింది! భారీ స్థాయిలో – ఊహకందని విజువల్స్‌తో, మార్కెట్ రిస్క్ చేసి సంపాదించుకున్న రెస్పెక్ట్ ఇది! రాజమౌళి 'ఆర్.ఆర్.ఆర్.' ఆస్కార్ స్థాయిలో అందుకున్న అవార్డులకూ, గుర్తింపునకూ ఈ జాతీయ అవార్డులు ఓ కొనసాగింపు! అలాగే శ్రీశ్రీ, వేటూరి, సుద్దాల అశోక్ తేజ సరసన ఇప్పుడు చంద్ర బోస్ జాతీయ ఉత్తమ గీత రచయిత అవార్డును అందుకున్నారు. ప్రేమకథల్లో ఓ షాకింగ్ పాయింట్‌తో వచ్చిన 'ఉప్పెన' సినిమా తెలుగులో ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డ్ గెలుచుకోవడం అభినందనీయం!

ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డును అందుకున్న తొలి తెలుగు నటుడిగా చరిత్రలో నిలిచిపోతున్న అల్లు అర్జున్ గురించి రెండు మాటలు చెప్పాలి. ప్రతి నటుడూ కష్టపడతారు. అల్లు అర్జున్ తనకు అసాధ్యం అనుకున్నది కూడా కసిగా సాధించి తీరుతారు. అల్లు అర్జున్‌తో మూడు సినిమాలకు ఓ రచయితగా పని చేసినప్పుడు ఆయనలో గమనించిన కొన్ని లక్షణాల గురించి చెప్పుకోవాలి. క్యారెక్టర్ కోసం తన శరీరాన్ని మలుచుకోవడమే కాదు... డిక్షన్, బాడీ లాంగ్వేజ్ కోసం తనకు రానిది కూడా ఆయన కష్టపడి నేర్చుకుంటారు. 'రుద్రమదేవి'లో గోన గన్నా రెడ్డి పాత్ర చేసిన సాహసం, 'దువ్వాడ జగన్నాథం (డి.జె.)'లో పురుష సూక్తం పలకడానికి చేసిన ప్రయత్నం, ఇప్పుడు 'పుష్ప'లో ఓ పక్కకు భుజం వంచి (గూని లాంటిది) మరీ చేసిన అభినయం, చిత్తూరు జిల్లా యాస నేర్చుకోవడానికి చూపిన పట్టుదల – ఇవన్నీ అవార్డ్ అందుకోవడానికి కారణాలయ్యాయి.

చివరగా ఓ మాట! తెలుగు సినిమా పుట్టినప్పటి నుంచి (92 సంవత్సరాల కాలం) తన ప్రతిభను చాటి చెబుతూనే ఉంది. అయితే ఆ వెలుగు, వినోదం తెలుగు నేలకే పరిమితమైంది. ఇప్పుడు మన సినిమా ఎల్లలు దాటింది, రిస్క్ గేమ్ ఆడుతోంది. దానికి తగ్గ ప్రతిఫలాలూ అందుకుంటోంది. తెలుగు వాడికి టాలెంట్ ఎప్పుడూ ఉంది, కానీ ప్రపంచం ఇప్పుడే తెలుగు సినిమా ప్రతిభ తెలుసుకుంటోంది. అందుకే ఇన్ని వందల కోట్ల వసూళ్ళు, అవార్డులు, సత్కారాలు, మర్యాదలు! తెలుగు సినిమా ఏం చేస్తోందనేది మిగిలిన భాషా చిత్రాలు, మార్కెట్లు ఇప్పుడు గమనిస్తున్నాయి. కానీ, తెలుగు ప్రేక్షకుల అభిరుచిని ఏనాడో కొందరు గొప్ప దర్శకులు గుర్తించారు. తెలుగు సినిమాకు దగ్గర కావాలని ప్రయత్నించారు. 1970ల చివరలో శ్యామ్ బెనెగల్ 'అనుగ్రహం', మృణాల్ సేన్ 'ఒక ఊరి కథ', గౌతమ్ ఘోష్ 'మా భూమి' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇప్పుడు కమర్షియల్ ప్యాన్– ఇండియా సినిమా కోసం, క్వాలిటీ మేకింగ్ కోసం దేశం తెలుగు సినిమా వైపు తొంగిచూస్తోంది. పాపులర్ సినిమాలకు అన్ని విధాలా పట్టాభిషేకాలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. తెలుగు సినిమా జైత్రయాత్రకు ఇది శుభారంభం!

వ్యాసకర్త ప్రముఖ సినిమా రచయిత, సినీ విశ్లేషకులు
PrasaadNaidu5@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బ్యాటింగ్ ఫస్ట్



చంద్రుడి మొదటి ఫొటో చూస్తుంటే– కచ్చితంగా మొదట బ్యాటింగ్ చేయాల్సిన పిచ్‌లా కనబడుతోంది. నేను ముగ్గురు స్పిన్నర్లు, ఒక నిజమైన సీమర్, ఇంకో ఆల్‌రౌండర్‌తో వెళ్తాను.

– వసీం జాఫర్, మాజీ క్రికెటర్

సంతోష క్షణాలు



చంద్రయాన్ మిషన్ విజయవంతం కావడం నాకు వ్యక్తిగత అంశం కూడా! ఎందుకంటే, పాఠశాల, కళాశాల రోజుల నుంచీ ఉన్న నా మంచి మిత్రులు అందులో భాగమయ్యారు. కొందరు రామకృష్ణ మిషన్ విద్యార్థులు కూడా 'ఇస్రో'లో ఉన్నారు.

– స్వామి సమర్పణానంద, సాధువు

ఎక్కడ ఆగుతామో!



చంద్రుడి మీదకు చేరినందుకు ఇండియాకూ, ఇస్రోకూ హృదయపూర్వక అభినందనలు. ఇండియా చంద్రుడిని అందుకోవడం ఒకవైపు సంతోషం కలిగిస్తుండగా... అజ్ఞానం, 'జాహిలియత్'(నిరక్షరాస్యత) వైపు వెనక్కి పయనిస్తున్న అఫ్గానిస్తాన్‌ను చూస్తుంటే మరోవైపు బాధ కలుగుతోంది. యూఏఈలో విద్యనభ్యసించడానికి వెళ్తున్న విద్యార్థినులను తాలిబన్లు కాబూల్ విమానాశ్రయంలో ఆపారు.

– అమరుల్లా సలేహ్, అఫ్గానిస్తాన్ తిరుగుబాటు నేత

అదీ రావాలి!



ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకుండా చంద్రుడి మీద దిగిన మొదటి దేశం ఇండియా.

– డేవిడ్ బాస్కో, ప్రొఫెసర్

ఆ ముఖం చూపాలా?



'ఇస్రో' అద్భుతమైన కవరేజ్ అందించింది. కానీ ల్యాండింగ్‌కు సంబంధించిన మంత్రముగ్ధ క్షణాలను చూపడంలో విఫలమైంది. ఎందుకంటే, చంద్రుడిని చూపే కెమెరా ఫీడ్‌తో వెలాసిటీ/ డిస్టెన్స్ (వడి/దూరం) స్క్రీన్ చూపడానికి బదులుగా– ఉత్సాహపూరిత ల్యాండర్‌తో మోదీని చూపింది. దాంతో కౌంటర్ '0.0'ని తాకే అద్భుతమైన క్షణాలను భారతీయులు చూడలేకపోయారు. విషాదకరం!

– సిద్ధార్థ్ వరదరాజన్, సంపాదకుడు

అవమానకరం



భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సస్పెండ్ చేసిందని తెలియడం దిగ్భ్రాంతి కలిగించింది. ఇది మొత్తం దేశాన్ని కలవరపెట్టే విషయం. సిగ్గు విడిచిన అహంకారంతో కేంద్ర ప్రభుత్వం మన రెజ్లర్లను నిరాశపరిచింది.

– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

చైనా ముద్ర



కేవలం ఐదు సభ్యదేశాలున్నప్పుడే 'బ్రిక్స్'కు ఒక ఉమ్మడి గుర్తింపునూ, లక్ష్యాన్నీ తేలేకపోయాయి. ఇప్పుడు మరో ఆరు సభ్య దేశాల చేరికతో ఆ కార్యం మరింత కఠినతరం అవుతుంది. ఈ కొత్త చేరికల మీద రష్యా మద్దతు ఉన్న చైనా ముద్ర ఉంది. (అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ ఆహ్వానిత దేశాలు. యూఏఈ కోసం ఇండియా పట్టుబట్టింది.)

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

నాస్తికత్వమూ మత స్వేచ్ఛే!

భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికీ మత స్వేచ్ఛ ఎలాగైతే ఉంటుందో, నాస్తికత్వాన్ని అనుసరించే హక్కు కూడా ఉంటుంది. రాజ్యాంగంలో 25, 26 అధికరణాలు ప్రజలకుండే మత స్వాతంత్ర్య హక్కు, దానికుండే పరిమితుల గురించి స్పష్టంగా వివరిస్తున్నాయి.

రాజ్యాంగం ప్రకారం మతం ఒక వ్యక్తిగత అంశం. మతరాహిత్య స్థితిని కలిగి వుండటం కూడా మత స్వేచ్ఛలో భాగంగా గుర్తించాలి. నాస్తికులు కూడా వివిధ మత అంశాలపై తమ అభిప్రాయాలను చెప్పవచ్చు. ఈ కారణంగా వారి హక్కులను కాలరాయకూడదు. అయితే ఈ అభిప్రాయాలు రాజ్యాంగ బద్ధంగా ఉండాలి. మతంలో రాజకీయ జోక్యం పెరగడంతో ఇది సున్నితమైన అంశంగా మారింది. ఎవరైనా హేతువాదులు, సైన్స్ వాదులు వివిధ మత ధర్మాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే వారిపై మతోన్మాదులు దాడులకు దిగుతున్నారు. వారిని దూషిస్తున్నారు. వారి ప్రాణాలు తీస్తున్నారు.

రాజ్యాంగంలోని 51ఏ(హెచ్) అధికరణం పౌరులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని సూచిస్తోంది. దీని కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం కృషి చేయాల్సిన బాధ్యతను రాజ్యాంగం గుర్తుకు తెస్తుంది. పౌరులలో శాస్త్రీయ ఆలోచనలు పెంచాలంటే మూఢ నమ్మకాలను వ్యతిరేకించాలి.

ప్రజలలో శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి కృషి చేసే వారిని ప్రోత్సహించాలి. వారికి రక్షణ కల్పించాలి. మనోభావాలు నాస్తికులకు కూడా ఉంటాయని ఆస్తికులు గుర్తెరగాలి. ఎవరైనా శాంతియుతంగా ప్రార్థన చేసుకుంటుంటే వారిపై దాడి చేస్తే తప్పు అవుతుంది. హేతువాదులు ఎవరూ అలా చేయరు. అందుకు చట్టం కూడా ఒప్పుకోదు. ఏ విధంగానైతే మత విశ్వాసులకు తమ అభిప్రాయాలను తెలియజేసే హక్కు ఉంటుందో, నాస్తికులకు కూడా తమ భావాలను వ్యక్తం చేసే హక్కు ఉంటుంది. దీన్ని ఆస్తికులు గుర్తించాలి. ఎందుకంటే ప్రశ్నే ప్రగతికి మూలం. ప్రతి కొత్త మతం, అంతకు ముందు ఉన్న ఆచార వ్యవహారాలతో ఘర్షణ పడే ఆవిర్భవించింది. అనేక శతాబ్దాలుగా పలువురు శాస్త్రవేత్తలు సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన విశ్వాసాలను ప్రశ్నించబట్టే కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడింది. వీటి వల్ల మనం ఎన్నో సౌకర్యాలు పొందుతున్నాం.

– ఎం. రాం ప్రదీప్, తిరువూరు । 94927 12836

ఉద్దేశ్యం ఒకటి... పైకి చెప్పేది మరొకటి!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

సమానత్వం పేరుతో 'అందరికీ ఒకే చట్టం' వర్తింపచేస్తామంటే రాజ్యాంగం ఒప్పుకోదు. ఆర్టికల్ 44లో ఉన్న ఆదేశిక సూత్రాలకూ, ఆర్టికల్స్ 25, 29లోని ప్రాథమిక హక్కులకూ వైరుధ్యం ఉంది. హక్కులను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంటుంది, కాని ఆర్టికల్ 44 ఆదేశిక సూత్రమే కాని ఆదేశం కాదు. తమ మత వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు మైనారిటీలకు ఉందని ఆర్టికల్ 25 చెబుతోంది. భాష, సంస్కృతి పరమైన విభిన్న ఆచార సంప్రదాయాలను రక్షించుకునే హక్కు ఆర్టికల్ 29 కింద అన్ని మతాలవారికీ ఉంది.

ఒక వ్యక్తి (భర్త)కి ఒక భార్య సమాన న్యాయం. కాని కొన్ని సందర్భాల్లో సంఖ్య మించుతోంది. ముస్లిం స్త్రీలలో 1.9 శాతం మంది తమ భర్తకు మరో భార్య (వ్యక్తి) ఉన్నదని అంటే, హిందూ మహిళల్లో 1.3 శాతం మంది తమ భర్త ఇద్దరు భార్యలను కలిగి ఉన్నట్లు దేశం మొత్తం మీద జరిపిన ఓ సర్వేలో తెలిపారు. బహు భార్యాత్వానికి కొన్ని మతాలు అనుమతిస్తాయి. దాని అర్థం అందరూ ఇద్దరు భార్యలు కలిగి ఉండాలని కాదు. అది కేవలం ఆచారం మాత్రమే. ఆచారం ఉన్నంత మాత్రాన దానిని తు.చ. తప్పకుండా పాటించాలనేం లేదు. చాలామంది ముస్లింలు కూడా ఒకే భార్యను కలిగి ఉన్నారనే సంగతి ఈ సందర్భంగా గమనార్హం. బహు భార్యాత్వం దాదాపు అన్ని మతాలలోనూ ఉన్నదనీ, కాని ఆ ఆచారాన్ని పాటించేవారు అంతకంతకూ తగ్గిపోతున్నారనీ ప్రముఖ లాయర్, లా కమిషన్ సభ్యుడు దుష్యంత్ అరోరా చెప్పారు. విచిత్రమేమంటే తెలంగాణలో బహు భార్యాత్వాన్ని ఆచరిస్తున్న హిందువుల సంఖ్య ముస్లింల కంటే అధికం అనీ, అస్సాంలో ముస్లింలే ఈ విషయంలో అధిక్యతలో ఉన్నారనీ; కాని బహు భార్యాత్వాన్ని నిషేధించి తీరాలనీ, అది ఎటువంటి మినహాయింపు లేకుండా కచ్చితంగా అన్ని మతాల వారికీ వర్తింపచేయాలని అంటే వచ్చే ప్రమాదం అధికమని 21వ లా కమిషన్ వివరించింది.

2019లో మూడుసార్లు 'తలాక్' చెప్పడం ద్వారా



ముస్లిం పురుషులు తమ భార్యలకు విడాకులు ఇచ్చే సంప్రదాయాన్ని నిషేధిస్తూ కేంద్రం చట్టం తెచ్చింది. భారతీయ స్త్రీలందరికీ విడాకుల పరంగా ఒకే చట్టం ఉండాలనేది తమ ఆలోచనగా ప్రభుత్వం ఈ సందర్భంగా పేర్కొంది. ఇటువంటి చట్టాలు చేసే బదులు తండ్రి ఆస్తిలో కుమార్తెలకు హక్కు కల్పించే చట్టం తేవచ్చు కదా! తలాక్ నిషేధ చట్టం ముస్లిం మహిళలకు ఏమాత్రం రక్షణ కల్పిస్తుందో చెప్పలేం. ఎందుకంటే ఇప్పటికే దేశంలో ఉన్న చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు కదా! కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో తెచ్చిన 'గృహహింస చట్టం' కానీ, 2007లో తెచ్చిన 'మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్' కానీ ఏ మతంతో సంబంధం లేకుండా అందరికీ మేలు చేసే గొప్ప చట్టాలు. ఇటువంటి చట్టాలు చేయడం మాని సమానత్వం పేరుతో మైనారిటీల ఆచార సంప్రదాయాల్లో జోక్యం చేసుకోవడానికి వీలు కల్పించే 'ఉమ్మడి పౌర స్మృతి' (యూసీసీ) తీసుకురావాలనుకోవడం సమంజసమేనా?

చట్టాలున్నాయనీ, లేదా రాజ్యాంగం నిషేధించిందనీ ఒకరికన్నా ఎక్కువ భార్యలను కలిగి ఉండడానికి భయపడతారను కోవడానికీ వీల్లేదు. వివిధ మతాలకు చెందినవారు చట్టం, ఆచారంతో సంబంధం లేకుండా ఒకరి కన్నా ఎక్కువ భార్యలను కలిగి ఉన్నారు కదా! అలా కలిగి ఉన్నారని తెలిసిన వెంటనే ప్రభుత్వం వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తోందా? పోనీ ఒక భార్యను వదిలేసి ఆ భర్త వెళ్లిపోతే బతికేందుకు తనంతట తాను భరణం ఏమైనా ఇప్పిస్తోందా?

రాజ్యాంగంలోని 14, 15, 16 అధికరణాలు సమానత్వం గురించి ఘోషిస్తున్నాయి. నిజానికి ప్రభుత్వం ఎంతవరకు ఈ నిబంధనల ప్రకారం సమాన న్యాయాన్ని అందిస్తోంది? ఉన్న చట్టాలను అమలు పరచడంలో చిత్తశుద్ధి చూపకుండా ఎన్‌డీఏ ప్రభుత్వం పౌరులందరికీ సమాన న్యాయం కోసం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొస్తున్నామని చెప్పడం నమ్మేలా లేదు.

వ్యాసకర్త మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా డీన్

సేవే సాధన

ధర్మాన్ని తప్పకుండా ఎవరైతే ప్రకృతితో అనుసంధానమై జీవితాన్ని గడుపుతారో, పరహితమే ధ్యేయంగా ఎవరైతే నిస్వార్థంగా జీవిస్తారో, ఎవరి ప్రార్థనలు, ధ్యానం మానవాళి మేలుకోసమే సాగుతాయో, జీవించినంత కాలం ఎవరు ఆచరణాత్మకంగా బోధ చేస్తారో అటువంటి వారు ఈ భువిపై భగవంతుని వాహికలుగా వర్తించే అవకాశం ఉంది. వారు యోగులై ఉంటారు. రాజయోగులై ఇతరులను ఉద్ధరిస్తారు. అలాంటి వారిలో మాస్టర్ ఎమ్ఎస్ (మైనంపాటి నరసింహం పంతులు) ఒకరు. మాస్టర్ సీవీవీ పరంపరలో ఆయన ఒకరు.

సర్వసంఘ పరిత్యాగం చేయకుండా గృహస్థుగా యోగంలో ఉంటూ భగవంతుని చేరవచ్చని నిరూపించిన గురుపరంపరలో ఎమ్ఎస్ ఒకరు. 1883 ఆగస్టు 25న గుంటూరు జిల్లాలో ఆయన జన్మించారు. ఆయనకు రోల్ మోడల్ మేనమామ టంగుటూరి ప్రకాశం పంతులు. ఒంగోలు, బాపట్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ మంచి పేరు సంపాదిస్తున్న క్రమంలో... కుటుంబ సభ్యుల వరుస మరణాలు ఆయన్ని వైరాగ్యం వైపు నడిపించాయి. తన చిన్న మేనమామ సలహాపై 'కుంభకోణం'లో ఉన్న సాధకులు మాస్టర్ సీవీవీ (వెంకారావ్ సామి)ని కలిశారు. 'భృక్త రహిత తారక రాజయోగము' ద్వారా సాధకులు తమను తాము త్వరిత గతిన తెలుసుకొనేటట్లు చేయడం లక్ష్యంగా సీవీవీ పాటుపడుతున్న కాలమది. ఎమ్ఎస్ ఒంగోలులో అనేక సాధనా బృందాలను తయారుచేశారు. ఆయన ఆచరించిన మార్గంలో ముఖ్యమైనది ప్రార్థన స్వహితం కోసం కాక పరహితం కోసం చేయాలి. ధ్యానం ప్రపంచ శాంతి కోసం చేయాలి. నిస్వార్థంగా సేవ చేయడం సాధనలో ప్రాథమికమైనది. అందులో భాగంగానే అన్నసమారాధన, ఉచిత వైద్యం, ఉచిత విద్య వంటి కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఆయన శిష్యులు ఈ సేవలను కొనసాగిస్తున్నారు.

మాస్టర్ ఎమ్ఎస్ 1940 మార్చి 11న ధ్యాన మందిరంలో కూర్చొని తన దేహం నుంచి తనంతట తాను నిష్క్రమించారు. ఈ సంఘటనను 'మాస్టర్ ఎమ్.ఎస్. ద ఫైరీ ఫ్లేమ్' రచయిత మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్ 'ఆర్ట్ ఆఫ్ లీవింగ్' అన్నారు.

– శ్రీనివాసరావు నట్టి, జర్నలిస్ట్
(నేడు మాస్టర్ ఎమ్.ఎస్. జయంతి)

క్లుప్తంగా...

హింసాత్మక చర్యలను ప్రోత్సహిస్తున్న ప్రతిపక్షాలు

గవర్నర్‌కు వివిధ సంఘాల ఫిర్యాదు



గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ప్రతిపక్ష పార్టీలు రాజకీయ హింసాత్మక చర్యలకు పాల్పడుతుండటంతో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోందని వివిధ సంఘాల ప్రతినిధులు గురువారం గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలు చిత్తూరు జిల్లా పుంగనూరులో పోలీసులపై దాడులకు పాల్పడ్డారని గవర్నర్‌కు వివరించారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తరచూ బహిరంగ సభల్లో ఒక రెడ్‌బుక్ చూపిస్తూ ఐపీఎస్ అధికారులను బెదిరిస్తున్నారని కూడా గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. వలంటీర్ల వ్యవస్థకు కళంకం ఆపాదించేలా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడి వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీశారన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు, ఏపీ ఇంటలెక్చువల్ సిటిజన్ ఫోరం సభ్యుడు ఆర్కే చిన్నం, ఆంధ్ర అడ్వొకేట్స్ ఫోరం కన్వీనర్ బి.అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

జ్యోతి సురేఖకు గవర్నర్ అభినందన



సాక్షి, అమరావతి: ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ గెలుచుకున్న భారత జట్టు సభ్యురాలు జ్యోతి సురేఖను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను ఆమె గురువారం కలిశారు. బెర్లిన్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో సాధించిన బంగారు పతకం, పారిస్‌లో నిర్వహించిన ఆర్చరీ వరల్డ్ కప్‌లో సాధించిన పతకాలను ఆమె గవర్నర్‌కు చూపించారు. జ్యోతి సురేఖ మరిన్ని విజయాలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

31 వరకు ఏఎంవీఐ పోస్టులకు దరఖాస్తు గడువు

సాక్షి, అమరావతి: ఏపీ ట్రాన్స్‌పోర్ట్ సబార్డినేట్ సర్వీస్‌లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ పోస్టులకు గత ఏడాది సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేయగా, ప్రశ్నపత్రం తెలుగులోనూ ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో తాజాగా అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు చెప్పారు. దరఖాస్తులో తప్పులుంటే సెప్టెంబర్ 3 వరకు సవరించుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు https://psc.ap.gov.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను జేఎల్‌లు తనిఖీ చేయాలి

ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: జూనియర్ కళాశాలల్లో తరగతి గది నిర్వహణలో భాగంగా విద్యార్థుల వర్క్ నోట్‌బుక్స్‌ను జూనియర్ లెక్చరర్లు తనిఖీ చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల రోజువారీ నోట్‌బుక్స్‌ను పరిశీలించడం ద్వారా వారు చేయాల్సిన పని చేస్తున్నారా.. లేదా.. అనేది తెలుసుకోవచ్చన్నారు. ఈ మేరకు ప్రతి జూనియర్ లెక్చరర్‌కు నెలవారీ సిలబస్ కవరేజ్ ప్లాన్‌పై అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ బోర్డ్ కమిషనర్‌ను ప్రవీణ్ ప్రకాశ్ కోరారు.

ఎల్‌పీఎస్ అందించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

ఏపీఎస్సీసీఎఫ్‌సీ 12వ కమిటీ ఆఫ్ పర్సన్స్ సమావేశం తీర్మానం



సమావేశంలో చైర్‌పర్సన్‌లు, అధికారులు

సాక్షి, అమరావతి: పేద ఎస్సీ వర్గాలకు మేలు చేసేలా భూమి కొనుగోలు పథకం(ఎల్‌పీఎస్) అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ 12వ కమిటీ ఆఫ్ పర్సన్స్(సీఓపీ) రాష్ట్ర స్థాయి సమావేశం తీర్మానించింది. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ట్ కులాల సహకార ఆర్థిక సంస్థ(ఏపీఎస్సీసీఎఫ్‌సీ) ప్రధాన కార్యాలయంలో గురువారం సీఓపీ సమావేశం జరిగింది. భూమి కొనుగోలు పథకం ద్వారా 14,223 మంది ఎస్సీలకు 16,213.51 ఎకరాల భూ హక్కు కల్పించేందుకు, తనఖా చెల్లు చీటి పత్రాల విడుదలకు అవకాశం కలిగిందని సమావేశం పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ మాల, మాదిగ, రెల్లి సంక్షేమ, ఆర్థిక సహకార సంస్థల చైర్‌పర్సన్‌లు పెదపాటి అమ్మాజీ, కొమ్మూరి కనకారావు, వడ్డాది మధుసూదనరావు, ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.చిన్నరాముడు, జనరల్ మేనేజర్ కె.సునీల్ రాజ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

రామోజీ.. ఇవి చేతలు కావా!?

రూ.110 కోట్లతో 20 టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు, 20 పాలీహౌస్‌లు, షేడ్‌నెట్లు..

టమాటా రైతుకు అన్ని విధాలుగా ప్రభుత్వం బాసట

అయినా.. బురద జల్లడమే పనిగా పెట్టుకున్న ఈనాడు

సాక్షి, అమరావతి: కళ్లెదుట వాస్తవాలు కన్పిస్తున్నా వాటికి ముసుగేసి తలతోక లేని రాతలు రాస్తూ.. నోటికొచ్చిన విమర్శలు చేసే వారిని ఏమనాలి.. రామోజీరావు అనాలి. ఎందుకంటే.. అన్నదాతలను అయోమయానికి గురిచేయడం.. సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యంగా రోజుకో కథనాన్ని వండి వార్చడం ఆయన లక్ష్యం. టీడీపీ ప్రభుత్వ హయాంలో టమాటా రైతు కోసం చంద్రబాబు ఏనాడు పట్టించుకోకపోయినా పల్లెత్తు మాట అనని రామోజీ.. ఈ నాలుగేళ్లలో టమాటా రైతులకు అన్ని విధాలుగా బాసటగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై మాత్రం బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారు. టమాటా, ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు విషయంలో 'మాటలు సరే.. చేతలేవీ జగన్ సారూ? అంటూ గురువారం ఈనాడులో అచ్చేసిన కథనంలో వాస్తవాలివిగో..

ఈనాడు ఆరోపణ: ఉల్లి, టమాటా రైతులకు బాసట ఏది?

వాస్తవం: రాష్ట్రంలో 1.50 లక్షల ఎకరాల్లో టమాటా, లక్ష ఎకరాల్లో ఉల్లి సాగవుతోంది. ఒక్క కర్నూలు జిల్లాలోనే 62,500 ఎకరాల్లో ఉల్లి.. 11,250 ఎకరాల్లో టమాటా సాగవుతోంది. ఉల్లి, టమాటా రైతులను గతంలో ఏ ప్రభుత్వమూ ఆదుకోని రీతిలో ఈ ప్రభుత్వం ఆదుకుంటోంది. ధరలు పడిపోయినప్పుడు ధరల స్థిరీకరణ నిధి ద్వారా కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయడమే కాక.. కంపెనీలతో సరైన ధరలకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలా.. నాలుగేళ్లలో రూ.10.26 కోట్ల విలువైన 3,193.53 టన్నులను ధరల స్థిరీకరణ కింద సేకరించి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. కానీ, ఈ విషయాన్ని చెప్పేందుకు ఈనాడుకు మనసు రాలేదు.

ఈనాడు ఆరోపణ: ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కడ?

వాస్తవం: రైతులకు గిట్టుబాటు ధర, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా సోలార్ డ్రయ్యర్‌తో కూడిన డీహైడ్రేషన్ యూనిట్ల ఏర్పాటును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారు. తొలుత ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)ల వద్ద రెండు యూనిట్లను మే 2022న ఏర్పాటుచేశారు. ఆ తర్వాత.. పైలట్ ప్రాజెక్టు కింద కర్నూలు జిల్లా తడకనాపల్లిలో గత ఏడాది ఆగస్టులో 10 యూనిట్లు ఏర్పాటుచేశారు. మహిళల ఆసక్తి మేరకు 35 శాతం సబ్సిడీపై మరో 40 యూనిట్లు ఇచ్చారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లిస్తూ ఇప్పటివరకు 1,200 టన్నుల టమాటా, ఉల్లిని ప్రాసెస్ చేశారు. వీటికి కొనసాగింపుగా 2023 జూలైలో మరో వంద యూనిట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతీరోజూ ఒక్కో యూనిట్ ద్వారా 200 కేజీల టమాటా, ఉల్లి ఫ్లేక్స్‌ను తయారుచేయడం ద్వారా ప్రతీ ఒక్కరూ నెలకు రూ.10వేల నుంచి రూ.12 వేలు వరకూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఈ నిజాల్ని దాచేస్తే ఎలా రామోజీ?

ఈనాడు ఆరోపణ: ప్రాసెసింగ్ విస్తరణ చర్యలేవి?

వాస్తవం: పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా


మాటలు సరే.. చేతలేవి జగన్ సారూ..?

రూ.84 కోట్లతో 5 వేల యూనిట్ల ఏర్పాటుకోసం ఇటీవలే బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అవగాహనా ఒప్పందం చేసుకుంది. వీటిలో 3,500 యూనిట్లను రాయలసీమ జిల్లాల్లోనే ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి 100 సోలార్ యూనిట్లను ఒక క్లసర్ కిందకు తీసుకొస్తున్నారు. రైతుల నుంచి ప్రతిరోజూ 20 టన్నులు టమాటా, ఉల్లిని సేకరించి తద్వారా రెండు టన్నుల ఫ్లేక్స్ తయారు చేసేలా ఈ క్లస్టర్‌ను ఏర్పాటుచేస్తున్నారు. కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతంలో ఇప్పటికే 900 మంది లబ్ధిదారులను గుర్తించింది. సెప్టెంబరు నాటికి 500 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, కళ్యాణదుర్గం, సత్యసాయి జిల్లా తనకల్లు ప్రాంతాల్లో లబ్ధిదారులను గుర్తిస్తున్నారు.

ఈనాడు ఆరోపణ: సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ల పరిస్థితి?

వాస్తవం: ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద రూ.110 కోట్లతో 100 శాతం సబ్సిడీపై ఎఫ్‌పీఓల కోసం 20 ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్లు (పీపీసీ) 20 పాలీహౌస్‌లు, షేడ్‌నెట్లను ప్రభుత్వం ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే ఒక్కోటి రూ.3 కోట్ల వ్యయంతో.. 1.5 టన్నుల సామర్థ్యంతో రాయలసీమ జిల్లాల్లో గంగవరం, సోమాల, బైరెడ్డిపల్లి (చిత్తూరు), బి.కొత్తకోట (అన్నమయ్య)లో ఏర్పాటుచేసిన నాలుగు పీపీసీ సెంటర్లను జూలై 25న సీఎం జగన్ ప్రారంభించారు. వీటి వద్ద 1.5 టన్నులను సార్టింగ్, వాషింగ్, గ్రేడింగ్ వంటి వసతుల కల్పనతో పాటు 250 టన్నుల సామర్థ్యంతో కూడిన కోల్డ్ స్టోరేజీలనూ ఏర్పాటుచేశారు. మరో రెండు ప్రాసెసింగ్, ఒక పాలీహౌస్, షేడ్‌నెట్ నిర్మాణంలో ఉన్నాయి. కర్నూలు జిల్లా గూడూరు వద్ద ఉల్లి-టమాటాలను పౌడర్‌గా మార్చే సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేస్తున్నారు. వచ్చే అక్టోబరు నాటికి ఈ ప్లాంటును ఏర్పాటుచేసి ఎఫ్‌పీఓకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఈనాడు ఆరోపణ: టమాటా, ఉల్లి రైతులకు చేయూత ఏదీ?

వాస్తవం: టమాటా, ఉల్లి రైతులకు ఓ వైపు శిక్షణనిస్తూనే మరోవైపు సబ్సిడీపై సూక్ష్మ సేద్యం పరికరాలు అందజేశారు. నాలుగేళ్లలో 30,838 మంది టమాటా రైతులకు 76,383 ఎకరాల్లో రూ.130 కోట్ల విలువైన తుంపర పరికరాలు అందించారు. అకాల వర్షాలవల్ల పంట దెబ్బతిన్న 1,577 మంది టమాటా రైతులకు రూ.102.76 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీని అందించారు. అలాగే, పంటల బీమా కింద ఉల్లి రైతులకు రూ.86 కోట్లు, టమాటా రైతులకు రూ.4.20కోట్లు ఇచ్చారు. కానీ, బాబు హయాంలో ఏనాడు పైసా పరిహారం విదిల్చిన పాపాన పోలేదు. ఇలా ఉల్లి, టమాటా రైతులకు మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈనాడు పత్రికకు అవేమీ కనిపించడంలేదు. ఎందుకంటే దాని యజమాని ఉద్దేశం, లక్ష్యం కేవలం ప్రభుత్వం మీద అక్కసు వెళ్లగక్కడమే.

ఈనాడు ఆరోపణ: సీఎం హామీ ఏమైంది?

వాస్తవం: సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు పత్తికొండలో 3.5 ఎకరాల్లో ఏడాదికి 12వేల టన్నుల సామర్థ్యంతో రూ.10 కోట్లతో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులకు సెప్టెంబర్ రెండో వారంలో భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ యూనిట్‌లో స్టోరేజీ, సార్టింగ్, గ్రేడింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. పల్పింగ్ లైన్, డీ హైడ్రేషన్ లైన్ ఉంటాయి. కెచప్, జామ్, గ్రేవీ లాంటి అదనపు విలువతో కూడిన ఉత్పత్తులు తయారవుతాయి. పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో రాజంపేటలో రూ.294.92 కోట్లతో, నంద్యాలలో రూ.165.32 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గుజ్జు, ఐక్యూఎఫ్ (టమాటా) పరిశ్రమలు ఏర్పాటుచేస్తున్నారు. ఏటా 2.85 లక్షల టన్నులు ప్రాసెస్ చేసే సామర్థ్యంతో వీటిని ఏర్పాటుచేస్తున్నారు. రూ.8.03 లక్షల విలువైన ఉల్లి డీ-టాపింగ్ మిషన్లు, 20 వేల విలువైన సీడ్ డిబ్లర్స్‌ను 50 శాతం సబ్సిడీపై ఉల్లి రైతులకు అందిస్తున్నారు. ఉల్లిని కనీసం 3-4 నెలలపాటు నిల్వచేసుకునేందుకు వీలుగా 25 టన్నుల సామర్థ్యంతో రూ.1.75 లక్షల అంచనాతో మల్టీ యుటిలిటీ నిల్వ కేంద్రాలూ నిర్మిస్తున్నారు. ఒక్క కర్నూలు జిల్లాలోనే 600కు పైగా ఈ నిల్వ కేంద్రాలు నిర్మించారు. ఉల్లి ఎఫ్‌పీఓలకు రూ.6.10 లక్షల విలువైన 15 సోలార్ పాలీ డ్రయ్యర్లను 75 శాతం సబ్సిడీపై సమకూరుస్తున్నారు.

జనం లేకే కుట్రకు తెర

- ప్రజలు ఎక్కువగా రాలేదని లోకేశ్ చిందులు
- యార్లగడ్డ అసమర్థుడంటూ మండిపాటు
- జనాన్ని పోగు చేసి పరువు కాపాడాలని కొల్లు రవీంద్రకు ఆదేశం
- శాంతి, భద్రతల సమస్యలు సృష్టించి మైలేజ్ పొందే యత్నం
- ప్రభుత్వాన్ని పొగుడుతూ ఫ్లెక్సీ వేశారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి
- యువగళం టీంను దాడికి ఉసిగొల్పిన లోకేశ్, దేవినేని ఉమా
- ఫిర్యాదు చేయడానికి వెళ్తే పోలీస్‌స్టేషన్‌లోనూ దౌర్జన్యం

సాక్షి ప్రతినిధి, విజయవాడ/హనుమాన్ జంక్షన్ రూరల్/నూజివీడు: యువగళం పాదయాత్ర జనాలు లేక వెలవెలబోయింది. గురువారం మధ్యాహ్నం తర్వాత జనం బాగా పలుచబడి పోవటంతో ఇటీవల టీడీపీలో చేరిన యార్లగడ్డ వెంకట్రావుపై లోకేశ్ విరుచుకుపడ్డారు. అసమర్థుడు.. జనాలను తేలేకపోయాడని ఇతర నాయకుల ముందే చిందులు తొక్కారు. కొల్లు రవీంద్రను పిలిచి మీరైనా జనాన్ని పోగు చేసి.. జిల్లాలో చివరి రోజు యాత్రలో పరువు పోకుండా కాపాడాలని కోరారు. దీంతో కొల్లు రవీంద్ర గతంలో టీడీపీలో పని చేసిన కొంత మంది నాయకులకు ఫోన్ చేసి.. బతిమిలాడి రప్పించారు. కొంత మంది నేతలు కార్యకర్తలను బలవంతంగా అప్పటికప్పుడు తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం రంగన్నగూడెంలో టీడీపీ నేతలు, కార్యకర్తల తీరు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. నాలుగేళ్లుగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, ఆయన తనయుడు చిన్ను వారి సొంత స్థలంలో బ్యానర్ ఏర్పాటు చేశారు. దీనిపై లోకేశ్ యువగళం టీం సభ్యులు రౌడీమూకల్లా విరుచుకుపడ్డారు. క్షణాల్లో ఆ బ్యానర్‌ను ధ్వంసం చేసి, అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కసుకుర్తి శ్రీనివాసరావు, ఆయన తనయుడు చిన్ను, పార్టీ నాయకులు తలారి పండు, మెడబలిమి చిరంజీవిలపై విచక్షణారహితంగా దాడి చేశారు. బ్యానర్‌ను కట్టిన కర్రలతో వైఎస్సార్‌సీపీ నాయకులను ఇష్టారాజ్యంగా కొట్టారు. కిందపడేసి కాళ్లతో తొక్కారు. అరుపులు, కేకలతో ఒక్కసారిగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నారా లోకేశ్, దేవినేని ఉమా కనుసైగతో రెచ్చిపోయి రాక్షసత్వంగా ప్రవర్తించారు. వారి నుంచి కర్రలను లాక్కునేందుకు పోలీసులు విఫలయత్నం చేశారు. అనంతరం టీడీపీ నేతలను అక్కడి నుంచి పంపించారు. ఈ దాడిని చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపైనా విరుచుకుపడ్డారు. కొందరి సెల్‌ఫోన్‌లు, కెమెరాలు లాక్కుని డేటాను డిలీట్ చేశారు. ఎమ్మెల్యే వంశీ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

కులం పేరుతో దూషించారు..

టీడీపీ నేతలు తమను ఎస్సీ, ఎస్టీ కులం పేరుతో దూషించారని, దాడి చేసి కొట్టారని వైఎస్సార్‌సీపీ నేతలు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతలో టీడీపీ నేత దేవినేని ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, ఇతర నేతలు, కార్యకర్తలు వారిని దూషిస్తూ పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకొచ్చారు. ఆ ముగ్గుర్ని కులంపేరుతో దూషిస్తూ పోలీసుల ఎదుటే వారిపై దాడికి యత్నించారు. పోలీసులు టీడీపీ నేతలను బయటకు పంపారు. ఈ ఘటనపై దేవినేని ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, కొల్లు రవీంద్రతో కలిపి 22 మంది పోలీస్‌స్టేషన్‌లోనే తమపై దాడికి యత్నించారని, కులం పేరుతో దూషించారని వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, అంతకు ముందు వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

మైలేజ్ కోసం దిగజారిన టీడీపీ

కృష్ణాజిల్లాలో యాత్ర చివరి రోజు జనాలు లేకపోవటంతో ఏదో ఒక రకంగా శాంతిభద్రతల సమస్య సృష్టించి మైలేజ్ పొందాలని టీడీపీ నేతలు పన్నాగం పన్నారు. వైకాపా కార్యకర్తలను, పోలీసులను కవ్వించి ఏదొక విధంగా శాంతిభద్రతల సమస్యలు సృష్టించాలని ప్రయత్నించారు. ఇందులో భాగంగా కొద్దిసేపు ధర్నా, నిరసన చేపట్టారు. పోలీసులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సంయమనం పాటించి ఎదురు దాడికి దిగకపోవడంతో వారు చేసేదేమీ లేక యాత్రను త్వరగా ముగించుకుని ఏలూరు జిల్లాలోకి వెళ్లిపోయారు. కాగా, యువగళం పాదయాత్రలో లోకేశ్‌ను అడ్డుకున్నారని, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తమను పోలీస్‌స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకున్నారని టీడీపీ నేతలు కొంత మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు. ఆయా ఘటనల్లో వాస్తవాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ జాషువా తెలిపారు.



రంగన్నగూడెంలో రణరంగం సృష్టించిన యువగళం టీం, తెలుగు తమ్ముళ్లు



వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావుపై దాడి చేస్తున్న యువగళం టీం సభ్యులు

పాదయాత్రలో ఏబీవీ

ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం వద్ద టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. పలువురు నేతలు ఆయనకు స్వాగతం పలికారు. సింగన్నగూడెంలో గౌడ సామాజిక వర్గీయులతో, మల్లవల్లిలో బీసీ కులస్తులతో, కొత్త మల్లవల్లిలో ఆయిల్‌పామ్ రైతులతో ఆయన భేటీ అయ్యారు. ఇదిలా ఉండగా మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్, ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మల్లవల్లిలో లోకేశ్‌ను కలిసి మంతనాలు సాగించారు. పరోక్షంగా ఏర్పాట్లు సైతం పర్యవేక్షించారు. గురువారం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం అంపాపురంలో బస వద్ద ఆయన లోకేశ్‌ను కలిసి చర్చించారు. టీడీపీ నేతలు దేవినేని ఉమా, రావి వెంకటేశ్వరరావుతో కూడా మాట్లాడారు. టీడీపీ నేతల బ్యానర్లలో ఆయన ఫొటో ముద్రించడం గమనార్హం.



మల్లవల్లిలో టీడీపీ నేతలతో కలిసి లోకేశ్ పాదయాత్రను తిలకిస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు

వచ్చే ఎన్నికల్లో ప్రజలే మీ గుడ్డలూడదీసి

కుప్పం పంపుతారు..

చంద్రబాబు, లోకేశ్‌లపై గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం



గుడివాడ టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలే చంద్రబాబు, లోకేశ్‌ల గుడ్డలూడదీసి కుప్పం పంపిస్తారని కృష్ణా జిల్లా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. గురువారం ఆయన పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ లోకేశ్ తన పాదయాత్రలో తనను, గన్నవరం ఎమ్మెల్యే వంశీని కట్ డ్రాయర్‌తో నడిరోడ్డుపై నడిపిస్తాననడంపై స్పందించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 33 నియోజకవర్గాల నుంచి జనాన్ని పోగేసి సీఎం జగన్, తమ పార్టీ నాయకుల చేతిలో ఓడిపోయిన చవటల్ని వెంట పెట్టుకుని లోకేశ్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే బాబూకొడుకులు గుడివాడ, గన్నవరంలలో పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తుడిచి పెట్టుకుపోవడం ఖాయమని, అనంతరం ఆ పార్టీ నాయకులే ఈ బాబూకొడుకులను తరిమేస్తారని నాని జోస్యం చెప్పారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు టీడీపీని తమ చేతుల్లోకి తీసుకోవడం ఖాయమని.. బాబూకొడుకులు పిచ్చెక్కి రోడ్ల మీద తిరగడం తథ్యమని స్పష్టం చేశారు. మమ్మల్ని పొడుస్తాం.. నరుకుతాం .. అంటూ వ్యాఖ్యలు చేసిన బుద్దా వెంకన్నపై నాని విరుచుకుపడ్డారు. తనను, వంశీని చంపడమంటే.. కొబ్బరి చిప్పలు కాజేసినంత తేలిక కాదన్నారు. 'మీ దగ్గర ఉన్న కత్తులు, కటారులు ఎలా పొడుస్తాయో.. అలాంటివి మా దగ్గర కూడా ఉంటాయని గుర్తుంచుకోవాలి' అంటూ కొడాలి నాని హితవు పలికారు.

దొంగ ఓట్ల తొలగింపుతో బాబు గగ్గోలు

- ఓట్లు ఎక్కడ పెరిగాయో చంద్రబాబు, ఆయన అద్దె మైకులు, ఎల్లో మీడియా చెప్పాలి: సజ్జల రామకృష్ణారెడ్డి
- చంద్రబాబు హయాంలోనే 60 లక్షల దాకా దొంగ ఓట్లు ఉన్నాయి
- ఆ నిర్వాకాలను మేం కూడా ఢిల్లీ వెళ్లి ఈసీ దృష్టికి తీసుకొస్తాం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓట్ల తొలగింపుపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యవహార శైలి దొంగే.. దొంగా దొంగా అన్నట్లుగా ఉందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు తన టక్కు టమార విద్యలను అఖిల భారత స్థాయిలో ప్రదర్శించేందుకే ఢిల్లీ వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలుస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం కూడా ఈసీని కలసి టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు వ్యవహరించిన తీరును మరోసారి గుర్తు చేసి దొంగ ఓట్లను తొలగించాలని కోరుతుందని సజ్జల స్పష్టం చేశారు. సజ్జల గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆది నుంచి చంద్రబాబుకు తెలిసిందల్లా అడ్డదారులు తొక్కడం, గోడలు దూకడమేనని ధ్వజమెత్తారు. దొంగ ఓట్లను చేర్పించడం, వ్యతిరేక వర్గాల ఓట్లను తొలగించడం లాంటి టక్కు టమార విద్యల్లో చంద్రబాబుకు ఎన్ని పీహెచ్‌డీలైనా ఇవ్వొచ్చన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని బ్లూఫ్రాగ్ అనే ప్రైవేట్ సంస్థకు చేరవేసి సేవా మిత్ర యాప్ ద్వారా వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు చెందిన 50 లక్షల ఓట్లను తొలగించారని గుర్తు చేశారు. దీనిపై 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ పోరాటం చేసి కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చి 30 లక్షల మంది ఓట్లను ఓటర్ల జాబితాలో చేర్పించిందని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చేర్పించిన దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు లాంటివి సుమారు 60 లక్షల ఓట్లు ఇప్పటికీ ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు తెలుసుకుని దొంగ ఓట్లను తొలగించేలా బూత్ లెవల్ ఆఫీసర్‌కు ఫారం-7 అందజేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సీఎం జగన్ పిలుపునిచ్చినప్పటి నుంచి చంద్రబాబు గగ్గోలు పెడుతున్నారని సజ్జల పేర్కొన్నారు.

ఓట్ల తొలగింపును తప్పుపట్టలేదు..

ఉరవకొండ నియోజకవర్గంలో 2017 జూన్ 17 నుంచి 2021 ఏప్రిల్ 30 వరకూ 4,081 ఓట్లను తొలగించగా 2021 జూన్ నుంచి ఇప్పటివరకూ 2,913 ఓట్లను రిటర్నింగ్ అధికారులు తొలగించారు. ఓట్ల తొలగింపును ఎన్నికల సంఘం తప్పుపట్టలేదు. తొలగించే ప్రక్రియలో నిబంధనల మేరకు వ్యవహరించలేదని శోభారాణి, భాస్కర్‌రెడ్డిని సస్పెండ్ చేసింది. టీడీపీ హయాం నుంచి ఇప్పటి వరకూ ఉరవకొండలో 7 వేల ఓట్లను తొలగించగా 30 వేల ఓట్లు తొలగించినట్లు టీడీపీ రాద్ధాంతం చేస్తోంది. ఊరూరా ఉరవకొండలే అంటూ ఈనాడు, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయి.

దొంగ ఓట్ల సంస్కృతికి ఆద్యుడు చంద్రబాబే..

హామీలను నెరవేర్చి ప్రజల మన్ననలు పొంది అధికారంలోకి రావాలన్నది సీఎం జగన్ విధానమైతే, అడ్డదారులు తొక్కడం, గోడలు దూకడం ద్వారా అధికారంలోకి రావాలన్నది చంద్రబాబు సిద్ధాంతం. దొంగ ఓట్ల సంస్కృతికి ఆద్యుడు చంద్రబాబే. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బ్లూఫ్రాగ్ అనే ప్రైవేట్ సంస్థకు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని చేరవేశారు. సేవా మిత్ర యాప్ పేరుతో టీడీపీ కార్యకర్తలను ప్రజల ఇళ్ల వద్దకు పంపి సాక్షి పేపరు చదువుతున్నారా..? సాక్షి టీవీ చూస్తున్నారా? అని ఆరా తీసి అవునని సమాధానం చెప్పిన వారి ఓట్లను తొలగించేలా బీఎల్వోలకు ఫారం-7 పంపారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు చెందిన 50 లక్షలకుపైగా ఓట్లను తొలగించారు. అంతకంటే ఎక్కువ స్థాయిలో దొంగ ఓట్లను చంద్రబాబు చేర్పించారు. ఒకే ఇంటి నెంబరుతో 700 ఓట్లను చేర్పించారు. కుప్పంలో 40 వేలకుపైగా దొంగ ఓట్లను చేర్పించారు. 2019 ఎన్నికలకు ముందు విశాఖ తూర్పు నియోజకవర్గంలో 30 వేల దొంగ ఓట్లను చేర్పించారు.

ఓట్లు పెరిగింది ఎక్కడ?

చంద్రబాబు సర్కారు అక్రమాలపై నాడు వైఎస్ జగన్ 2019 ఎన్నికలకు ముందు ఢిల్లీ వెళ్లి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల సంఘం స్పందించి మళ్లీ 30 లక్షలకుపైగా ఓట్లను చేర్పించింది. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని బ్లూఫ్రాగ్‌కు అందచేసిన వ్యవహారంపై సభా సంఘం విచారణ కొనసాగుతోంది. ఇందులో చంద్రబాబుకు, తప్పు చేసిన వారికి శిక్ష పడటం ఖాయం. 2019 ఎన్నికల నాటికి రాష్ట్రంలో 3,98,34,776 ఓట్లు ఉంటే 2023 మార్చి 31 నాటికి 3,97,96,678 ఓట్లు ఉన్నాయి. మరి ఇక ఓట్లు ఎక్కడ పెరిగాయో చంద్రబాబు, ఆయన అద్దె మైకులు పవన్ కళ్యాణ్, బండి సంజయ్, ఎల్లో మీడియా చెప్పాలి.

రాష్ట్రంలో పదేళ్లుగా ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపుల వివరాలు

సంవత్సరం	తుది జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య	నిరంతర సవరణ ప్రక్రియ		మొత్తం ఓటర్ల సంఖ్య
		చేర్చిన ఓటర్ల సంఖ్య	తొలగించిన ఓటర్ల సంఖ్య	
2014	3,53,83,376	16,92,352	2,48,984	3,68,26,744
2015	3,70,82,863	3,08,880	22,76,714	3,51,15,029
2016	3,51,87,547	3,84,602	13,00,613	3,42,71,536
2017	3,45,75,425	11,72,963	14,46,238	3,43,02,150
2018	3,49,23,171	5,35,561	2,63,472	3,51,95,260
2019	3,69,33,091	31,97,473	2,95,788	3,98,34,776
2020	3,99,37,394	3,26,824	1,85,193	4,00,79,025
2021	4,04,41,378	3,08,498	1,11,076	4,06,38,800
2022	4,06,68,344	2,41,463	11,23,829	3,97,85,978
2023	3,99,16,706	-	-	3,97,96,678 (మార్చి 31 వరకూ)

బాబు బృందానిదే దొంగ ఓట్ల సంస్కృతి

ఓటర్ల జాబితా, ఈవీఎంలపై ఆరోపణలు బాబుకు ఆనవాయితీ: మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: దొంగ ఓట్లను చేర్పించే అలవాటు చంద్రబాబు, ఆయన శిష్యులకే ఉందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు దొంగ ఓట్లు అంటూ ఆరోపణలు చేసే చంద్రబాబు ఎన్నికల తర్వాత ఈవీఎంలపై ఆరోపణలు చేస్తారని ధ్వజమెత్తారు. గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓటరు జాబితాను ఎవరైనా చెక్ చేసుకోవచ్చని చెప్పారు. అడ్డదారుల్లో అధికారం కోసం కుట్రలు చేయడంలో చంద్రబాబు ఎంత దిట్టగా పేరు పొందారో తెలుగు వారందరికీ తెలుసన్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రజల మనసును చూరగొంటుందన్నారు. ప్రజా తీర్పుతో గెలుపొందడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఓటర్ల జాబితాపై చంద్రబాబు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేదా సుప్రీంకోర్టుకైనా వెళ్లవచ్చన్నారు. చంద్రబాబు దేన్నైనా రాజకీయాల కోసం వాడుకుంటారని వ్యాఖ్యానించారు. ఉరవకొండలో జరిగిన దాన్ని పెద్దదిగా చిత్రీకరిస్తున్నారని, టీడీపీ ప్రచారంలో నిజం లేదని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. దొంగ ఓట్లు ఎక్కడ ఉన్నా అధికారులు గుర్తించి తొలగిస్తారని తెలిపారు. 'రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులందరికీ న్యాయం చేశాం. పారిశుధ్య కార్మికులకు ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనంత మెరుగ్గా వేతనాలు ఇస్తున్నాం. కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తాం' అని మంత్రి సురేష్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

'మిజోరం' ప్రమాదం.. 22కు చేరిన మృతులు

ఐజ్వాల్: మిజోరంలోని ఐజ్వాల్‌లో బుధవారం నిర్మాణంలో ఉన్న వంతెన కూలిన ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. గురువారం సాయంత్రం వరకు మొత్తం 22 మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. జాడ తెలియకుండా పోయిన మరో వ్యక్తి కోసం గాలింపు కొనసాగుతోంది. అతడు ప్రాణాలతో ఉండే అవకాశాలు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. క్షతగాత్రులైన ముగ్గురిలో ఇద్దరిని ఆస్పత్రి నుంచి వైద్యులు డిశ్చార్జి చేశారు. బాధితులైన మొత్తం 26 మందీ పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా జిల్లాకు చెందిన వారే.

ఉత్తరకొరియా నిఘా ఉపగ్రహ ప్రయోగం మళ్లీ విఫలం

సియోల్: ఉత్తరకొరియా రెండో సారి చేపట్టిన నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలమైంది. గత మేలో చేపట్టిన నిఘా ఉపగ్రహం మొదటి ప్రయోగం కూడా విఫలమైన విషయం తెలిసిందే. మూడో దశలో ఎమర్జెన్సీ బ్లాస్టింగ్ వ్యవస్థలో లోపం వల్లే గురువారం పసిఫిక్ సముద్ర జలాల్లో ఉపగ్రహాన్ని మోసుకెళ్లే చొల్లిమ-1 రాకెట్ కూలిందని వివరించింది. వచ్చే అక్టోబర్‌లో మూడోసారి మరింత మెరుగ్గా ఈ ప్రయోగం చేపడతామని ఉత్తరకొరియా గురువారం ప్రకటించింది. ఈ ప్రయోగం కారణంగా జపాన్ ప్రభుత్వం ఒకినావా దీవుల్లోని తన ప్రజలను అప్రమత్తం చేసింది. ఉత్తరకొరియాలోని తొంగ్‌చాంగ్-రి తీరం నుంచి గురువారం మధ్యాహ్నం 3.50 గంటలకు ఈ ప్రయోగం జరిగినట్లు దక్షిణకొరియా మిలటరీ తెలిపింది.

కాల్వలో పడిన ట్రాక్టర్.. 9 మంది మృతి

లక్నో: ట్రాక్టర్ ట్రాలీ కాల్వలోకి దూసుకెళ్లిన ఘటనలో నలుగురు చిన్నారులు సహా మొత్తం తొమ్మిది మంది మృతి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని షహరాన్‌పూర్ జిల్లాలో ఈ విషాదం చోటుచేసుకుంది. తాజ్‌పురా ప్రాంతానికి చెందిన సుమారు 50 మంది బుధవారం సాయంత్రం రన్‌దౌల్ గ్రామంలో జరిగే మతపరమైన కార్యక్రమానికి ట్రాక్టర్‌లో బయలుదేరారు. రెధిబోడ్కి గ్రామ సమీపంలోని కాల్వలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ పడిపోయింది. బుధవారం నాలుగు, గురువారం అయిదు మృతదేహాలను కాల్వ నుంచి బయటకు తీశారు. మృతుల్లో 5-12 ఏళ్ల మధ్య వయస్సున్న నలుగురు చిన్నారులున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు.

నిక్కీ హేలీ, వివేక్ రామస్వామి ఇద్దరూ ఇద్దరే. భారత సంతతికి చెందిన వారే. రిపబ్లికన్ల అమెరికా అధ్యక్ష అభ్యర్థుల తొలి చర్చలో వారిద్దరే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఉక్రెయిన్ యుద్ధంపై మాటల తూటాలు విసురుకున్నారు. చివరికి వివేక్ రామస్వామి పైచేయి సాధించారు. ట్రంప్‌కు గట్టి పోటీ ఇస్తారని అంచనాలున్న రాన్ డిసాంటిస్‌ను పక్కకు పెట్టి మరీ రామస్వామి ముందుకు దూసుకుపోతున్నారు.



నువ్వా X నేనా?

రిపబ్లికన్ల అమెరికా అధ్యక్ష అభ్యర్థుల చర్చలో సత్తా చాటిన భారతీయ అమెరికన్లు
వివేక్ రామస్వామి వర్సెస్ నిక్కీ హేలీ మధ్య మాటల తూటాలు
రేసులో దూసుకుపోతున్న వివేక్ రామస్వామి

➤ రిపబ్లికన్ పార్టీ అమెరికా అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరిగిన తొలి చర్చ వాడీగా వేడిగా సాగింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ చర్చకు దూరంగా ఉండడంతో ఇద్దరే ఇద్దరు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. వారిద్దరూ భారత సంతతికి చెందిన అభ్యర్థులే. దక్షిణ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ, మల్టీ మిలియనీర్ వివేక్ రామస్వామి మధ్య ఉక్రెయిన్ యుద్ధంపై చర్చ మరో మలుపు తీసుకుంది. అమెరికా చరిత్రలో ఇద్దరు భారతీయులు ఒకే వేదికను పంచుకొని ఈ తరహాలో చర్చించుకోవడం ముందెన్నడూ జరగలేదు. ఇద్దరికి ఇద్దరు ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఒకానొక దశలో వేలి చూపిస్తూ బెదిరించుకున్నారు. ఒకరిపై మరొకరు 30 సెకండ్లపాటు అరుచుకున్నారు. విదేశీ వ్యవహారాల్లో వివేక్ రామస్వామికి అవగాహన లేదని, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం అంశంలో ఆయన పుతిన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నారంటూ నిక్కీ హేలీ గట్టి ఆరోపణలే చేశారు. అమెరికా శత్రువులకి కొమ్ముకాస్తూ, దేశ మిత్రులకు దూరంగా వెళుతున్నారని వివేక్‌ను దుయ్యబట్టారు. పుతిన్ ఒక హంతకుడని అతనికి మద్దతుగా మాట్లాడేవారు ఈ దేశానికి అధ్యక్షుడైతే భద్రత గాల్లో దీపంలా మారుతుందంటూ హేలీ మండిపడ్డారు. హేలీ మాట్లాడుతున్నంత సేపు వివేక్ రామస్వామి ఆమెని అడ్డుకుంటూనే ఉన్నారు. హేలీ చెబుతున్నవన్నీ అబద్ధాలని , తనపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారంటూ ఎదురు దాడికి దిగారు.

అమెరికా భద్రతే ముఖ్యం..

➤ ఉక్రెయిన్‌కు మరింత సాయానికి తాను వ్యతిరేకిస్తానని వివేక్ రామస్వామి ఈ చర్చలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అమెరికాకు ఉక్రెయిన్ ప్రధానం కాదని, వారికి చేసే మిలటరీ సాయాన్ని తమ దేశ సరిహద్దుల్లో మోహరిస్తే దేశ భద్రత మరింత పటిష్టమవుతుందని వివేక్ రామస్వామి పేర్కొన్నారు. రక్షణ రంగానికి చెందిన కాంట్రాక్టర్ల ఒత్తిడితోనే నిక్కీ ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్నారంటూ ధ్వజమెత్తారు. ఈ చర్చలో నిక్కీ హేలీపై వివేక్ రామస్వామి పై చేయి సాధించారు. అమెరికాకు ఎప్పుడైనా తన దేశ భద్రతే ముఖ్యం తప్ప, ఉక్రెయిన్‌కు సాయం చేయడం కాదంటూ గట్టిగా వాదించారు. రాజకీయ అనుభవం లేకపోవడంతో మొదట్లో అంతగా గుర్తింపు లేని వివేక్ రామస్వామి తాను నమ్మిన సిద్ధాంతాలను ఆకట్టుకునేలా చెప్పడం ద్వారా మద్దతు పెంచుకుంటున్నారు. అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందున్న డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీగా ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ పేరు వినిపించేది. మొదటి చర్చలో రాన్ ఎంత మాత్రం ప్రభావితం చూపించలేకపోయారు. ఇప్పుడు ఆయనను దాటుకొని మరీ వివేక్ రామస్వామి దూసుకుపోతున్నారు. తొలి చర్చలో వివేక్‌రామస్వామి విజేతగా నిలిచారంటూ వివిధ పోల్స్ వెల్లడిస్తున్నాయి. సెప్టెంబర్ 22న జరిగే రెండో చర్చలో వివేక్ రామస్వామి ఏం మాట్లాడతారన్న ఉత్కంఠ రేపుతోంది.

ఎవరీ వివేక్ రామస్వామి ?

కేరళ నుంచి అమెరికాకు వలస వెళ్లిన భారతీయ దంపతులకు ఒహియోలోని సిన్సినాటిలో 1985, ఆగస్టు9న వివేక్ రామస్వామి జన్మించారు. సంప్రదాయ హిందూ కుటుంబంలో పుట్టి పెరిగారు. తండ్రి ఎలక్ట్రిక్ ఇంజనీరు. తల్లి మానసిక వైద్యురాలు. యేల్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాల్లో రామస్వామి చదువుకున్నారు. పాఠశాలలో విద్యనభ్యసించేటప్పుడు జూనియర్ టెన్నిస్ క్రీడాకారుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. యువకుడిగా ఉన్నప్పుడు తీరిక సమయాల్లో అల్జీమర్స్ రోగుల వద్ద పియానో వాయించేవారు. కాలేజీలో చదువుకున్నప్పుడు స్టూడెంట్‌బిజినెసెస్.డాట్‌కామ్ సహవ్యవస్థాపకుడిగా ఉంటూ వ్యాపార రంగంలో అడుగు పెట్టారు. 2007 నుంచి 2014 వరకు క్యూవీటీ ఫైనాన్స్ సంస్థలో పని చేశారు. 2014లో సొంతంగా బయోటెక్ కంపెనీ రాయివాంట్ సైన్సెస్‌ను ఏర్పాటు చేశారు. అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA) ఆమోదం పొందిన ఐదు ఔషధాలను అభివృద్ధి చేశారు. 10 మంది ఉద్యోగులతో ప్రారంభమైన ఈ సంస్థ 2017 నాటికి 110 కోట్ల డాలర్ల వ్యాపారం చేసే సంస్థగా ఎదిగింది. అమెరికాలో 40 ఏళ్లకు తక్కువ వయసున్న అత్యంత ధనికుడైన ఎంటర్ ప్రెన్యూర్‌గా ఫోర్బ్స్ జాబితాలోకెక్కారు. వివేక్ రామస్వామి ఆస్తుల విలువ 63 కోట్ల డాలర్లు ఉంటుందని అంచనా. తన క్లాస్‌మేట్ అయిన అపూర్వ తివారీని 2015లో పెళ్లాడిన వివేక్ రామస్వామికి కార్తీక్, అర్జున్ అనే ఇద్దరు అబ్బాయిలున్నారు. పుస్తక రచన, రాజకీయాలపై ఆసక్తితో రాయివాంట్ సంస్థ సీఈవో పదవి నుంచి 2021లో ఆయన తప్పుకున్నారు. 'వోక్, ఇంక్: ఇన్‌సైడ్ కార్పొరేట్ అమెరికాస్ సోషల్ జస్టిస్ స్కామ్'అనే పుస్తకాన్ని రచించారు. ఎన్నో పత్రికల్లో వ్యాసాలు రాశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ వేశారు. సాంస్కృతిక ఉద్యమంతో కొత్త అమెరికా కల సాకారమవుతుందని రామస్వామి నినదిస్తున్నారు. ఇప్పటికే ఎలన్‌మస్క్ వంటి పారిశ్రామికవేత్తలు రామస్వామికి బహిరంగంగా మద్దతు పలుకుతూ ఉండడం , ట్రంప్ చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తూ ఉండడంతో వివేక్ రామస్వామి వైపు రిపబ్లికన్లు తిరుగుతారా అన్న చర్చ మొదలు కావడం విశేషం.

– సాక్షి, నేషనల్ డెస్క్

జాబిల్లిపై భారత్ నడక

- చంద్రయాన్-3 సక్సెస్‌పై ఇస్రో హర్షాతిరేకాలు
- రోవర్ ప్రజ్ఞాన్ నడక ప్రారంభించిందంటూ పోస్టు

బెంగళూరు/న్యూఢిల్లీ: చంద్రయాన్-3 మిషన్ విజయవంతం కావడం పట్ల భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. ల్యాండర్ విక్రమ్ నుంచి రోవర్ ప్రజ్ఞాన్ బయటకు వచ్చి, తన కార్యాచరణ ప్రారంభించింది. చందమామ ఉపరితలంపై పరిశోధనలు చేస్తూ భూమిపైకి విలువైన సమాచారాన్ని చేరవేస్తోంది. రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడిపై నిర్విఘ్నంగా అడుగుపెట్టడాన్ని ప్రస్తావిస్తూ 'చందమామపై భారత్ నడుస్తోంది'' అని ఇస్రో పేర్కొంది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేసింది. చంద్రుడి కోసం భారత్‌లో తయారు చేసిన ఈ రోవర్ ల్యాండర్ నుంచి బయటకు అడుగుపెట్టి, చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా నడక ప్రారంభించిందని వెల్లడించింది. ప్రజ్ఞాన్ రోవర్ ప్రయాణం పట్ల ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. చంద్రుడి గురించి మన పరిజ్ఞానం మరింత పెరగడానికి ప్రజ్ఞాన్ దోహదపడుతుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

ల్యాండర్, రోవర్ జీవిత కాలం పెరుగుతుందా?

చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై అడుగుపెట్టింది. అందులో నుంచి రోవర్ బయటకు వచ్చింది. వాస్తవానికి రోవర్ జీవితకాలం ఒక లూనార్ డే. అంటే 14 రోజులు. 14 రోజులపాటు రోవర్ ప్రజ్ఞాన్ ల్యాండింగ్ సైట్ నుంచి అటూఇటూ సంచరిస్తూ పరిశోధనలు చేయనుంది. అయితే, రోవర్ జీవితకాలం 14 రోజులు మాత్రమే కాదని, మరింత పెరిగే అవకాశం ఉందని ఇస్రో సైంటిస్టులు చెబుతున్నారు. దక్షిణ ధ్రువంపై 14 రోజులు చీకటి, 14 రోజులు వెలుగు ఉంటుంది. సూర్యోదయం అయినప్పుడు సూర్యుడి నుంచి రోవర్ సౌరశక్తిని గ్రహించి, దాన్ని విద్యుత్‌గా మార్చుకొని పరిశోధనలు కొనసాగించేందుకు ఆస్కారం ఉందంటున్నారు. ల్యాండర్, రోవర్‌ల మొత్తం బరువు 1,752 కిలోలు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై 14 రోజులపాటు పనిచేసేలా వీటిని రూపొందించారు. లూనార్ డే ముగిసిన తర్వాత కూడా వాటిలో జీవం నిండే అవకాశాలు లేకపోలేదని పేర్కొంటున్నారు. సూర్యకాంతి ఉన్నంతవరకు ల్యాండర్, రోవర్ చక్కగా పనిచేస్తాయి. చీకటి పడగానే ఉష్ణోగ్రత మైనస్ 180 డిగ్రీలకు పడిపోతుంది. అవి పనిచేయడం ఆగిపోతుంది.

గూగుల్ డూడుల్‌గా చంద్రయాన్-3

చంద్రయాన్-3 మిషన్ విజయం పట్ల సెర్చ్ ఇంజన్ గూగుల్ తన సంతోషాన్ని నెటిజన్లతో పంచుకుంది. గురువారం గూగుల్ డూడుల్‌గా చంద్రయాన్-3కు సంబంధించిన ప్రత్యేక యానిమేటెడ్ చిత్రం ప్రత్యక్షమయ్యింది. ఇందులో గూగుల్ అనే ఇంగ్లిష్ అక్షరాలు అంతరిక్షంలో నక్షత్రల్లాగా తేలుతూ కనిపించాయి. రెండో అక్షరం చంద్రుడిలా దర్శనమిచ్చింది.

26న ఇస్రో ప్రధాన కార్యాలయానికి ప్రధాని మోదీ

చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో సైంటిస్టులను స్వయంగా కలిసి అభినందించడానికి ప్రధాని మోదీ ఈ నెల 26న బెంగళూరుకు రానున్నారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో సైంటిస్టులతో సమావేశమవుతారు.


ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్

మనిషి మనుగడకు అవకాశం

శివాజీనగర: చంద్రుని దక్షిణ ధ్రువం భవిష్యత్‌లో మానవాళి మనుగడకు వీలుగా ఉంటుందని విశ్వసిస్తున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. అందుకే చంద్రయాన్-3 ల్యాండర్ దిగటానికి ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నామని తెలిపారు. 'మనం దాదాపు 70 డిగ్రీల దక్షిణ ధ్రువానికి దగ్గరగా వెళ్లాం, అక్కడ సూర్యరశ్మి తక్కువగా ఉండటానికి ఒక నిర్దిష్ట ప్రయోజనం ఉంది. రోవర్ ద్వారా ఆ ప్రాంతం గురించి శాస్త్రీయంగా మరింత సమాచారం లభించే అవకాశముంది. చంద్రునిపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు దక్షిణ ధ్రువంపై చాలా ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ఎందుకంటే మానవులు వెళ్లి అక్కడ నివాసాలను సృష్టించి ఆపై దాటి ప్రయాణించాలని అనుకుంటున్నారు. కాబట్టి మనం వెతుకుతున్నది ఉత్తమమైన ప్రదేశం. దక్షిణ ధ్రువం అలా ఉండేందుకు అవకాశముంది'అని ఆయన చెప్పారు. గురువారం ఆయన బెంగళూరులోని ఇస్రో కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇస్రో శాస్త్రవేత్తల నాలుగేళ్ల శ్రమకు తగ్గ ఫలితం లభించిందని అన్నారు. చంద్రునిపై విజయవంతంగా దిగిన విక్రమ్ ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ సాఫీగా బయటకు వచ్చిందని తెలిపారు. 'నిర్దేశిత ప్రయోజనం కోసం దక్షిణ ధ్రువంపైన గుర్తించిన 4.5 కి.మీ. x 2.5 కి.మీ. ప్రాంతానికి సరిగ్గా 300 మీటర్ల దూరంలోపు దూరంలోనే ల్యాండర్ దిగింది. రోవర్‌లోని రెండు పరికరాలు, ల్యాండర్‌లోని మూడు పరికరాలు నిర్దేశించిన విధంగా పనిచేస్తున్నాయి'అని పేర్కొన్నారు. రోవర్ బయట తిరుగాడుతూ పరిశోధనల ప్రారంభించిందని చెప్పారు. రోవర్‌లో అమర్చిన రెండు పరికరాలు చంద్రుని మట్టిలో మూలకాలు, రసాయనాలను పరిశీలిస్తాయని చెప్పారు. రోబోటిక్ పాత్ ప్లానింగ్ కూడా చేయిస్తాయని తెలిపారు.

- విస్తరణకు జొహన్నెస్‌బర్గ్ శిఖరాగ్రం నిర్ణయం
- 2024 జనవరి నుంచి అమల్లోకి...
- ప్రధాని మోదీ సహా నేతల హర్షం

బ్రిక్స్‌లోకి మరో ఆరు దేశాలు



బ్రిక్స్ వేదికపై చేతులు కలిపిన నేతలు


జొహన్నెస్‌బర్గ్‌లో భారత సంతతి ప్రజలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: బ్రిక్స్ కూటమిలోకి మరో ఆరు దేశాలు వచ్చి చేరనున్నాయి. అర్జెంటీనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లకు పూర్తి స్థాయి సభ్యత్వం ఇవ్వాలని కూటమి నిర్ణయించింది. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న మూడు రోజుల శిఖరాగ్ర భేటీలో ఆఖరు రోజైన గురువారం మీడియా సమావేశంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా ఈ మేరకు ప్రకటించారు. 2024 జనవరి ఒకటో తేదీ నుంచి ఆరు దేశాల సభ్యత్వం అమల్లోకి వస్తుందని తెలిపారు. బ్రిక్స్ బలం అయిదు నుంచి 11 దేశాలకు పెరగనుంది. ఈ నిర్ణయంపై ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా హర్షం వ్యక్తం చేశారు. బ్రిక్స్ అధ్యక్ష పీఠంపై ఉన్న దక్షిణాఫ్రికాలో కూటమి శిఖరాగ్ర సమ్మేళనం జరుగుతోంది. 'సిద్ధాంతాలు, ప్రమాణాలు, విధానాల ప్రాతిపదికన విస్తరణ ప్రక్రియను ఏకాభిప్రాయంతో చేపట్టాం. మున్ముందు కూడా కూటమిని విస్తరిస్తాం' అని రమఫోసా చెప్పారు. బ్రిక్స్ విస్తరణ, ఆధునీకరణ.. ప్రపంచంలోని అన్ని సంస్థలు మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలనే సందేశం ఇస్తుందని ప్రధాని మోదీ ఒక ప్రకటనలో తెలిపారు. 'బ్రిక్స్ విస్తరణకు భారత్ మొదట్నుంచీ మద్దతుగా నిలిచింది. కొత్తగా సభ్య దేశాలను చేర్చుకోవడం ద్వారా బ్రిక్స్ మరింత బలోపేతమవుతుంది. ఉమ్మడి ప్రయత్నాలకు కొత్త ఊపునిస్తుంది. బహుళ ధ్రువ ప్రపంచ క్రమతపై విశ్వాసం పెంచుతుంది'అని ప్రధాని మోదీ అన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తన వర్చువల్ ప్రసంగంలో బ్రిక్స్ తాజా విస్తరణపై హర్షం వ్యక్తం చేశారు. కూటమిలో సహకారానికి కొత్త అధ్యాయం మొదలైందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. బ్రిక్స్ భాగస్వామ్య దేశం నమూనా, కూటమిలో చేరాలనుకునే దేశాల జాబితాను ఏడాది జరిగే శిఖరాగ్ర సమ్మేళనం నాటికి సిద్ధం చేసే బాధ్యతను విదేశాంగ మంత్రులకు అప్పగించినట్లు రమఫోసా చెప్పారు. స్థానిక కరెన్సీలు, చెల్లింపు విధానాల్లో తలెత్తే సమస్యల పరిష్కారంపై నివేదిక రూపొందించాల్సిందిగా బ్రిక్స్ ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లకు సూచించేందుకు అంగీకారానికి వచ్చినట్లు ఆయన వివరించారు. 2006లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలు బ్రిక్‌గా ఏర్పాటయ్యాయి. దక్షిణాఫ్రికా చేరికతో 2010 నుంచి బ్రిక్స్‌గా రూపాంతరం చెందింది. బ్రిక్స్‌లో చేరేందుకు 40 వరకు దేశాలు ఆసక్తి చూపుతుండగా వీటిలో 23 దేశాలు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రస్తుత కూటమి ప్రపంచ జనాభాలో 41%, ప్రపంచ జీడీపీలో 24%, ప్రపంచ వాణిజ్యంలో 16% వరకు వాటా కలిగి ఉంది. పశ్చిమదేశాల కూటమికి బ్రిక్స్‌ను ప్రధాన పోటీ దారుగా భావిస్తున్నారు.

ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని భేటీ

బ్రిక్స్ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ గురువారం ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ సహా పలు దేశాల నేతలతో సమావేశమయ్యారు. రైసీతో చర్చల సందర్భంగా ఇరువురు నేతలు వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, ఉగ్రవాదం, అఫ్గానిస్తాన్ వంటి ద్వైపాక్షిక అంశాలతో చాబహార్ పోర్టు అభివృద్ధిపైనా చర్చించారు. బ్రిక్స్‌లో ఇరాన్ చేరికకు మద్దతుగా నిలిచినందుకు ప్రధాని మోదీకి రైసీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రయాన్-3 విజయం సాధించినందుకు మోదీకి అభినందనలు తెలియజేశారని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి వివరించారు. ప్రధాని మోదీ ఇథియోపియా అధ్యక్షుడు అబీ అహ్మద్ అలీ, సెనెగల్ అధ్యక్షుడు మాకీ సాల్, మొజాంబిక్ అధ్యక్షుడు ఫిలిప్ న్యూసీ తదితరులతో జరిగిన భేటీలో పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రధాని మోదీ చర్చించారని బాగ్చీ వివరించారు. కాగా, బ్రిక్స్ శిఖరాగ్రం అనంతరం ప్రధాని మోదీ గురువారం సాయంత్రం జొహన్నెస్‌బర్గ్ నుంచి గ్రీస్‌కు బయలుదేరారు.

ఎల్‌ఏసీని గౌరవిస్తేనే సాధారణ సంబంధాలు

న్యూఢిల్లీ: తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) పరిధిలో అపరిష్కృతంగా ఉన్న అంశాలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండియా ఉద్దేశాలు, అభిప్రాయాలు చైనా అధినేత షీ జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో గురువారం జిన్‌పింగ్‌తో మోదీ మాట్లాడారు. భారత్-చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థితికి చేరుకోవాలంటే ఇరు దేశాల సరిహద్దుల్లో శాంతి, స్నేహభావం నెలకొనాలని, ఎల్‌ఏసీని గౌరవించాలని మోదీ తేల్చిచెప్పారు. ఎల్‌ఏసీ నుంచి ఇరుదేశాల బలగాలను ఉపసంహరించే చర్యలను వేగవంతం చేసేలా తమ అధికారులను ఆదేశించాలని ఇరువురు నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. 2020 మే నెలలో తూర్పు లద్దాఖ్‌లో భారత్, చైనా సైనికుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

ఆఫ్రికాకు భారత్ విశ్వసనీయ భాగస్వామి

'ఎజెండా 2063'సాధనలో ఆఫ్రికాకు భారత్ సన్నిహిత, విశ్వసనీయ భాగస్వామి అని ప్రధాని మోదీ అన్నారు. గ్లోబల్ సౌత్‌కు భారత్ కట్టుబడి ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం, ఆహారం, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో సహకారానికి ఎన్నో అవకాశాలున్నాయని చెప్పారు. బ్రిక్స్, ఆఫ్రికా దేశాల ముఖ్య నేతలతో గురువారం జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ఆఫ్రికా యూనియన్ శక్తివంతంగా రూపుదిద్దుకునేందుకు వచ్చే 50 ఏళ్లలో సాధించాల్సిన లక్ష్యాలపై 2013లో తయారు చేసిన ఆర్థికాభివృద్ధి సమూనాయే 'అజెండా 2063'. ప్రపంచమే ఒక కుటుంబమనే భావనను భారత్ వేల ఏళ్లుగా విశ్వసిస్తోందని ప్రధాని చెప్పారు. ఆఫ్రికా దేశాలతో వాణిజ్యం, పెట్టుబడుల్లో భారత్ నాలుగు, అయిదో స్థానాల్లో ఉందన్నారు.

హిమాచల్‌ను వీడని వానలు.. కుప్పకూలిన 8 భవంతులు



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో మరోసారి కొండచరియలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగిపడి గురువారం ఉదయం కులు జిల్లాలో 8 భవనాలు కుప్పకూలాయి. నాలుగైదు రోజుల క్రితమే ఆ భవనాల్లో పగుళ్లు రావడంతో వాటిని ప్రమాదకరంగా ప్రకటించి ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం జరగలేదు. ఆస్తినష్టంపై ఇంకా అంచనా వేయాల్సి ఉంది. ఈ భవనాల్లో దుకాణాలు, బ్యాంకులు ఇతర వ్యాపార సంస్థలు ఉన్నాయని, ఆ భవనాలు ఏ క్షణంలోనైనా కుప్పకూలవచ్చునన్న భయంతోనే వాటిని ఖాళీ చేయించినట్టుగా అన్ని ప్రాంతానికి చెందిన సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ నరేశ్ వర్మ చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇంకా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జూన్ 24న మొదలైన వర్షాలు కొన్ని ప్రాంతాల్లో ఇంకా కురుస్తూనే ఉన్నాయి. ఈ రెండు నెలల్లో వర్ష బీభత్సానికి 238 మంది మరణించారు. మరో 40 మంది ఆచూకీ తెలీడం లేదు. మొత్తం 709 రోడ్లను మూసివేశారు. సిమ్లా, సోలాన్, మండి, కులు జిల్లాలో భారీగా విధ్వంసం జరిగింది.

విక్రేతల మధ్య సమాన పోటీ ఉండాలి

జీ20 వాణిజ్య మంత్రుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

జైపూర్: ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్య ఈ-కామర్స్ వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే సమయంలో ఈ రంగంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ నేపథ్యంలో చిన్న, పెద్ద విక్రేతల మధ్య సమాన పోటీ ఉండేలా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గురువారం రాజస్తాన్‌లోని జైపూర్‌లో జరిగిన జీ20 దేశాల వాణిజ్య, పెట్టుబడి శాఖ మంత్రుల సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ధరలు, ఫిర్యాదుల విషయంలో వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. డిజిటలీకరణ ద్వారా ఈ-కామర్స్ రంగంలో దేశాల మధ్య కార్యకలాపాలు సులభతరం అవుతాయని తెలిపారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనేది ఒక గేమ్-చేంజర్ అని మోదీ అభివర్ణించారు. దీనిద్వారా డిజిటల్ మార్కెట్‌ప్లేస్ వ్యవస్థను సృష్టిస్తున్నట్లు వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థలో విశ్వాసాన్ని, సానుకూలతను ప్రపంచదేశాలు గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు.

మూడు బిల్లులపై పరిశీలన ప్రారంభం

బిల్లులకు హిందీ పేర్లు పెట్టడంపై దయానిధి మారన్ అభ్యంతరం

న్యూఢిల్లీ: ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురాదల్చిన మూడు బిల్లులపై పార్లమెంటరీ స్థాయీసంఘం గురువారం పరిశీలన ప్రారంభించింది. బీజేపీ ఎంపీ, మాజీ ఐపీఎస్ అధికారి బ్రిజ్‌లాల్ నేతృత్వంలో హోంశాఖ వ్యవహారాలపై ఈ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఏర్పాటైంది. మూడు బిల్లులపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా పార్లమెంట్ సభ్యులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. వారి అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుసుకున్నారు. ప్రతిపక్ష ఎంపీలు పలు అంశాలను లేవనెత్తారు. మూడు బిల్లులకు హిందీ పేర్లు పెట్టడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 348ను ఉల్లంఘించడమే అవుతుందని డీఎంకే సభ్యుడు దయానిధి మారన్ ఆక్షేపించారు. తన అభ్యంతరాలు, డిమాండ్లపై మారన్ ఒక లేఖ సమర్పించారు. మారన్ డిమాండ్లకు పలువురు విపక్ష ఎంపీలు మద్దతు పలికారు. మూడు బిల్లులను బీజేపీ సభ్యులు స్వాగతించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య బిల్లు'ను పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

ఫ్యుకుషిమా నుంచి అణు జలాల విడుదల

- పసిఫిక్ సముద్రంలోకి జలాల విడుదలను ప్రారంభించిన జపాన్
- పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలు
- స్వార్థపూరిత చర్యని మండిపడ్డ చైనా

ఒకుమా: జపాన్‌ను 12 ఏళ్ల క్రితం కుదిపేసిన పెను భూకంపం, సునామీతో దెబ్బ తిన్న ఫ్యుకుషిమా అణు ప్లాంట్ నుంచి వ్యర్థ జలాలను పసిఫిక్ సముద్రంలోకి విడుదల చేసే కార్యక్రమం మొదలైంది. ఇరుగు పొరుగు దేశాల నిరసనల మధ్య గురువారం నాడు తొలి విడతగా శుద్ధి చేసిన వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదల చేసే ప్రక్రియను మొదలు పెట్టినట్టు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) ప్రకటించింది. వివిధ దశల్లో శుద్ధి చేసిన జలాలు అణు ప్లాంట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి విడుదల ప్రారంభానికి సంబంధించిన వీడియో కవరేజీను జపాన్ మీడియా లైవ్‌లో చూపింది. గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు నీటి విడుదల కార్యక్రమం మొదలైనట్టుగా అణుప్లాంట్ ఆపరేటర్ చెప్పారు. ఈ అణు జలాల విడుదలపై సొంత దేశంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి. నీటి విడుదలతో సముద్ర జలాలు విషతుల్యంగా మారి మత్స్య సంపదకు అపార నష్టం చేకూరుతుందని జపాన్, చైనా, దక్షిణకొరియా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పర్యావరణం, మనుషుల ఆరోగ్యంపై దీని ప్రభావం ఉంటుందని జపాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. అయితే జపాన్ ప్రభుత్వం తన చర్యను సమర్థించుకుంది. అణు ప్లాంట్‌ను మూసేయాలంటే జలాలు విడుదల చేయక తప్పదని స్పష్టం చేసింది. 13.4 కోట్ల టన్నుల వ్యర్థ జలాలు వెయ్యి ట్యాంకుల్లో భద్రపరిచామని, ఆ ట్యాంకులకు ప్రమాదమేదైనా జరిగితే మరింత ముప్పు వాటిల్లుతుందని టెప్కో పేర్కొంది. అణు జలాలను శుద్ధి చేసి అవి సురక్షితమని తేలాక విడుదల చేస్తున్నట్టు సెంటర్ ఫర్ రేడియేషన్ రీసెర్చ్ డైరెక్టర్ టోనీ హూకర్ చెప్పారు.

జపాన్ సీఫుడ్‌పై నిషేధం: చైనా

జపాన్‌ది పూర్తిగా స్వార్థపూరిత, బాధ్యతారహిత చర్య అని చైనా మండిపడింది. జపాన్ నుంచి సీఫుడ్‌పై నిషేధం విధించింది. జపాన్ చేస్తున్న పనితో సముద్రంలో మత్స్య సంపదకి, వాతావరణానికి ఎంత ముప్పు ఉంటుందో ఎవరూ అంచనా వేయలేరని ఒక ప్రకటనలో దుయ్యబట్టింది. జపాన్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందంటూ వివిధ దేశాలు జలాల విడుదలను ఖండిస్తున్నాయి.

విమాన ప్రమాదంలో ప్రిగోజిన్ మృతి

- మొత్తం 10 మంది దుర్మరణం పాలయ్యారు
- నిర్ధారించిన రష్యా పౌర విమానయాన సంస్థ



మాస్కో: రష్యాలో బుధవారం జరిగిన విమానంలో వాగ్నర్ గ్రూప్ అధినేత యెవ్‌గెనీ ప్రిగోజిన్ మృతిచెందారని రష్యా పౌర విమానయాన సంస్థ 'రోసావియాత్సియా' ధ్రువీకరించింది. ప్రిగోజిన్ సహా విమానంలో ఉన్న మొత్తం 10 మంది చనిపోయారని నిర్ధారించింది. రష్యా కిరాయి సైనిక దళమైన వాగ్నర్ గ్రూప్ ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున పోరాడింది. వాగ్నర్ గ్రూప్ అధినేత ప్రిగోజిన్ కొన్నిరోజుల క్రితం రష్యా సైన్యంపై తిరుగుబాటు చేసి వెనక్కి తగ్గారు. వాగ్నర్ గ్రూప్ తిరుగుబాటును రష్యా అధ్యక్షుడు పుతిన్ దేశద్రోహం, వెన్నుపోటుగా అభివర్ణించారు. ద్రోహులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. కొన్ని రోజులు పుతిన్ వెనక్కి తగ్గారని, ప్రిగోజిన్‌కు క్షమాభిక్ష ప్రసాదించి, పొరుగు దేశమైన బెలారస్‌కు పంపించినట్లు వార్తలు వచ్చాయి. విమాన ప్రమాదంలో ప్రిగోజిన్ మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనాత్మకంగా మారింది. ఈ ప్రమాదం వెనుక పుతిన్ హస్తం ఉందని, ప్రిగోజిన్‌ను మట్టుబెట్టడానికే ఉద్దేశపూర్వకంగా విమాన ప్రమాదాన్ని సృష్టించారని ఉక్రెయిన్ సహా పశ్చిమ దేశాలు ఆరోపిస్తున్నాయి.

ఆశ్చర్యం కలిగించలేదు: బైడెన్

మాస్కో నుంచి సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు బయలుదేరిన ప్రైవేట్ విమానం బుధవారం నేలకూలి మంటల్లో చిక్కుకుంది. మాస్కోకు ఉత్తర దిశలో 300 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. విమానంలో ముగ్గురు సిబ్బంది, ఏడుగురు ప్రయాణికులు ఉండగా, అందరూ దుర్మరణం పాలయ్యారు. ప్రిగోజిన్ సహా వాగ్నర్ గ్రూప్ లెఫ్టినెంట్లు మరణించినట్లు సమాచారం. గురువారం తెల్లవారుజామున 10 మృతదేహాలను రష్యాఅధికారులు గుర్తించారు. ఈ విమానాన్ని ప్రిగోజిన్ తరచుగా ఉపయోగించేవారని తెలుస్తోంది. వైమానిక భద్రతా నిబంధలను ఉల్లంఘించడం వల్ల ప్రమాదం జరిగిందన్న కోణంలో అధికారులు ప్రారంభించారు. ప్రమాదానికి కారణం ఏమిటన్నది దర్యాప్తులో తేలుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా, ప్రిగోజిన్ మృతిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. అసలేం జరిగిందో తెలియదు గానీ ప్రిగోజిన్ మరణం తనకు పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదని చెప్పారు. ప్రిగోజిన్‌ను పుతినే హత్య చేయించారన్నట్టుగా తన అభిప్రాయం వ్యక్తం చేశారు. విమాన ప్రమాదంపై పుతిన్ మౌనం వీడలేదు. గురువారం ఆయన బ్రిక్స్ సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రిగోజిన్ మరణం గురించి ప్రస్తావించలేదు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023

మద్యం తాగి హల్‌చల్.. డ్రైవర్, కండక్టర్ సస్పెండ్

మైసూరు: డ్యూటీలో ఉండి పీకల దాకా మద్యం తాగిన కేఎస్ ఆర్‌టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. డ్రైవర్ గోపాల కృష్ణ, కండక్టర్ ప్రకాశ్‌లు హెచ్‌డి కోటి నుంచి మైసూరు సిటీకి బస్సుతో బయల్దేరారు. ఇద్దరూ బాగా మద్యం తాగి ఉన్నట్లు ప్రయాణికులు గుర్తించారు. బస్సును స్టాపులో కాకుండా దూరంగా నిలపడంతో ఆగ్రహించిన ప్రయాణికులు ఫోన్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నేను తెల్లవారుజామునే మందు తాగాను, డ్యూటీకి రానని చెప్పినా రమ్మన్నారు, నేనేం చేసేది అని ప్రయాణికులపైన డ్రైవర్ భగ్గుమన్నాడు. దీంతో కొందరు ప్రయాణికులకు పోలీసులకు కాల్ చేశారు. డ్రైవర్, కండక్టర్‌లను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చివరకు ఇద్దరినీ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

న్యూస్‌రీల్

తప్పెట్లతో నిరసన



బైఠాయించిన పాడిరైతులు

గౌరిబిదనూరు: నగర శివార్లలోని పాల శీతలీకరణ కేంద్రం నిర్వాహకులు రైతుల వద్ద నుంచి కొనే పాల ధరను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ పాడి రైతులు ధర్నా కొనసాగించారు. గురువారం ఉదయం డప్పులు వాయిస్తూ కేంద్రం ముందు రైతులు, మహిళలు బైఠాయించారు. మధ్యాహ్నం వరకు డప్పుల మోతతో ప్రతిధ్వనించింది. అయినా అధికారులు ఎవరూ మాట్లాడడానికి రాలేదు. సిఐటియు నేత సిద్ధగంగప్ప ప్రసంగిస్తూ నిరసనకు దిగామని పోలీసు కేసులలో ఇరికించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, జైలుకెళ్ళడానికి కూడా సిద్ధమని చెప్పారు. తక్షణం పాల సేకరణ ధరను పెంచి పశుపోషకులకు న్యాయం చేయాలని కోరారు.

ఆయనూరు కాంగ్రెస్‌లో చేరిక

శివాజీనగర: ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు మొదలయ్యాయి. తాజాగా గురువారం కేపీసీసీ కార్యాలయంలో ఆయనూరు మంజునాథ్ జేడీఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు డీ.కే.శివకుమార్ మంజునాథ్‌కు పార్టీ జెండాను అందించటం ద్వారా ఆహ్వానించారు. మంత్రి మధు బంగారప్ప, నాయకులు బేళూరు గోపాలకృష్ణతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

మైసూరు: వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మరణించారు, ఈ సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకా బదనవాలు గ్రామంలో జరిగింది. చామరాజనగరలోని పౌర కార్మికుల కాలనీలో నివాసం ఉండే మాదేశ (21), విజయ్(21) ఈ దుర్ఘటనలో మృతి చెందగా, విశ్వ (20) తీవ్రంగా గాయపడి మైసూరు నగరంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ముగ్గురూ బైకులో మైసూరు నగరం నుంచి చామరాజనగరకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఇద్దరు సంఘటనా స్థలంలోనే చనిపోయారు. కొలంద పోలీసులు పరిశీలించి లారీ డ్రైవర్‌ని అరెస్టు చేశారు.

మెస్‌లో సిలిండర్ పేలి..

యశవంతపుర: గ్యాస్ సిలిండర్ పేలి ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడిన ఘటన బెంగళూరు అడుగోడి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కలక్కయ్య లేఔట్‌లోని పోలమ్మాస్ హోటల్ వద్ద గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఒక భవనంలో పై అంతస్తులో వంట గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో రవి (40) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందారు. ఈయన కొన్నేళ్లు నుంచి పోలమ్మాస్ పేరుతో మెస్ నడుపుతున్నారు. రెండో అంతస్తులో వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై విస్ఫోటం జరిగింది. చోర్ల, నాగరాజు అనే ఇద్దరు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మూడు.. ముళ్ల నుంచి

బాల్యానికి భరోసా

- మైనర్ల పెళ్లిళ్లకు అడ్డుకట్ట
- వేగంగా ఉప్పందడంతో అధికారుల దాడులు
- బాలికల స్నేహితుల నుంచి కాల్స్
- నాలుగేళ్లలో 8,929 వివాహాలకు బ్రేక్

STOP

బనశంకరి: బాల్య వివాహాలు అనే సామాజిక జాఢ్యాన్ని తొలగించడానికి ప్రభుత్వం చట్టం తీసుకువచ్చినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. కళ్లుగప్పి జరిపిస్తున్న బాల్య వివాహాలను ప్రేమ అడ్డుకోవడం విశేషం. చదువుకునే ఆడపిల్లలు ప్రేమలో చిక్కుకుంటే తల్లిదండ్రులు మైనారిటీ తీరకుండానే పెళ్లిచేసేయడానికి సిద్ధమవుతారు. ఇంతలో ప్రియుడు పోలీసులకు, సహాయవాణికి కాల్ చేసి నిలుపుదల చేయిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో వేలాది బాల్యవివాహాలను చట్టపరంగా అడ్డుకోవడానికి ప్రేమికులే ఆసరాగా నిలిచారు.

సహాయవాణికి కాల్స్ జోరు

బాల్య వివాహాల నిషేధ చట్టం, ఇటువంటి పెళ్లిళ్ల వల్ల కలిగే కష్టనష్టాల గురించి పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్ల తదితరాల్లో మహిళా శిశుసంక్షేమశాఖ, పోలీస్ సిబ్బంది జాగృతం చేస్తున్నారు. వీటితో పాటు సహాయవాణి ఆపద్బాంధవిగా ఉంది. తోటి విద్యార్థులు సంక్లిష్ట పరిస్థితుల్లోకి చిక్కుకున్న స్నేహితులే బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. బాలల సహాయవాణి 1098 , 112 టోల్ ఫ్రీ నంబర్లకు వచ్చే కాల్స్ ఆధారంగా గత నాలుగేళ్లలో రాష్ట్రంలో సగటున రోజుకు ఆరేడు బాల్యవివాహాలను అధికారులు అడ్డుకుంటున్నారు.



రాష్ట్రంలో ఏటా వేలాదిగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి

అలాగే బాల్యవివాహాలు చేసిన వారిపై 1,085 కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు 8,929 మైనర్లకు పెళ్లిని అడ్డుకున్నారు. వీటిలో చాలా కేసుల్లో ప్రేమికులు, తోటి స్నేహితులు చేసిన ఫిర్యాదులతోనే అధికారులు తనిఖీలు నిర్వహించారు.

అధికారులకు స్నేహితుల సాయం

గత రెండేళ్ల నుంచి బాల్యవివాహాల పట్ల సమాచారం అందించేవారి సంఖ్య పెరిగింది. దీంతో అధికారుల పని సులువవుతోంది. అలాగే పిల్లల సహాయవాణి 1098 సిబ్బందికి కూడా కాల్స్ వల్ల ఉపయోగం కలుగుతోంది. వివాహాల ఏర్పాట్లు, స్థలం సమాచారాన్ని బాలికల స్నేహితులే చేరవేస్తున్నారు. తాము ప్రేమించిన అమ్మాయి వివాహం మరొకరితో జరుగుతుందని భావించే ప్రియులు, లేదా స్నేహితులు కాల్ చేసి బాల్య వివాహాలకు చెక్ పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పొరుగువారు, బంధువులు విభేదాలను మనసులో ఉంచుకుని అధికారులకు సమాచారం ఇచ్చి బాల్య వివాహాలకు బ్రేక్ వేసినట్లు బెళగావి జిల్లా శిశు సంక్షేమ అధికారి లోకేశ్ జగళూరు తెలిపారు.

గత నాలుగేళ్లలో రాష్ట్రంలో బాల్య వివాహాల సమాచారం		
ఏడాది	అడ్డుకోవడం	కేసులు
2019-20	1,623	130
2020-21	2,711	239
2021-22	2,401	389
2022-23	2,194	327

ఉపాధ్యాయుడు సస్పెండ్

మైనర్ బాలికను పెళ్లాడిన బాల్కి తాలూకా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సందీప్‌కుమార అజుర ను డీడీపీఐ సలీం పాషా గత సోమవారం సస్పెండ్ చేశారు. బాలికకు మాయమాటలు చెప్పిన ఉపాధ్యాయడు గత మార్చిలో మూడుముళ్లు వేశాడు, ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.



112 సహాయవాణికి సమాచారంతో ఫలితాలు



ప్రేమికుల నుంచి ఎక్కువగా కాల్స్ వస్తున్నాయి

ఖరీదైనా కొనాల్సిందే



గురువారం బెంగళూరు కేఆర్ మార్కెట్ పరిసరాల్లో జనసంద్రాన్ని తలపించిన రద్దీ

- వర మహాలక్ష్మి పండుగకు మార్కెట్లు కిటకిట
- భగ్గుమన్న పూలు, పండ్ల ధరలు

బనశంకరి: ఆకాశాన్ని అంటుతున్న ధరల మధ్య శ్రావణమాసం మొదటి పండుగ అయిన వర మహాలక్ష్మీ పర్వదినానికి ప్రజలు షాపింగ్ చేశారు. సిరిసంపదలిచ్చే మహాలక్ష్మి కటాక్షం కోసం ఖర్చుకు వెనుకాడకుండా పూలు పండ్లు ఇతర సామగ్రి కొనుగోలుకు తరలిరావడంతో మార్కెట్లు కిక్కిరిశాయి. నగరంలోని కేఆర్ మార్కెట్, యశవంతపుర, మల్లేశ్వరం, విజయనగర, జయనగర, బసవనగుడి, బనశంకరి, మడివాళ, గాంధీ బజార్, కృష్ణరాజపురం మార్కెట్లతో పాటు నగర వివిధ రోడ్లు, వీధుల్లో పూలు, పండ్లు అరటి పిలకలు, మామిడి ఆకులు, తామర పుష్పాలు విక్రయాలు భారీగా జరిగాయి. ఉదయం నుంచే మార్కెట్లలో సందడి మొదలైంది. పూలు, పండ్ల ధరలు ఆకాశానికి అంటినప్పటికీ నగరవాసులు కొనుగోలు ఏమాత్రం తగ్గలేదు. మహిళలు మార్కెట్లకు తరలి వచ్చారు. ఇంట్లో ప్రతిష్టించే లక్ష్మీదేవి విగ్రహాలకు బాగా డిమాండు ఏర్పడింది. పూజలో అలంకరణ, అతిథులకు వాయనానికి పూలు అవసరం. ఈ నేపథ్యంలో ఈ వారంలో ధరలు పెరిగాయి.

కనకాంబరం కేజీ రూ. 2వేలు

- మార్కెట్లలో పూల ధరలు విని జనం షాక్‌కు గురయ్యారు. దీంతో కొందరు ఆచితూచి కొనుగోలు చేశారు.
- కొద్దిరోజుల క్రితం కిలో రూ.600 -800 ధర పలికిన కనకాంబరం గురువారం రూ.1500 నుంచి 2 వేల వరకు ధరతో విక్రయించారు. వంద గ్రాములు రూ.150 నుంచి 200 వరకు పలికాయి.
- మైసూరు మల్లెపూలు సైతం కిలో రూ.600కు చేరాయి. మంగళవారం కిలో రూ.400 ధర ఉండగా ఒకే రోజు రూ. 200 పెరిగింది.
- మల్లెపూలు మూర రూ.120 కి చేరాయి. సేవంతి కిలో రూ.200, మూర రూ.60-80 కి అమ్మారు.
- లక్ష్మీదేవీ ఇష్టమైన తామర, కలువ పూలు జతకు రూ.100 చెల్లించాల్సి వచ్చింది.
- చెండుపూలు కిలో రూ.160, విడి గులాబీ రూ.320 ఉండగా, తులసి మూర రూ.100తో విక్రయించారు.
- పండ్లలో యాలక్కి అరటి పండ్లు కిలో రూ.100- 120, సీతాఫలం కిలో రూ.70-80, దానిమ్మ కిలో రూ.150, సీడ్‌లెస్ ద్రాక్ష రూ.200, మూసంబి రూ.70-80, ఆపిల్ కిలో రూ.200, అనాస ఒకటి రూ.50 పలికాయి.



అమ్మవారికి సమర్పించడానికి గాజుల విక్రయాలు

తామరపూల కోసం చెరువులో దిగి...

- తండ్రి, కుమారుడు మృతి

దొడ్డబళ్లాపురం: శుక్రవారం వరమహాలక్ష్మి పూజ కోసం తామర పూలు కోసి విక్రయించడానికి చెరువులో దిగిన తండ్రీ కుమారుడు నీటమునిగి మృతి చెందిన సంఘటన దొడ్డ తాలూకా హులికుడి కొండ వద్ద ఉన్న చెరువులో చోటుచేసుకుంది. దొడ్డ పట్టణ పరిధిలోని శాంతినగర్ నివాసులైన పుట్టరాజు (45), ఇతని కుమారుడు కేశవ (16) మృతి చెందినవారు. వరమహాలక్ష్మి పండగ సందర్భంగా తామర పూలకు ఎక్కువ డిమాండు ఉంటుంది. దీంతో చెరువులో తామర పూలు కోసి విక్రయించాలని బుధవారం సాయంత్రం హులుకుడి కొండ కింద ఉన్న చెరువులో దిగిన తండ్రి, కుమారుడు ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతి చెందారు. మృతుడు పుట్టరాజు ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కుమారుడు కేశవ పదవ తరగతి చదువుతున్నాడు. పుట్టరాజు భార్య గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పని చేస్తోంది. వీరికి ఇద్దరు సంతానం. గురువారం అగ్నిమాపకదళం సిబ్బంది మృతదేహాలను వెలికి తీసారు. భార్య, బంధుమిత్రుల తీవ్ర విషాదంలో మునిగిపోయారు.




మృతి చెందిన బాలుడు కేశవ



తండ్రి పుట్టరాజ (ఫైల్)

కావేరిపై తమిళనాడు తీరు సరికాదు



జలం, జగడం.. కావేరి నది

- త్వరలో ఢిల్లీ యాత్ర: సీఎం సిద్దు

శివాజీనగర: కావేరి జల వివాదంలో ఇప్పటికే సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వగా, తమిళనాడు ప్రభుత్వం కొత్తగా అప్పీల్ చేయడం సబబు కాదని సీఎం సిద్దరామయ్య అన్నారు. గురువారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, 2018 ఫిబ్రవరి 5న సుప్రీం కోర్టు కావేరి వివాదంలో తీర్పు ఇచ్చింది, ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ కొత్తగా వివాదం తీసుకొచ్చి సుప్రీం కోర్టు మెట్లెక్కడం బాగా లేదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామూలు సమయంలో బిళిగుండ్లు డ్యాంకి 177 టీఎంసీ నీరు వదిలేది, అయితే వర్షాలు లేని సమయంలో ఇది సాధ్య పడదు. వర్షాలు కురవక కేఆర్ఎస్, కబిని, హారంగితో పాటు కావేరి నది మీద ఉండే జలాశయాల్లో కొరత ఉంది. ఉన్న నీటిని ఏడాది మొత్తం తాగు నీటి కోసం కాపాడుకోవాల్సి ఉంది. మా రైతుల హితాసక్తిని కాపాడుకోవాలని అన్నారు. ఇదే అంశంతో రాష్ట్ర న్యాయవాదుల బృందం సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తారన్నారు. గత మూడు నెలల నుంచి 26 టీఎంసీల నీటిని తమిళనాడుకు వదలినట్లు తెలిపారు. నదీ జలాల వివాదాలపై చర్చించేందుకు ప్రధానమంత్రి, మంత్రుల సమయాన్ని కోరాము, అవకాశం ఇవ్వగానే అన్ని పార్టీల నాయకులతో ఢిల్లీకి వెళ్తామని చెప్పారు.

కావేరి వివాదంపై సుప్రీంకు అప్పీల్

కావేరి నీటి వివాదంపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ తెలిపారు. సదాశివ నగరలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో, నీటి వివాదానికి సంబంధించి న్యాయ పోరాటం చేపట్టేందుకు విధానసౌధలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రంలో వాస్తవ పరిస్థితిని సుప్రీంకోర్టులో విచారణ సమయంలో వివరిస్తామని తెలిపారు. ఇక కేంద్రమంత్రి గజేంద్ర సింగ్‌తో భేటీకి విజ్ఞప్తి చేశామని, ఆయన వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

జాతీయ రహదారికి మరమ్మతు చేపట్టరూ



వినతిపత్రం సమర్పిస్తున్న బాబూరావ్

రాయచూరు రూరల్: నగరంలో గుండా వెళుతున్న జాతీయ రహదారికి మరమ్మతు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సలహాదారుడు బాబూరావ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గంజ్ సర్కిల్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు అధ్వానంగా మారిన జాతీయ రహదారి–167లో గుంతలు పూడ్చించాలని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్లాక్‌టవర్ పనులు పునఃప్రారంభం



ఊపందుకున్న క్లాక్‌టవర్ నిర్మాణ పనులు

బళ్లారిఅర్బన్: నగరం నడిబొడ్డున ఉన్న గడిగిచెన్నప్ప(రాయల్) సర్కిల్‌లో 120 అడుగుల ఎత్తైన క్లాక్‌టవర్ నిర్మాణానికి గత బీజేపీ ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్ల వ్యయంతో మాజీ మంత్రి బీ.శ్రీరాములు పనులు ప్రారంభించినా ఎన్నికల సమయంలో పనులు నిలిచిపోయాయి. అయితే కాంట్రాక్టర్లు తమ బిల్లులు రాకపోవడంతో గత జూలై నెల నుంచి పనులు నిలిపి వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి నాగేంద్ర చొరవ తీసుకొని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సూచనల మేరకు కాంట్రాక్టర్లు గత రెండు రోజుల నుంచి పనులు తిరిగి ప్రారంభించారు. గురువారం ఎత్తైన క్రేన్ సహాయంతో సిమెంట్ కాంక్రీట్ పిల్లర్ పనులు ప్రారంభించడంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

బోగస్ కార్డులను రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: జిల్లాలో బోగస్ కార్మికుల కార్డులను జిల్లా బాల కార్మిక శాఖ అధికారి రద్దు చేయాలని అఖిల కర్ణాటక కార్మికుల సమాఖ్య సంచాలకుడు వీరణ్ణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 2021–22లో కార్మికులు పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. నిజమైన కార్మికులను గుర్తించి ప్రభుత్వం కార్డులను కేటాయించాలని, ఆరోగ్య సంజీవిని పరిధిలో కార్మికులకు అవకాశం కల్పించాలని, నగరానికి ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జాతీయ విద్యా ప్రణాళిక రద్దు తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జాతీయ విద్యా ప్రణాళిక(ఎన్ఈపీ–2020)ను రద్దు చేయడం తగదని ఏబీవీపీ పేర్కొంది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు లక్ష్మీకాంత్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎన్ఈపీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

హత్య కేసు విచారణ కోసం పాదయాత్ర



మాట్లాడుతున్న గురుపాద గోమర్సి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో సంచలనం రేపిన సౌజన్య హత్య కేసుపై సమగ్ర విచారణ చేయాలని ఒత్తిడి చేస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ పేర్కొంది. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యాధ్యక్షుడు గురుపాద గోమర్సి మాట్లాడారు. ధర్మస్థలలో జరిగిన సౌజన్య హత్య కేసులో ఇంతవరకు ముద్దాయిలను అరెస్ట్ చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 26 న బెళ్తంగడి నుంచి సెప్టెంబర్ 8న బెంగళూరు వరకు పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు.

వైకల్యాన్ని జయించిన సంకల్పం

- ప్రపంచ మరుగుజ్జు క్రీడల్లో బంగారు పతకాలు
- కేజీఎఫ్ క్రీడాకారుడు నాగేష్ అద్భుత సాధన



మరుగుజ్జు క్రీడాకారుడు ఎస్.నాగేష్



నాగేష్ సాధించిన పతకాలు ఇవే

కేజీఎఫ్: పేదరికంలో మగ్గిన వ్యక్తి చదువుకోలేక ఆర్కెస్ట్రా బృందంలో చేరి నృత్యాలు చేసి అనంతరం అందివచ్చిన క్రీడావకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచ మరుగుజ్జు క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించాడు. కేవలం 3.4 అడుగుల ఎత్తు మాత్రమే కలిగిన కేజీఎఫ్ తాలూకా కద్రిపురకు చెందిన ఎస్.నాగేష్‌కు ఏదైనా సాధించాలనే తపన ఉండేది. అయితే ఆర్థిక ఇబ్బందులు, సమాజం నుంచి ఎదురవుతున్న హేళనలను ఎదుర్కొంటూనే క్రీడా రంగంలో సాధన చేయాలని సంకల్పించాడు. పట్టుదలతో సాధించి ప్రపంచ మరుగుజ్జు క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించాడు. జర్మనీలోని కోలోన్‌లో గతనెల 28 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించిన 8వ విశ్వ మరుగుజ్జు క్రీడా పోటీల్లో నాగేష్ మూడు బంగారు పతకాలను సాధించడం ద్వారా గొప్ప సాధన చేసి తానేమిటో నిరూపించుకున్నాడు. సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని రుజువు చేశాడు. క్లాస్–1 విభాగంలోని షాట్‌పుట్, డిస్క్ త్రో, జావలిన్ త్రో పోటీల్లో ఈ సాధన చేశాడు. పవర్ లిఫ్టింగ్ పోటీల 45 కేజీల విభాగంలో వెండి పతకం సాధించాడు. క్రీడా పోటీలకు వెళ్లడానికి రూ.2 లక్షలు ఖర్చయింది. విమాన ఛార్జీలు, హోటల్‌లో బస, భోజనాలకు తామే ఖర్చు భరించుకోవాల్సి వచ్చిందన్నారు.

అప్పు చేసి మరీ పోటీలకు హాజరు

ఇందుకోసం తాను రూ.1.50 లక్షలను అప్పు చేశానన్నారు. రూ.50 వేలు దాతలు విరాళంగా ఇచ్చారని నాగేష్ తెలిపాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆర్కెస్ట్రాలో చేరాను. ఓ స్టేజీ డ్యాన్స్‌కు రూ.100 ఇచ్చేవారు. ఎలాగో జీవితం గడిపేవాడిని. డిగ్రీ వరకు చదివి ప్రస్తుతం క్రీడల ద్వారా గుర్తింపు పొందుతున్నానని నాగేష్ తెలిపాడు. మూడు బంగారు పతకాలను సాధించడం తనకు ఎంతో స్ఫూర్తిని కలిగించిందని, మరింత సాధన చేయడానికి ఉత్సాహం అందించిందన్నాడు. 38 ఏళ్ల వయసు కలిగిన నాగేష్ 2008 నుంచే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని సాధన చేస్తున్నాడు. నాగేష్ బేతమంగల డిగ్రీ కళాశాలలో బీఏ చదివాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లోను పాల్గొంటున్నాడు. తండ్రి నారాయణప్ప మరణించగా తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా కూడా పని చేశారు. తాను అంతర్జాతీయ క్రీడా పోటీల్లో 11 పతకాలు సాధించానని, ప్రభుత్వం గుర్తించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నాగేష్ ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. ఇంతవరకు ప్రభుత్వం, సమాజం తనను నిర్లక్ష్యం చేశాయని, ఇకనైనా గుర్తించి తనను ఆదుకోవాలని కోరాడు.

నేడు ఉచిత సామూహిక వివాహాలు

- గాలి లక్ష్మీఅరుణ నేతృత్వంలో నిర్వహణ



ఉచిత సామూహిక వివాహాలకు సిద్ధమైన వేదిక



వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు

సాక్షి బళ్లారి: మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారి నగరంలో ఉచిత సామూహిక వివాహాలు జరగనున్నాయి. వరమహాలక్ష్మి పర్వదినం సందర్భంగా సిరుగుప్ప రోడ్డు హవంబావిలోని గాలి జనార్దన్‌రెడ్డి స్వగృహం పక్కనే ఉన్న క్యాంప్‌హౌస్ ఆవరణలో వివాహోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు వరమహాలక్ష్మి పూజ, 10.45 గంటలకు వేదికలో కార్యక్రమాన్ని ప్రారంభించి 12.15 గంటల్లోపు సంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో వధూవరులకు ఉచిత సామూహిక వివాహాలను జరపనున్నారు.

కోర్టు ఆంక్షల నేపథ్యంలో గాలి జనార్దన్‌రెడ్డి రావడానికి అనుమతి లేకపోవడంతో ఆయన సతీమణి, కేఆర్‌పీపీ నాయకురాలు గాలి లక్ష్మీఅరుణ నేతృత్వంలో వివాహాలను అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వరమహాలక్ష్మి రోజున ఉచిత సామూహిక వివాహాలను దాదాపు 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 40 వేల జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించడం విశేషం. బీజేపీలో ఉన్నప్పుడు ప్రతి ఏటా కొన్నేళ్ల పాటు దివంగత కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ వరమహాలక్ష్మి పూజకు విచ్చేసి ఉచిత సామూహిక వివాహ కార్యక్రమాల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించేవారు. అప్పటి నుంచి ఉచిత సామూహిక వివాహాలను జరిపించడం సేవా కార్యక్రమంగా భావించి పేదలకు పెళ్లిళ్లు జరిపించి వారికి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

తోటలో పనిచేస్తూ టెక్కీ దుర్మరణం

- కాటేసిన కరెంటు తీగలు



రామ్మోహన్ (ఫైల్)

తాడిమర్రి: విద్యుదాఘాతంతో ఐటీ ఇంజినీరు మృతి చెందిన సంఘటన పుట్టపర్తి జిల్లా ధర్మవరం నియోజకవర్గం తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గజ్జెల చిన్నయల్లప్ప, ముత్యాలమ్మ దంపతులకు ఐదు మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారి కుమారుడు రామ్మోహన్ (32), అతని భార్య శ్రీలత ఇద్దరు బెంగళూరులో ఐటీ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. గ్రామంలోని తోటలో చీనీచెట్లు, ఎర్రచందనం సాగు చేస్తున్నారు. రామ్మోహన్ అప్పుడప్పుడు వచ్చి పొలాల్లో పనులు చేయిస్తుండేవాడు.

తల్లిదండ్రుల కళ్లముందే

బుధవారం రాత్రి రామ్మోహన్ డ్రిప్పు పరికరాలను కొత్తవి అమర్చాలని తీసుకుని గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో పంపుసెట్ మోటార్‌కు అమర్చిన తీగలను మార్చే క్రమంలో చేతితో లాగుతుండగా, అవి పైన వెళ్లే 11 కేవీ విద్యుత్ తీగలను తాకాయి. దీంతో తీవ్రంగా షాక్ కొట్టి తీగలకు అతుక్కుపోయాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు, కూలీలు కట్టెతో కొట్టి తీగలను విడిపించేందుకు విఫలయత్నం చేశారు. అందరూ చూస్తుండగానే రామ్మోహన్ విగతజీవుడు అయ్యాడు. కళ్లముందే కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతునికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై విచారించారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సాగునీటి కోసం నేడు రాస్తారోకో

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ కింద చివరి ఆయకట్టుకు సాగునీరందించాలని శుక్రవారం నుంచి సిరవారలో రాస్తారోకో చేపడుతున్నట్లు పోరాట సమితి నేతలు తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్, శంకర్‌గౌడ మాట్లాడారు. 49, 69, 104వ మైల్ వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే ఇంజినీర్లు గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. కాలువ పైభాగంలోని కొప్పళ జిల్లాలో అక్రమంగా వాడకం, నీటి చౌర్యం జరుగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించక పోతే పోరాటమే శరణ్యమన్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు శంకర్‌గౌడ, అమరేష్, శరణప్పగౌడ, బసనగౌడ, చుక్కి సూగప్పలున్నారు.

పీహెచ్‌సీల్లో అధికారుల తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో సమీక్షిస్తున్న సురేంద్రబాబు

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి శాఖాపరంగా పరిశీలించారు. గురువారం జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు రాయచూరు తాలూకా జేగరకల్, మల్లాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్య పథకాల గురించి వివరించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

డివిజనల్ స్థాయి పుట్‌బాల్ పోటీల్లో సత్తా

- విజేతగా నిలిచిన ఆర్‌వైఎంఈసీ



విజేత ఆర్‌వైఎంఈసీ జట్టుకు కప్‌ను అందజేస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్: రావుబహదూర్ వై.మహాబళేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాల(ఆర్‌వైఎంఈసీ) ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన వీటీయూ కలబుర్గి డివిజనల్ స్థాయి పుట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా బళ్లారికి చెందిన ఆర్‌వైఎంఈసీ, రన్నరప్‌గా బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(బీఐటీఎం) కళాశాల జట్లు నిలిచాయి. హోరాహోరీగా సాగిన పుట్‌బాల్ పోటీల్లో 03–01 పాయింట్లతో నగరానికి చెందిన రెండు ఇంజినీరింగ్ కళాశాలలు విన్నర్స్, రన్నర్స్‌గా నిలవడం అభినందనీయం. గెలుపొందిన రెండు జట్లను ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్స్‌పాల్స్, సిబ్బంది అభినందించారు.

నిధుల స్వాహా ఖండిస్తూ ధర్నా



ఆందోళన చేస్తున్న రైతు సమితి కార్యకర్తలు

రాయచూరు రూరల్: పనులు చేయకుండానే అధికారులు నిధులు దిగమింగారని కర్ణాటక జాగృతి రైతు సమితి జిల్లాధ్యక్షుడు లింగప్ప పేర్కొన్నారు. గురువారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. సిరవార, మాన్వి ప్రాంతాల్లో వ్యవసాయ శాఖాధికారులు ఎస్సీ, ఎస్టీ భూముల్లో గట్ల నిర్మాణం చేపట్టినట్లు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయంలో తప్పు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

నగరసభలో ఖాళీ ఉద్యోగాల భర్తీకి వినతి

కోలారు: నగరసభలో ఖాళీగా ఉన్న 282 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సామాజిక కార్యకర్త కెఎస్ రవీంద్రనాథ్ గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నగరసభలోని 418 పోస్టులకు గాను కేవలం 136 మంది మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉండడం వల్ల నగర ప్రజల పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు కూడా కుంటుపడ్డాయన్నారు. మొత్తం 35 వార్డుల్లో 2.5 లక్షల మంది జనాభాకు అనుగుణంగా నగర ప్రజల సమస్యల పరిష్కారం దృష్ట్యా వెంటనే నగరసభలో సీ, డీ గ్రూప్ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

మరుగుదొడ్లకు మరమ్మతులేవీ?



శుభ్రత కరువైన మరుగుదొడ్ల పరిసరాలు

కంప్లి: సిరుగుప్ప తాలూకాలోని సిరిగేరి బస్టాండులో ప్రయాణికుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు నిర్మించినా గత కొన్ని నెలలుగా నిర్వహణ లోపించి దుస్థితికి చేరాయి. గతంలో ఇతర ప్రాంతాలకు సిరిగేరి మీదుగా రాకపోకలు సాగించే మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం లేక నానా యాతన పడేవారు. దీనిని గమనించిన వివిధ సంఘ సంస్థల ఒత్తిడితో ఎట్టకేలకు మరుగుదొడ్లు నిర్మించారు. సుమారు రెండేళ్ల పాటు ఉపయోగకరంగా ఉన్నా ఇటీవల నిర్వహణ లోపంతో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. పైగా మరుగుదొడ్ల తలుపులు విరిగినందున అత్యవసర పరిస్థితిలో మహిళలు మరుగుదొడ్లను వినియోగించుకొనేందుకు జంకుతున్నారు. ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. ఈనేపథ్యంలో అత్యవసరమైన పరిస్థితుల్లో మహిళలకు సౌకర్యం కోసం మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి శుభ్రత పెంపొందించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

సాక్షి,బళ్లారి: తమ వృత్తి, పనులతో దైనందిన జీవితంలో బిజీగా గడిపే ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకుంటే మానసిక ప్రశాంతతతో జీవితం సాఫీగా సాగుతుందని మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం నగరంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రసాదం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ఇకపై ప్రతి గురువారం సాయంత్రం ఆలయానికి వచ్చి పోయే భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తానన్నారు. గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతోనే తాము ఈ స్థాయికి వచ్చామన్నారు. ఏ దేవుడినైనా భక్తితో కొలిస్తే ఖచ్చితంగా మంచి జరుగుతుందన్నారు. మన బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే ఏటీఎంలో ఎలా డబ్బులు తీసుకునేందుకు వీలవుతుందో అలానే మనం కూడా దైవప్రార్థన, మంచి పనులు చేస్తే మనకు మంచి జరుగుతుందన్నారు.

అత్యాచార నిందితులకు జైలు శిక్ష

కోలారు: మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి బి.పి.దేవమానె గురువారం తీర్పు వెలువరించారు. బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో వినోద్‌కుమార్ అనే వ్యక్తిపై బంగారుపేటె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. మరో కేసులో బుద్ధిమాంద్య మైనర్ బాలికను తిండి ఇప్పిస్తానని ఆశ చూపి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నిందితుడు, బంగారుపేటె సంజయ నగర్ నివాసి చంద్రప్ప అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ జడ్జి దేవమానె తీర్పు ఇచ్చారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలోని మిల్లర్‌పేట్ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆస్మియ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కార్యదర్శి అర్షియబాను, శక్తి సేవా సంఘ అధ్యక్షురాలు ప్రవల్లిక ఆ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయిలో రాణించడంతో ఉపాధ్యాయులను సన్మానించినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాస సమయంలో కాలాన్ని వృథా చేయకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి తమ సంస్థ నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉర్దూ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇప్పటికే ఉన్నత స్థాయిలో రాణించారన్నారు. కార్యక్రమంలో ఆస్మియ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్ ఖలీఫ్, గ్రామీణ అధ్యక్షురాలు నసీమాబాను, శక్తి సేవా సంఘం పదాధికారులు కుమారమ్మ, కేపీవైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రీతి, యల్లమ్మ, చంద్రకళ, వనజాక్షి, పాఠశాల హెచ్ఎం సునంద తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి వ్యక్తి మృతి

రాయచూరు రూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సింధనూరులో గురువారం చోటు చేసుకుంది. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనే రక్షణ గోడ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి సమీపంలో ఉన్న సుమారు 45 ఏళ్ల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు తెలిపారు.

కోలారు వార్తలు...

120 ఎకరాల ఆక్రమిత అటవీ భూమి స్వాధీనం



జేసీబీలతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: అటవీ, పోలీస్ శాఖల అధికారులు గురువారం పట్టణ సమీపంలో ఆక్రమించుకున్న అటవీ భూముల్లో జేసీబీల సహాయంతో ఆక్రమణలను తొలగించి 120 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది వ్యవసాయ గుంతలను తవ్వుకుని వ్యవసాయం చేస్తుంటే మరికొంత మంది ఆక్రమిత స్థలంలో మామిడి, నేరేడు, కానుగ తదితర చెట్లను పెంచుతున్నారు. మామిడి తోటలో మూడు వ్యవసాయ గుంతలను, నిర్మాణ దశలో ఉన్న 2 కోళ్ల ఫారాలను, 3 షెడ్‌లను తొలగించారు. కార్యాచరణకు 15 జేసీబీలు, 10 ఇటాచీలను ఉపయోగించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అయినా అడ్డుపడి జేసీబీ అద్దాలు పగులగొట్టిన శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యాచరణలో వలయ అటవీశాఖ అధికారి కె.మహేష్, డీఎస్పీ నందకుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దయానంద, 150 మంది అటవీ, 60 మంది పోలీస్, రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు

- వరలక్ష్మీ పూజకు పెరిగిన ధరలు
- కిలో కనకాంబరాలు రూ.2 వేలు



పూలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

శ్రీనివాసపురం: శ్రావణమాసం రాగానే పూలు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. శ్రావణమాసంలో వరుసగా పండుగలు వస్తున్న నేపథ్యంలో పూలు, పండ్ల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతం కావడంతో పూల ధరలు బాగా పెరిగాయి. మహిళలు వర మహాలక్ష్మీ వ్రతాన్ని చేయడం కోసం పూలు, పండ్లు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు తరలివచ్చారు. నగరంలోని దొడ్డపేట, పాత బస్టాండు, చెన్నయ్య రంగమందిరం ముందు, ఎంజీ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ధరలు బాగా పెరిగినా మహిళలు మాత్రం తప్పనిసరి పరిస్థితిలో కొనుగోలు చేయక తప్పలేదు. ప్రత్యేకంగా కనకాంబరాల ధరలు గగనానికి చేరుకున్నాయి. ఏకంగా కిలో కనకాంబరాల ధర రూ.2 వేలు పలికాయి. నెల రోజుల క్రితం రూ.400 ఉన్న కనకాంబరాల దర నేడు ఏకంగా రూ.2 వేలకు చేరింది. కిలో రూ.40 నుంచి రూ.50లకు అమ్ముతున్న గులాబీలను నేడు కిలో రూ.220లకు విక్రయిస్తున్నారు. దుకాణాల్లో ఎక్కడ చూసినా మహిళలే కనిపించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి కూడా వ్యాపారులు మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కనకాంబరాలు, చేమంతులు, గులాబీలు పండించిన రైతుల పంట పండింది.

చంద్రయాన్ సక్సెస్‌పై సంబరాలు



విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: చంద్రయాన్–3 విజయవంతం కావడంపై బుధవారం రాత్రి పట్టణంలో బీజేపీ కార్యకర్తలు జాతీయ జెండాను పట్టుకుని విజయోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరిన మొట్టమొదటి దేశం భారత్ కావడం గర్వకారణమన్నారు. చంద్రుడిపై కాలుమోపిన అమెరికా, రష్యా, చైనాల సరసన నాలుగో దేశంగా భారత్ చేరడం గొప్ప విషయమన్నారు. ఈ ఘనత భారతీయ ఇస్రో శాస్త్రవేత్తలకే చెందుతుందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు లక్ష్మణగౌడ, హొదలి నారాయణస్వామి, పణసమాకనహళ్లి నారాయణస్వామి, రామాంజి, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను ప్రతి వ్యక్తికీ అందించాలి



కార్యక్రమాన్ని ప్రారంభించిన దృశ్యం

కోలారు: ప్రభుత్వం నుంచి వివిధ సౌకర్యాలను చిట్టచివరి వ్యక్తికీ అందించాలని జెడ్పీ ముఖ్య ఉప కార్యదర్శి బి.శివకుమార్ తెలిపారు. గురువారం నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పాలనాధికారుల కోసం నిర్వహించిన సామాజిక న్యాయం, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ మహిళలకు సౌకర్యాల పంపిణీపై సదస్సును ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సమాజంలో అసమానతలను తొలగించడానికి అనేక పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దళితులు, మైనారిటీలకు సౌకర్యాలను అందించడం ద్వారా వారిని సమాజ ముఖ్యవాహినిలోకి తేవడానికి ప్రభుత్వ సిబ్బంది నిర్వహిస్తున్న పాత్ర శ్లాఘనీయమన్నారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు సౌకర్యాలను అందించడం ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అన్నారు. సౌకర్యాలను ప్రజలకు అందించడంలో ఎలాంటి తారతమ్యం జరగకూడదన్నారు. ప్రామాణికంగా అసలైన లబ్ధిదారులకు అందించాలన్నారు. సంపన్మూల వ్యక్తి చౌడప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతి శాఖలోను అనేక ప్రజాపర పథకాలున్నాయన్నారు. ప్రజలు వీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. సదస్సులో జెడ్పీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటాచలపతి, ప్రిన్సిపాల్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో గజరాజుల జలక్రీడ



చెరువులో తికాణా వేసిన ఏనుగులు

దొడ్డబళ్లాపురం: చెన్నపట్టణ వద్ద ఉన్న అప్పచెరువులో గజరాజులు తికాణా వేసి జల క్రీడలాడుతూ కనువిందు చేస్తున్నాయి. తెంగినకల్లు అటవీప్రాంతం నుంచి చెన్నపట్టణ దిశగా వచ్చిన అడవి ఏనుగులు పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉన్న అప్పచెరువులో జలక్రీడలాడుతూ ఉండిపోయాయి. ప్రస్తుతానికి చెరువులోనే ఉండిపోయిన ఏనుగుల గుంపు ఎక్కడ జనావాసంలోకి వస్తాయో అని జనం భయాందోళనకు గురవుతున్నారు. గజరాజులను చూడడానికి జనం తండోపతండాలుగా వస్తున్నారు. అయితే జనం ఏనుగుల కంటబడకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్త పడుతున్నారు. రాత్రిపూట కార్యాచరణ జరిపి అడవిలోకి పంపించడానికి అటవీశాఖ అధికారులు యత్నిస్తున్నారు.

విగ్రహాల దొంగల అరెస్టు

మైసూరు: విలువైన రాళ్లతో చేసిన విగ్రహాలను చోరీ చేయడానికి వచ్చిన ఆరుమందిని మైసూరు మేటిగళ్లి పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని గోకులం 3వ స్టేజ్‌లో నివాసం ఉంటున్న మనోజ్ఞ (26), కే.సచిన్ (24), ఎన్.సంతోష్‌కుమార్ (33), నంజనగూడువాసి చంద్రశేఖర మూర్తి (42), మెళ్లి గోపాల్ (36) భూగతళ్లి నాగేష్ (30) పట్టుబడినవారు. వీరు మైసూరు– బెంగళూరు జాతీయ రహదారిలోని నాగనహళ్లి గేట్ కస్తూరి నివాసం హోటల్ పక్కన ఉన్న విలువైన రాళ్లతో చేసిన విగ్రహాల మీద కన్నేశారు. రూ.2 లక్షల విలువ ఒక విగ్రహాన్ని దొంగిలించి జీప్‌లో తరలించే ప్రయత్నంలో ఉండగా పోలీసులు పట్టుకున్నారు.

టీ తాగే సాకుతో చైన్‌స్నాచింగ్



బాధితురాలు జయమ్మ

దొడ్డబళ్లాపురం: టీ తాగే సాకుతో కొట్టుకు వచ్చిన దుండగులు కొట్టు యజమాని మెడలో గొలుసు లాక్కెళ్లిన సంఘటన నెలమంగల తాలూకా కేజీ శ్రీనివాసపుర గ్రామం వద్ద గురువారం చోటుచేసుకుంది. జయమ్మ అనే వృద్ధురాలు శ్రీనివాసపుర వద్ద రహదారి పక్కన తోపుడు బండి మీద టీకొట్టు నడుపుకుంటోంది. గురువారం ఉదయం బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు టీ తాగే సాకుతో కొట్టు వద్దకు వచ్చి జయమ్మతో మాటలు కలిపి హఠాత్తుగా ఆమె మెడలోని 35 గ్రాముల మాంగల్యం చైను లాక్కెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లోకాయుక్త అదుపులో టీపీ సూపర్‌వైజర్

యశవంతపుర: అక్రమ ఆస్తులకు సంబంధించి బెంగళూరు నగర జిల్లా కేఆర్‌పుర తాలూకా ఆఫీసు సూపర్‌వైజర్ కేటీ శ్రీనివాసమూర్తిని లోకాయుక్త ప్రత్యేక కోర్టు ఐదు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అప్పగించారు. అక్రమ ఆస్తులకు సంబంధించి సమగ్రమైన సమాచారం ఇవ్వని కారణంగా లోకాయుక్త పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరచగా ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీ విధించింది.

దోమల నియంత్రణపై ప్రదర్శన



తుమకూరు: తుమకూరు నగరంలోని బీహెచ్ రోడ్డులో ఉన్న భారత్ మాతా పాఠశాలలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులచే వస్తు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. జిల్లా రోగ నివారణ నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని ప్రారంభించారు. ప్రత్యేకంగా దోమలను ఎలా నియంత్రించాలనే వస్తువులను ప్రదర్శించారు. అన్ని తాలూకాల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



అధికారులకు ఫిర్యాదులు అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని లోకాయుక్త డీవైఎస్పీ వీరేంద్ర కుమార్ తెలిపారు. తాలూకా కార్యాలయం సభా భవనంలో బుధవారం సాయంత్రం జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలను అనవసరంగా కార్యాలయాలకు తిప్పుకోవడం, లంచాలను డిమాండ్ చేయడం నేరమని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకే తీసుకెళ్లి అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్ పత్రి, లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ మోహన్ భువన్, నగరసభ కమిషనర్ గీత తదితరులు పాల్గొన్నారు.



దేవతామూర్తుల అలంకరణలో చిన్నారులు



కొడవ సంప్రదాయ వస్త్రధారణ

ఘల్లుమన్న సంప్రదాయం

చిక్కబళ్లాపురం: నగర శివార్లలోని బిజియస్ పాఠశాలలో గురువారం సంప్రదాయ దినోత్సవంలో బాలబాలికలు పల్లెకట్టు వేషధారణలో ఆకట్టుకున్నారు. పద్మశ్రీ గ్రహీత, డప్పు కళాకారుడు మునివెంకటప్ప డప్పును వాయించడం ద్వారా సంబరాలకు శ్రీకారం చుట్టారు. పాఠశాల ట్రస్టు పాలకమండలి అధికారి శివరామరెడ్డి మాట్లాడుతూ కాలగర్భంలో కలిసిపోతున్న మన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు పరిచయం చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా బాలలు గిరిజనులు, కొడవలు, లంబాడాలు తదితర వివిధ వర్గాల సంప్రదాయ దుస్తులు ధరించి ఆడిపాడారు.





విద్యార్థుల జానపద నృత్యం

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

యశవంతపుర: మహిళను హత్య చేసిన కేసులో పోలీసులు నాలుగు నెలల తరువాత నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలు... చిక్కమగళూరు జిల్లా శృంగేరి తాలూకా నెమ్మారు గ్రామానికి చెందిన వాసంతి (42) ఏప్రిల్ 3న అదృశ్యమైంది. ఈ విషయంపై ఆమె కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉంటే కళస తాలూకాకు చెందిన ప్రకాశ్ ఉద్యోగ నిమిత్తం శృంగేరికి వెళ్లిన సమయంలో వాసంతితో పరిచయం కలిగింది. ఏడాదిన్నర ఇద్దరు అన్యోన్యంగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రకాశ్ కొప్పకు చెందిన యువతిని పెళ్లి చేసుకున్నాడు. అదే సమయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో దంపతులు విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వాసంతి, ప్రకాశ్‌కు ఫోన్ చేసి పెళ్లి ఎందుకు చేసుకున్నావంటూ నిలదీసింది. తాను విషం తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. దీంతో భయపడిన ప్రకాశ్ వెంటనే ఆమె ఇంటి వద్దకు వచ్చాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ప్రకాశ్ వాసంతి చెంప మీద కొట్టాడు. దీంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. కొద్దిసేపటి తరువాత ఆమె ప్రాణాలు కోల్పోయింది. దీంతో ప్రకాశ్ ఆమె మృతదేహాన్ని సమీపంలోని చెట్టు కూలిన స్థలంలో పాతిపెట్టాడు. తనకు ఏమి తెలియనట్లు ఆరు నెలల పాటు తప్పించుకుని తిరుగుతున్నాడు. ప్రకాశ్‌పై అనుమానంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం అంగీకరించాడు.



అరెస్టయిన నిందితుడు ప్రకాశ్ (ఫైల్)

ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్

రిజర్వు ఫారెస్ట్‌లో అనుమతులు లేకుండా వన్యప్రాణులను వేటాడుతున్న ముగ్గురు నిందితులను దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితులను ఎస్‌జె సందేశ్, మణియెరు నివాసి పునీత్, సంకేశ నివాసి కోట్యాప్ప గౌడలుగా గుర్తించారు. వీరి నుంచి నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బొమ్మనహళ్లి: విద్యార్థులు దాతల సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని హెచ్‌ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. వాసుదేవరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బొమ్మనహళ్లి అగర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థి డాక్టర్ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడంతో పాటు తాలూకా స్థాయిలో వాలీబాల్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అనంత్‌కుమార్, వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొబైళ్ల దొంగలు అరెస్ట్

యశవంతపుర: చాకు చూపించి మొబైళ్లు లాక్కొని వెళ్తున్న ఇద్దరిని జ్ఞానభారతి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ. 45 వేల విలువగల మొబైళ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనేక కేసుల్లో ఈ ఇద్దరు నిందితులుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ఇద్దరి అరెస్ట్

జేసీ నగర పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 14 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆసీఫ్, ఇమ్రాన్‌లుగా గుర్తించారు. వీరు ఈనెల 2న ఓ వ్యక్తిని అడ్డగించి డ్రాగర్ చూపి బెదిరించి మొబైల్ లాక్కొని పరారయ్యారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరి అరెస్ట్‌తో పలు కేసులు బయటపడ్డాయి.

పట్టుబడిన స్నాచర్లు

మైసూరు: మైసూరు నగరంలోని కేసీ లేఔట్‌లో నడిచి వెళుతున్న మహిళ మెడలో సుమారు 17 గ్రాముల బంగారం చైన్‌ను లాక్కెళ్లిన ఇద్దరు దొంగలను నజరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు నంజుండ, మాదప్ప. వీరిద్దరూ 8వ తేదీన భారతి (58) అనే మహిళ ఇంటి వద్ద వాకింగ్ చేస్తుండగా బైక్‌పై వచ్చి తాళి చైన్ తెంచుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పరిసర సీసీ కెమెరాల ఆధారంగా విచారణ సాగించి దొంగలను అరెస్టు చేశారు.

చాక్లెట్‌లో గంజాయి, నిందితుడి అరెస్ట్

యశవంతపుర: నగరంలో చాక్లెట్‌లో గంజాయి కలిపి విక్రయిస్తున్న నిందితుడిని ఆర్‌ఎంసీ యార్డు పోలీసులు అరెస్ట్ చేసి 225 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కచ్చితమైన సమాచారం మేరకు పోలీసులు లారీస్టాండ్ వద్ద ఆటోను పోలీసులు తనిఖీ చేయగా పది సంచుల గంజాయి బయటపడింది. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రౌడీషీటర్ అరెస్ట్ : కారులో నిద్రిస్తున్న రౌడీని యలహంక ఉపనగర పోలీసులు అరెస్ట్ చేశారు. మనోజ్ అలియాస్ కెంచ (25)ను అరెస్ట్ చేశారు. నిందితుడిపై కొడిగేహళ్లి పోలీసుస్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా గుర్తింపు ఉంది. నిందితుడిపై 14 కేసులున్నాయి. ఏడాదిన్నర నుంచి నిందితుడు తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సాహితీవేత్తలకు భయం వద్దు

యశవంతపుర: సాహితీవేత్తలు, రచయితలకు బెదిరింపు లేఖలు వచ్చిన విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సాహితీవేత్తలకు హామీ ఇచ్చారు. గురువారం సీఎంను కలిసిన సాహితీవేత్తల బృందం కే మరుళసిద్ధప్ప ఏడాది కాలంగా సాహితీవేత్తలకు బెదిరింపు లేఖలు వస్తున్నట్లు సీఎంకు వివరించారు. కుం.వీరభద్రప్ప, వసుంధర భూపతి, బంజగెరె జయప్రకాశ్‌కు బెదిరింపు లేఖలు వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. బెదిరింపు లేఖలపై ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేయిస్తామని సీఎం సిద్ధరామయ్య హామీ ఇచ్చినట్లు సాహితీవేత్తలు చెప్పారు.

వీధి వ్యాపారులకు సబ్సిడీ రుణాలు

బొమ్మనహళ్లి: వీధి వ్యాపారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి ఇప్పటికే బ్యాంకులకు సూచనలు ఇచ్చినట్లు కేంద్రమంత్రి భగవత్ కరద్ అన్నారు. గురువారం వీధి వ్యాపారుల ఆత్మనిర్భరనిధి పథకం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...కరోనా సమయంలో వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, దీంతో వారికి రుణాలు ఇప్పించి వారిని ఆర్థికంగా ఎదగడానికి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులను ఇప్పటికే ఆదేశించామని కేంద్రమంత్రి చెప్పారు.

ఎన్నికల బరిలో అమృత్‌రాజ్ వర్గం

శివాజీనగర: బీబీఎంపీ అధికారి, ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం ఎన్నికల ప్రక్రియ ఆరంభం కాగా, ఏ.అమృతరాజ్ వర్గం అభ్యర్థులు గురువారం నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ సమర్పించిన అనంతరం అమృత్‌రాజ్ మాట్లాడుతూ... ఉద్యోగుల హితరక్షణ, న్యాయసమ్మత పోరాటానికి విజయం లభించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీబీఎంపీ అధికారి, ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం 2023–2027 వరకు ఐదేళ్ల వ్యవధికి 17 మంది డైరెక్టర్ల స్థానానికి సెప్టెంబర్ 3న ఎన్నికలు జరుగనున్నాయి. బీబీఎంపీ ప్రధాన కార్యాలయం ఆవరణంలో ఉన్న డాక్టర్ రాజ్‌కుమార్ గ్లాస్‌హౌస్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు ఫలితాలు వెలువడుతాయి.

మూఢ నమ్మకాలను పారదోలాలి

- న్యాయమూర్తి హరిణి

పావగడ: సమాజంలో అనాది కాలం నుంచి పాతుకుపోయిన మూఢ నమ్మకాలు, కట్టుబాట్లపై ప్రజల్లో అవగాహన కల్పించి వాటిని తొలగించడానికి గ్రామ ప్రముఖులు కృషి చేయాలని జేఎంఎఫ్‌సి సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ హరిణి సూచించారు. పావగడ తాలూకాలోని సీకేపురం గ్రామ పంచాయతీ పరిధిలోని దేవరహట్టి గ్రామంలో నిర్వహించిన మూఢ నమ్మకాలపై అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కొరటగెరె తాలూకా మల్లేనహళ్లి గ్రామం కాడు గొల్లరహట్టి లో సభ్య సమాజం తల దించుకునేలా సంఘటన చోటు చేసుకుందన్నారు. ఓ గర్భిణి కవల పిల్లలకు జన్మ నిచ్చిందని, వారిని కుల సంప్రదాయం పేరుతో ఊరి బయట గుడిసెలో ఉంచడం బాధాకరమన్నారు. గొల్లరహట్టిలలో ఇలాంటి సంప్రదాయాలు నేటికి ఆచరిస్తుండడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో గొల్లరహట్టిలను సందర్శించి మూఢ నమ్మకాలను పారదోలేందుకు జాగృతి కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు జడ్జిలు, న్యాయవాదులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు. తాలూకా ఆరోగ్య శాఖ నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో జడ్జిలతో పాటు అధికసంఖ్యలో గ్రామస్థులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

ఆధార్ రెన్యూవల్ అంటూ మోసం

- నలుగురికి దేహశుద్ధి, నిందితుల పరారీ

మండ్య: ఆధార్ కార్డులను రెన్యూవల్ చేస్తామని చెప్పి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడానికి యత్నించిన వారిపై స్థానికులు దాడి చేసిన ఘటన మండ్య జిల్లా మద్దూరు తాలూకాలోని కే చెళ్లూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఉదయం ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ల్యాప్‌టాప్‌తో గ్రామ పంచాయతీ కార్యాలయం చేరుకున్నారు. ఆధార్ రెన్యువల్ చేస్తామని, లేదంటే వెయ్యి రూపాయాల జరిమానా పడుతుందని చెప్పడంతో ఆందోళనతో గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం చేరుకున్నారు. వంద రూపాయలు వసూలు చేస్తున్నారు. గ్రామస్తుల్లో కొందరికి అనుమానం రావడంతో వారిని నిలదీశారు. మోసగిస్తున్నట్లు అర్థం చేసుకున్న ప్రజలు వారిని పట్టుకుని చితకబాదారు. నలుగురు పారిపోయారు. పోలీసులు అక్కడికి చేరుకుని ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శివరాజు

మైసూరు: మైసూరు అదనపు జిల్లా అధికారిగా పీ శివరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం ఆయన కలెక్టరట్‌లో బాధ్యలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న కవిత రాజారామ్‌ను బదిలీ చేశారు. శివరాజు గతంలో మైసూరు విభాగ ప్రాదేశిక కమిషనర్‌గా కూడా సేవలు అందించారు.



పండుగ శోభ, మార్కెట్లు కిటకిట

తుమకూరు: మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో చేసే పండుగల్లో వర మహాలక్ష్మీ వ్రతం ఒకటి. శుక్రవారం వరలక్ష్మీ పండుగ సందర్భంగా తుమకూరు నగరంలోని రోడ్లు కిటకిటలాడాయి. మహిళలు పెద్ద ఎత్తున నగరంలోని మార్కెట్లకు వచ్చి పండ్లు, పూలు, ఇతర పండుగ సామగ్రి కొనుగోలు చేశారు. పూలు, పండ్ల ధరలు భారీగా పెరిగినా శక్తి కొద్ది కొనుగోలు చేశారు.

చింతామణిలో రద్దీ



చింతామణి: వరలక్ష్మీ పండుగను పురస్కరించుకుని ధరలు ఆకాశాన్నంటాయి. పండ్లు, పూల ధరలు రెట్టింపు ధరలతో విక్రయాలు చేశారు. తప్పని పరిస్థితుల్లో మహిళలు శక్తికొద్ది కొనుగోలు చేశారు. లక్ష్మీ దేవి విగ్రహాలకు డిమాండ్ ఏర్పడింది.

హోసూరు వార్తలు..

ఘనంగా కుంభాభిషేకం



పాల్గొన్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మునిస్వామి తదితరులు

హోసూరు: హోసూరు సమీపంలోని కామనదొడ్డి గ్రామంలో పునరుద్ధరణ గావించిన గ్రామదేవత మారియమ్మ ఆలయ రాజగోపుర మహా కుంభాభిషేకోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గణపతి పూజ, కలశ పూజ, సకల దేవత హోమం, చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మహిళా భక్తులు పాలకుండలతో ఆలయం వద్దకు చేరుకొని అభిషేకం నిర్వహించారు. పుణ్యజలాలతో రాజగోపుర కుంభాభిషేకోత్సవాన్ని ఘనంగా జరిపించారు. వేపనపల్లి ఎమ్మెల్యే కే.పి.మునిస్వామి, మాజీ మంత్రి పి. బాలకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: వేపనపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గురువారం సూళగిరి యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గతంలో చొక్కాపురం, నెరిగం, సిగ్గలపల్లి, కరియసంద్రం తదితర గ్రామ పంచాయతీల్లో వసతుల కోసం ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ. 81.40 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో గురువారం తారురోడ్డు, మురికి కాల్వలు తదితరాలను నిర్మిస్తారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేష్, మాదేశ్వరన్, క్రిష్ణప్ప, గంగరాజ్, పాల్గొన్నారు.

మట్టిగడ్డ విరిగిపడి కార్మికుడు మృతి

క్రిష్ణగిరి: మట్టిబావిని తవ్వుతుండగా అకస్మాత్తుగా మట్టిగడ్డ కూలిపోవడంతో కార్మికుడు మృతి చెందిన ఘటన ఊత్తంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని గొల్లనాయకనూరు గ్రామానికి చెందిన వెంకటేష్ (54), అదే ప్రాంతానికి చెందిన నాగరాజ్, శంకర్ తదితరులు కలిసి వసంతపురం ప్రాంతంలో ఓ రైతు పొలంలో బావిని తవ్వే పనులు చేపట్టారు. ఈ సమయంలో అకస్మాత్తుగా మట్టిగడ్డ కూలి వెంకటేష్‌పై పడటంతో లోన చిక్కుకొన్న అతను ఊపిరి ఆడక ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేత

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి, క్రిష్ణగిరిలో నిర్వహిస్తున్న ఆవిన్ పాల ఉత్పత్తి డెయిరీలను రాష్ట్ర పాల అభివృద్ధి శాఖ మంత్రి మనోతంగరాజ్ బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన ఈ తనిఖీల్లో ఊత్తంగేరి, క్రిష్ణగిరి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆవిన్ పాల ఉత్పత్తి కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తి రైతులకు సంక్షేమ ఫలాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, అందులో భాగంగా పాల ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, సహకార సంఘాలను ఏర్పాటు రైతుల నుంచి పాలను సేకరించి రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తుందని, పాల ఉత్పత్తి రైతులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహక నిధి, బహుమతులను అందజేస్తుందని సూచించారు. పాల ఉత్పత్తి కేంద్రాల్లో పాలు, పెరుగు, నెయ్యి, ఇతర ఉత్పత్తులను తయారు చేసి ఆవిన్ పాల కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాల సేకరణ కేంద్రాలకు నాణ్యతా పరిశీనా యంత్రాలను, 91 మంది లబ్ధిదారులకు 35.57 లక్షల విలువ చేసే సంక్షేమ ఫలాలను అందజేశారు.



పాల నాణ్యత పరిశీలనా యంత్రాలను అందజేస్తున్న మంత్రి

రేణుకా యల్లమ్మకు పూజలు



కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని బైరమంగలం గ్రామంలో కొత్తగా నిర్మించిన రేణుకా యల్లమ్మ దేవి ఆలయ కుంభాభిషేకోత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజ, నవగ్రహ పూజ, శివపార్వతుల చండీయాగం, విగ్రహ ప్రతిష్టాపన, ప్రాణప్రతిష్ట తదితర కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి మహా కుంభాభిషేకోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమానికి తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, వరదరాజ్, రాజా, బైరమంగలం పంచాయతీ అధ్యక్షులు మంజుల శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా భద్రావతి తాలూకా హొళెహొన్నూరు పట్టణంలో మహాత్మగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో ఇద్దరు దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం జిల్లా ఎస్పీ మిథున్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ... గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఇద్దరిని చిత్రదుర్గ జిల్లాలో అరెస్ట్ చేశామని, నిందితులను గణేశ్, వినయ్‌లుగా గుర్తించినట్లు చెప్పారు. ఏ ఉద్దేశంతో వారు ఈ పనిచేశారో విచారణ చేస్తున్నామని చెప్పారు.

టాటాఏస్ వాహనంపై విరిగిపడ్డ చెట్టు

- 8 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం



నుజ్జునుజ్జయిన వాహనం

దొడ్డబళ్లాపురం: టాటాఏస్ వాహనంపై చెట్టు విరిగిపడటంతో 8 మంది గాయపడిన ఘటన చెన్నపట్టణ తాలూకా యలాచిపాళ్య వద్ద చోటుచేసుకుంది. రోడ్డుపై వస్తున్న టాటాఏస్ వాహనంపై రోడ్డుపక్కన ఉన్న చెట్టు హఠాత్తుగా విరిగి పడింది. దీంతో లోపల ఉన్న 8 మంది గాయపడ్డారు. డ్రైవర్‌తో కలిపి ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డవారు టాటాఏస్ వాహనంలో ప్రయాణిస్తున్నారు. క్షతగాత్రులంతా చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారుగా తెలిసింది. గాయపడ్డవారిని పట్టణ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగ మేళా సద్వినియోగం చేసుకోండి

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రభుత్వ బాలికల ఉన్నతోన్నత పాఠశాలలో శనివారం ఉదయం జరిగే మెగా ఉద్యోగమేళా కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శరయు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ మేళాలో హోసూరు, క్రిష్ణగిరి ప్రాంతాలకు చెందిన వందకు పైగా పరిశ్రమాధికారులు పాల్గొని 8వ తరగతి నుంచి డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర విభాగాల్లో యువతను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

వేడుకగా తిరుమలనంబి 1050వ అవతార మహోత్సవాలు


హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల: ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమల నంబి 1050వ అవతార మహోత్సవం గురువారం తిరుమలలోని శ్రీవారి ఆలయ దక్షిణ మాడ వీధిలో ఉన్న శ్రీ తిరుమలనంబి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య చక్రవర్తి రంగనాథన ముఖ్య అతిథిగా హాజరై ఉపన్యసించారు. తిరుమల శ్రీవారికి పుష్ప కైంకర్యం, మంత్ర పుష్ప కైంకర్యం, వేదపారాయణ కైంకర్యం, ఇతర కైంకర్యాలు చేసి తిరుమల తొలి పొరుడిగా శ్రీ తిరుమలనంబి నిలిచారని ఆయన పేర్కొన్నారు. శ్రీవారి కైంకర్యాలు చేసేందుకు శ్రీ తిరుమలనంబి 973వ సంవత్సరంలో తిరుమలకు చేరుకున్నారని తెలిపారు. శ్రీ తిరుమలనంబి స్వయాన శ్రీభగవద్ రామానుజులవారికి మేనమామ అని చెప్పారు. తిరుమలనంబి తన జీవితం మొత్తాన్ని స్వామివారి కైంకర్యానికి అంకితం చేసి శ్రీవారి చేత తాత అని పిలిపించుకున్నారని, ఈ కారణంగానే వారికి తాతాచార్య వంశీయులుగా పేరు వచ్చిందని వివరించారు. ఈ సందర్భంగా తిరుమలనంబికి సంబంధించిన విశేష అంశాలతో రచించిన తిరుమలనంబి దివ్యచరితామృతం పుస్తకాన్ని ఆవిష్కరించారు. విజయవాడకు చెందిన పాలకొలను వెంకటరామిరెడ్డి ఈ పుస్తకాన్ని తెలుగులో రచించారు. దీన్ని గిద్దలూరుకు చెందిన గంటా మోహన్ రెడ్డి ఇంగ్లీషులోకి, బెంగళూరుకు చెందిన రంజని కన్నడ భాషలోకి అనువదించారు.

అవార్డు గ్రహీతలకు గవర్నర్ అభినందనలు

సాక్షి, అమరావతి: 69వ జాతీయ సినిమా అవార్డులు గెలుచుకున్న తెలుగు సినీ ప్రముఖులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. తొలిసారిగా తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి జాతీయ నటుడుగా ఎంపికైన అల్లు అర్జున్‌తో పాటు, బెస్ట్ మ్యూజిక్ అవార్డు అందుకున్న దేవీశ్రీ ప్రసాద్, సినీ గేయ రచయిత చంద్రబోస్, 6 అవార్డులు గెలుచుకున్న ఆర్ఆర్ఆర్ సినీ బృందాన్ని అభినందించారు.


శ్రీశైలానికి 7 విభాగాల్లో ఐఎస్‌వో ధ్రువీకరణ



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం ఆలయానికి 7 విభాగాల్లో ఐఎస్‌వో (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) ధ్రువీకరణలు లభించాయి. గురువారం శ్రీశైలం ఆలయంలో ఈ పత్రాలను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఆలపాటి శివయ్య అందజేశారు. గతంలో జారీ చేసిన ధ్రువీకరణల కాల పరిమితి ముగియడంతో తిరిగి పరిశీలన అనంతరం వీటిని అందజేశారు. ఆలపాటి శివయ్య మాట్లాడుతూ..ఆయా రంగాల్లో దేవస్థానం పాటిస్తోన్న ఉన్నత ప్రమాణాలను పరిశీలించి ఈ ధ్రువీకరణలను అందించామన్నారు. క్వాలిటీ మేనేజ్‌మెంట్‌కు ఐఎస్‌వో-9001, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్‌కు ఐఎస్‌వో-14001, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మెజర్స్‌కు ఐఎస్‌వో-45001, ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు ఐఎస్‌వో-22000, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌కు ఐఎస్‌వో- 27001, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు ఐఎస్‌వో-50001, గుడ్‌హైజెనిక్ ప్రాక్టీసెస్‌కు ఐఎస్‌వో ధ్రువీకరణలు అందజేసినట్లు వివరించారు. ఆలయ ఈవో లవన్న, దేవదాయశాఖ అర్చక ట్రైనింగ్ డైరెక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి, ఏఈవో హరిదాసు పాల్గొన్నారు.

'మహా' మాయ వల..
యువత విలవిల

- మహదేవ్ ఆన్‌లైన్ యాప్ మోసాలకు ఈడీ చెక్
- విశాఖలో ఐదుగుర్ని అరెస్ట్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- హవాలా రూపంలో రూ.కోట్లు తరలించినట్టు గుర్తింపు
- 18 ఆన్‌లైన్ వెబ్‌సైట్లతో మహదేవ్ సంస్థ మోసాలు
- దేశవ్యాప్తంగా 17 మంది కంపెనీ ప్రతినిధుల్ని అరెస్ట్ చేసిన ఈడీ



సాక్షి, విశాఖపట్నం : ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, షేర్ చాట్ చూస్తున్న వారంతా మహదేవ్ ఆన్‌లైన్ యాప్‌కు టార్గెట్. రీల్స్ స్క్రోల్ చేస్తుంటే ఉన్నట్టుండి రీల్ రూపంలోనే యాడ్ ప్రత్యక్షమవుతుంది. 'రేపు నా లవర్ బర్త్‌డే ఉందిరా. గిఫ్ట్ కొందామంటే డబ్బుల్లేవు. ఏం చెయ్యాలో తెలియట్లేదు అని ఓ యువకుడు అనగానే.. దానికెందుకురా అంత టెన్షన్ పడతావ్. ఇదిగో.. ఈ క్రికెట్ బెట్టింగ్ యాప్ ఉంది కదా. దాంట్లో గేమ్ ఆడు. వెంటనే నీకు అమౌంట్ క్రెడిట్ అయిపోతుంది. ఈ బైక్‌ని నేను ఈ యాప్ ద్వారానే కొన్నాను' అనే రీల్ కనిపిస్తుంది. దాని కింద ఓ లింక్ క్లిక్ చేస్తూ చాలామంది ఆ 'మహా' వలలో చిక్కుకుంటున్నారు. విశాఖ, రాయ్‌పూర్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడీ) దాడులు నిర్వహించింది. విశాఖలో ఐదుగుర్ని అదుపులోకి తీసుకుంది. హవాలా రూపంలో రూ.కోట్లను తరలించినట్టు ఈడీ గుర్తించింది. దేశంలో లక్షలాది మంది యువత నుంచి మహాదేవ్ యాప్ రూ.కోట్లు కొల్లగొట్టేస్తోంది.



ఈడీ అదుపులో 17 మంది

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఇప్పటికే 12 మందిని అదుపులోకి తీసుకున్న ఈడీ విశాఖలో వచ్చిన ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించి కీలకమైన మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. గతంలో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న 19 మంది మహదేవ్ బుక్ గ్యాంగ్‌ను విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. దుబాయ్ కేంద్రంగా సాగే మహదేవ్ బుక్ ప్లాట్‌ఫామ్ నుంచి ఫ్రాంచైజ్ తీసుకుని దేశంలో యువత లక్ష్యంగా ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా రూ.కోట్లు కాజేస్తున్నట్టు తమ దర్యాప్తులో వెల్లడైందని విశాఖ నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ ఈడీకి నివేదిక అందజేశారు. ఈ ఆధారాలతో గురువారం ఈడీ బృందాలు సోదాలు నిర్వహించాయి.

నిషేధించినా ఎక్స్ఛేంజ్ పేరుతో..

విదేశాల నుంచి నడిచే 'మహదేవ్ బుక్' అనేక బెట్టింగ్ యాప్‌లకు ప్లాట్‌ఫామ్‌గా వ్యవహరిస్తోంది. ఈ గేమింగ్ అప్లికేషన్‌లో 50కి పైగా వెబ్‌సైట్లు ఉన్నాయి. అందులో ప్రధానంగా లోటస్ 365, ఫెయిర్‌ప్లే, పోకర్, కార్డ్ గేమ్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, లేజర్ బుక్, టైగర్ ఎక్స్ఛేంజ్, బెట్ బుక్ 247, గోల్డ్ 365 వంటివి ఉన్నాయి. మహదేవ్ బుక్ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ను భారత ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. అయితే, ఇతర దేశాల్లో చలామణిలో ఉంది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వహణకు ఫ్రాంచైజీలు ఇస్తూ వారిని ఎక్స్ఛేంజ్ పేరుతో నిర్వహిస్తుంటారు. ఎక్స్ఛేంజ్ లైసెన్స్ కోసం రూ.20 లక్షలు మహదేవ్ బుక్‌కు డిపాజిట్ చేస్తే వారు బ్రాంచ్ ఐడీని కేటాయిస్తారు. దాంతో ఆ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ గేమ్స్ కార్యకలాపాలు సాగించే అవకాశముంటుంది. ఇలా ప్రపంచంలో 650కి పైగా, అలాగే దేశంలో 60కి పైగా ఎక్స్ఛేంజ్‌లు ఉన్నట్టు ఈడీ దర్యాప్తులో గుర్తించారు. గురువారం విశాఖతో పాటు రాయ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోనూ సోదాలు నిర్వహించారు. యాప్ ద్వారా వచ్చిన డబ్బును దుబాయ్‌లో నివసిస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సౌరభ్ చంద్రకర్ అనే వ్యక్తికి పంపేలా వివిధ ఖాతాల ద్వారా హవాలా జరిగినట్టు విచారణలో తెలుస్తోంది.

గేమ్ కంట్రోల్.. వారి చేతిలోనే..

మహదేవ్ బుక్ యాప్‌ని ఉపయోగించి ఆన్‌లైన్ గేమ్‌లలో డబ్బు పెట్టడానికి ప్రజలను ప్రలోభపెట్టి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. డబ్బు సంపాదించడానికి అప్లికేషన్‌ని డౌన్‌లోడ్ చేయాలంటూ లింక్స్, రీల్స్ ద్వారా కోరుతుంటారు. దాని ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసిన తర్వాత వాట్సాప్‌లో కనెక్ట్ అయ్యి.. గేమ్‌లో గెలిచిన తర్వాత బోనస్‌లతో రిటర్నులు వస్తాయనే భరోసా ఇస్తారు. బెట్టింగ్ గేమ్‌లు ఆడేందుకు డబ్బులు పెట్టుబడి పెట్టాలని సూచించి చిన్న మొత్తాలతో ప్రారంభిస్తారు. తక్కువ డబ్బులు బెట్టింగ్ వేసినప్పుడు విజయం సాధించేలా చేసి రిటర్న్స్ ఇస్తుంటారు. ఈ వలలో పడి రూ.వేలు, రూ.లక్షలు బెట్టింగ్‌లో పెడితే అంతే సంగతి. యాప్ సెంట్రల్ కంట్రోలర్‌కు నిందితుల వద్ద ప్రత్యేక యాక్సెస్ వచ్చేలా సాఫ్ట్‌వేర్ డిజైన్ చేస్తారు. పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టినప్పుడు సదరు వినియోగదారుడు ఎంత బాగా ఆడినా గేమ్‌లోని కదలికల్ని కంట్రోల్ చేసి ఓడిపోయేలా చేస్తారు. దీంతో డబ్బును కోల్పోతారు. వెంటనే సదరు ప్లేయర్ ఐడీని బ్లాక్ చేసేస్తారు. దేశంలో ఇప్పటికే నోయిడా, ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర ప్రాంతాల్లో దాడులు ముమ్మరం చేసి పదుల సంఖ్యలో నిందితుల్ని అరెస్ట్ చేశారు. కేవలం భారత్ లోనే కాకుండా పాకిస్తాన్, నేపాల్, థాయ్‌లాండ్ సహా పలు దేశాల నుంచి నిందితులు ఈ యాప్‌ను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

రాజకీయంగా బాబు అండ్ కో భూస్థాపితం

రిలే దీక్షలో బహుజన నాయకుల హెచ్చరిక



తాడికొండ: కులవాదంతో ఆర్థిక ఉగ్రవాదులుగా మారిన బాబు అండ్ కోను వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా భూస్థాపితం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. అమరావతిని సెంటిమెంట్‌గా పెట్టి 29 గ్రామాలను మరోసారి మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,061వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉండి అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు వైఖరి స్పష్టంగా తెలిసినందునే గత ఎన్నికల్లో బహుజనులు బాబును ఛీకొట్టి 23 సీట్లకే పరిమితం చేశారన్నారు. కర్నూలు కేంద్రంగా లా యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ముందడుగు వేయడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. త్వరలో విశాఖ కేంద్రంగా రాజధాని దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. వార్డు కౌన్సిలర్లుగా కూడా గెలవలేని లోకేశ్, పవన్‌కళ్యాణ్‌కు మళ్లీ ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కి ప్రజలంతా అండగా ఉన్నారనడంలో సందేహం లేదన్నారు. పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ఆర్కే

గర్భిణిని తన కారులో తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు


సహాయక చర్యల్లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మానవత్వం చాటుకున్నారు. ఆటో బోల్తాపడటంతో ఇబ్బందిపడుతున్న గర్భిణిని తన కారులో ఆస్పత్రికి పంపించారు. ఎమ్మెల్యే ఆర్కే గురువారం గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు నుంచి మంగళగిరి వైపు వెళుతుండగా... అదే సమయంలో పెదవడ్లపూడి ఫ్లైఓవర్ వద్ద ఓ ఆటో బోల్తా కొట్టింది. వెంటనే ఎమ్మెల్యే కారును ఆపి తన సిబ్బంది, స్థానికుల సహాయంతో బోల్తా పడిన ఆటోను పైకి లేపారు. ఆటోలో ఉన్న ఎనిమిది మంది మహిళా ప్రయాణికులను బయటకు తీశారు. ప్రయాణికుల్లో పెదవడ్లపూడికి చెందిన తొమ్మిది నెలల నిండు గర్భిణి ప్రత్తిపాటి లావణ్య కూడా ఉన్నారు. ఆటో బోల్తా కొట్టడంతో ఆమె నీరసపడిపోయారు. ఆమె ఆస్పత్రికి వెళ్లడం ఆలస్యమైతే కడుపులో బిడ్డకు ప్రమాదమని భావించిన ఎమ్మెల్యే వెంటనే తన కారులో ఎస్కార్ట్‌ను ఇచ్చి లావణ్యను తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. ఆమెకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. ఆటో ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి సాయం చేయడంతోపాటు గర్భిణిని ఆస్పత్రికి పంపించి మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ఆర్కేకు ప్రయాణికులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

సెప్టెంబర్ 9న ఏయూ స్నాతకోత్సవం

ఏయూక్యాంపస్: ఏయూ 87, 88, 89, 90వ సంయుక్త స్నాతకోత్సవాన్ని సెప్టెంబర్ 9న నిర్వహిస్తున్నట్లు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవరంగం (స్నాతకోత్సవ మందిరం)లో మధ్యాహ్నం 3 గంటల నుంచి స్నాతకోత్సవం జరుగుతుందన్నారు. స్నాతకోత్సవానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో హాజరవుతారని చెప్పారు.

విద్యుత్ కార్మిక సంఘాల వినతిపై నిర్ణయం తీసుకోండి

ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విజయవాడలో ధర్నాకు అనుమతి కోసం విద్యుత్ కార్మిక సంఘాలు అందించిన వినతిపత్రంపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం నిమిత్తం విజయవాడలోని ధర్నాచౌక్ లేదా జింఖానా గ్రౌండ్స్‌లో ధర్నా నిర్వహించుకునేందుకు అనుమతినివ్వాలని కోరుతూ పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించామని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం వెలువరించలేదంటూ విద్యుత్ కార్మిక సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. హోంశాఖ తరఫు న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ విద్యుత్ కార్మికులు నిత్యావసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) పరిధిలోకి వస్తారని, సెలవు పెట్టి ధర్నాలో పాల్గొనడంపై స్పష్టమైన నిషేధ ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి సెలవు రోజుల్లో ధర్నా నిర్వహించుకునే విషయాన్ని పరిశీలించాలని కార్మిక సంఘాలకు సూచించారు.

సత్యదేవుని ఆలయంలో బంగారు ధ్వజస్తంభం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి త్వరలో బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కానుంది. ఆలయానికి ఎదురుగా ఉన్న అనివేటి మండపంలో నెల్లూరు జిల్లాకు చెందిన దాత ధ్వజస్తంభం ఏర్పాటుచేసి దానికి బంగారు తాపడం చేయించడానికి ముందుకు వచ్చినట్లు దేవస్థానం ఈవో ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ గురువారం తెలిపారు. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం కర్ర పూర్తిగా పాడైపోయినందున కొత్త ధ్వజస్తంభం ఏర్పాటుచేయాల్సిందిగా దేవస్థానం వైదిక కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు.

అతిథుల జాబితాలో నా పేరు చేర్చండి

రాష్ట్రపతికి లక్ష్మీపార్వతి లేఖ



సాక్షి, అమరావతి: ఎన్టీ రామారావు జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం రూ.100 నాణెం విడుదల చేసే కార్యక్రమానికి ఆయన సతీమణిగా తన పేరును ఆహ్వానితుల జాబితాలో చేర్చాలని కోరుతూ నందమూరి లక్ష్మీపార్వతి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గురువారం లేఖ రాశారు. 11-09-1993న తనకు ఎన్టీ రామారావుతో వివాహమైందని లేఖలో పేర్కొన్నారు.ఎన్టీఆర్ అల్లుడు చంద్రబాబు, కుటుంబ సభ్యులే మోసం చేయడంతో ఎన్టీఆర్ తీవ్ర నిరాశ, మానసిక క్షోభతో 18-01-1996న మరణించారన్నారు. చట్టబద్ధంగా ఎన్టీఆర్‌కు భార్యనైన తనను విస్మరించి, ఎన్టీఆర్ మరణానికి కారకులైన కుటుంబ సభ్యులను కార్యక్రమానికి ఆహ్వానించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఒంటరి మహిళనైన తన విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నెల 28వ తేదీన జరగనున్న రూ.100 నాణెం విడుదల కార్యక్రమం ఆహ్వానితుల జాబితాలో తన పేరు చేర్చేలా ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్రపతికి విన్నవించారు.

ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో ప్రొఫెసర్ రాజూరి



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ (ఎస్కేయూ) ఫిజిక్స్ విభాగం మాజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజూరి రామకృష్ణారెడ్డికి ప్రపంచ శాస్త్రవేత్తల జాబితాలో చోటు దక్కింది. స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ (అమెరికా) రూపొందించిన అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తల జాబితాలో ఆయనకు చోటు లభించింది. స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ ప్రతి ఏటా ఈ జాబితాను రూపొందిస్తుండగా వరుసగా రెండోసారి రాజూరి చోటు దక్కించుకున్నారు. ఇస్రో సహకారంతో ఎస్కేయూ నిర్వహిస్తోన్న ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా రాజూరి సుదీర్ఘంగా పనిచేశారు. ఎస్కేయూ ఫిజిక్స్ విభాగంలో 30 ఏళ్ల పాటు పలు పరిశోధన ప్రాజెక్ట్‌ల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. మెటీరియల్, స్పెక్ట్రోస్కోపి రంగాల్లో పరిశోధనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో 252కుపైగా రీసెర్చ్ ఆర్టికల్స్‌ను పబ్లిష్ చేశారు. ఆయనకు యూజీసీ రీసెర్చ్, ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ అవార్డులు దక్కాయి.

తెలంగాణ

పోలీసుల అదుపులో జనశక్తి అగ్రనేతలు!

సిరిసిల్ల: సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీ అగ్రనేతలు కూర రాజన్న అలియాస్ రాజేందర్, కూర దేవేందర్ అలియాస్ అమర్, వెంకటేశ్‌తోపాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు విమలక్క, కొమురన్న, సంతోష్ గురువారం ప్రకటించారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్తున్న రాజన్న, అతనితోపాటు ఉన్న వెంకటేశ్‌ను హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. అమర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. 12 రకాల అనారోగ్య సమస్యలతో ఉన్న కూర రాజన్నతోపాటు అతని సహాయకుడు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఈ ముగ్గురికి సంబంధించిన ఫోన్లు స్విచాఫ్ వస్తున్నాయని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రకటించింది. పోలీసులు వెంటనే వారిని మీడియా ముందు ప్రవేశపెట్టి, ఏమైనా కేసులుంటే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేశారు. వారికి ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని స్పష్టం చేశారు.

మహిళకు విజయవంతంగా గుండె మార్పిడి

టీటీడీ హృదయాలయంలో మరో అరుదైన ఘనత


ఆధునిక వైద్య పరిజ్ఞానంతో గుండె మార్పిడి చేస్తున్న వైద్యుల బృందం

తిరుపతి (తుడా): తిరుపతిలోని టీటీడీ శ్రీపద్మావతి హృదయాలయం ఆస్పత్రిలో 36 ఏళ్ల మహిళకు గుండె మార్పిడిని వైద్యుల బృందం గురువారం విజయవంతంగా పూర్తి చేసింది. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కూడిన వైద్యుల బృందం సుమారు 4 గంటలపాటు శ్రమించి గుండె మార్పిడి శస్త్రచికిత్స జరిపింది. నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 33 ఏళ్ల మహిళ బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. అప్పటికే అవయవదాన్‌లో నమోదు చేసుకున్న 36 ఏళ్ల గుంటూరు ప్రాంతానికి చెందిన మహిళకు గుండెను అందించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. మిగిలిన అవయవాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. గుండె లభ్యతను తెలుసుకున్న శ్రీనాథ్‌రెడ్డి బృందం నెల్లూరుకు అంబులెన్స్ తీసుకెళ్లి గుండెను సేకరించారు. గ్రీన్ ఛానల్ ద్వారా తిరుపతికి తీసుకువచ్చి 36 ఏళ్ల మహిళకు అమర్చారు. సుమారు రూ.12 లక్షల ఖరీదైన గుండె మార్పిడి చికిత్సను వైఎస్సార్‌ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి పూర్తి ఉచితంగా అందించి ఆ మహిళకు పునర్జన్మ ప్రసాదించారు.

ఫేక్ ఐడీలతో రైల్వే రిజర్వేషన్లు

- ఇంటర్‌నెట్ సెంటర్‌పై అధికారుల దాడి
- నిందితుడి అరెస్టు.. 21 రైల్వే టికెట్లు ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం


నిందితుడు నాగరాజు, ల్యాప్‌టాప్‌తో ఆర్‌పీఎఫ్ సిబ్బంది

అగనంపూడి (గాజువాక): ఫేక్ ఐడీలతో రైల్వే రిజర్వేషన్లు చేస్తున్న ఓ ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దువ్వాడ ఆర్‌పీఎఫ్ ఔట్‌పోస్ట్ సీఐ బి.రాము తెలిపిన వివరాల ప్రకారం.. 88వ వార్డు పెదనరవ గ్రామానికి చెందిన నాగరాజు ఇంటర్‌నెట్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అతను కొద్ది రోజులుగా ఫేక్ ఐడీలు సృష్టించి రైల్వే రిజర్వేషన్లు చేయిస్తున్నట్లు ఆర్‌పీఎఫ్ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అధికారులు, ఆర్‌పీఎఫ్ అధికారులు ఇంటర్‌నెట్ సెంటర్‌పై దాడి చేసి సోదాలు నిర్వహించారు. ఫేక్ ఐడీలతో రిజర్వేషన్ టికెట్లు బుక్ చేసి టికెట్‌పై వంద రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. అతనిని అరెస్ట్ చేసి ల్యాప్‌టాప్‌తోపాటు 21 రిజర్వేషన్ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు.

తమిళనాడులో ఏపీ విద్యార్థి ఆత్మహత్య

తిరువళ్లూరు: తమిళనాడులోని తిరువళ్లూరులో ఏపీ విద్యార్థి గురువారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. విజయవాడకు చెందిన మణికంఠ చంద్రశేఖర్ (19) కవరపేటలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతను ఆ కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌లోనే ఉంటున్నాడు. ఇటీవల వెలువడిన సెమిస్టర్ పరీక్షల్లో కొన్ని సబ్జెక్టులు తప్పినట్లు తెలుస్తోంది. దీంతో మానసికంగా ఇబ్బంది పడుతూ కనిపించిన మణికంఠ చంద్రశేఖర్ గురువారం హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాహితీ దిగ్గజం తుమ్మపూడి మృతి

- వయోభారంతో అనంతపురంలోని స్వగృహంలో కన్నుమూత
- ఆచార్యుడిగా, రచయితగా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ
- భాషా సమ్మాన్, కళారత్న పురస్కారాల గ్రహీత
- నేడు అంత్యక్రియలు



అనంతపురం కల్చరల్ : సాహితీ దిగ్గజం, ప్రఖ్యాత అలంకార శాస్త్రవేత్త, విమర్శకుడు తుమ్మపూడి కోటేశ్వరరావు (89) గురువారం తెల్లవారు జామున అనంతపురం కోవూరు నగర్‌లోని స్వగృహంలో వయోభారంతో కన్నుమూశారు. గుంటూరు జిల్లాలో జన్మించిన ఆయన అనంతపురంలో స్థిరపడ్డారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా సాహిత్యానికి చిరస్మరణీయ సేవలందించారు. వివిధ యూనివర్సిటీలతో పాటు కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఎస్కేయూలో 1976 నుంచి 94 వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. తెలుగు ఆచార్యులుగా వందలాది మందిని భాషా ప్రేమికులుగా తీర్చిదిద్దారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో కలిసి పనిచేసిన తుమ్మపూడి కోటేశ్వరరావును పలు అవార్డులు, రివార్డులు వరించాయి. ముఖ్యంగా కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి భాషా సమ్మాన్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న పురస్కారం అందుకున్నారు. ఉపన్యాసకుడిగా, ఆచార్యునిగా పనిచేస్తూనే 51 గ్రంథాలను రచించారు. ఆయన వద్ద 30 మందికిపైగా పరిశోధక విద్యార్థులుగా పీహెచ్‌డీలు, మరో 20 మంది ఎంఫిల్ పట్టా పొందారు. ఆయన రాసిన రచనలు డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా కూడా ఉన్నాయి. అనంత సాహితీ దిగ్గజాలు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, ఆచార్య హెచ్ఎస్ బ్రహ్మానంద, డాక్టర్ పీఎల్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అంకె రామలింగమయ్య వంటివారికి తుమ్మపూడి అధ్యాపకుడిగా ఉన్నారు. ఆయన భౌతిక కాయానికి పలువురు సాహితీవేత్తలు నివాళులర్పించారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. తుమ్మపూడి అంత్యక్రియలు శుక్రవారం అనంతపురంలో జరగనున్నాయి.

కువైట్‌లో చిక్కుకున్న మహిళకు ఏపీఎన్ఆర్‌టీఎస్ సాయం

స్వస్థలమైన విశాఖకు వచ్చేందుకు చేయూత

కడప కార్పొరేషన్: పని కోసం కువైట్ వెళ్లి సేఠ్ పెట్టే చిత్రహింసలు భరించలేక అల్లాడుతున్న విశాఖపట్నానికి చెందిన ఓ మహిళకు ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) సభ్యులు సాయం చేశారు. ఆమెను సురక్షితంగా తన స్వస్థలానికి చేర్చారు. విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీకి చెందిన కేకే దుర్గ ఐదు రోజుల క్రితం సేఠ్ ఇంటి నుంచి పారిపోయి వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డిని కలిసి తన కష్టాలు వివరించి భారత్‌కు పంపించాలని విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన భారత రాయబార అధికారులతో మాట్లాడి, దుర్గకు ఔట్ పాస్‌పోర్టు ఇప్పించి ఇండియాకు పంపే ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ

చంద్రయాన్-3లో ఈసీఐఎల్ కీలక భూమిక

ఇస్రోకు డీఎస్ఎన్ యాంటెన్నాను అందించిన ఈసీఐఎల్

కుషాయిగూడ (హైదరాబాద్): చంద్రయాన్-3లో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కీలక భూమిక పోషించింది. చంద్రయాన్ కమ్యూనికేషన్‌కు కీలకమైన 32 మీటర్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (డీఎస్ఎన్) యాంటెన్నాను సరఫరా చేసిందని సంస్థ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. 300 టన్నుల ఈ యాంటెన్నా వ్యవస్థను బాబా అటామిక్ రిసెర్చ్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, ఐఎస్‌టీఆర్‌ఏసీలతో కలిసి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించినట్లు చెప్పాయి. ఇస్రోలో ఏర్పాటు చేసిన ఈ యాంటెన్నా భూమి నుంచి 4 లక్షల కిలోమీటర్ల దూరంలో చంద్రుడి చుట్టూ తిరిగే వ్యోమనౌకను సూచిస్తుందన్నాయి. చంద్రుడి ఉపరితలంపై 0.3 మిల్లీమీటర్ల పరిమాణం కలిగిన వాటినీ క్షుణ్ణంగా చూపించేలా వీల్ అండ్ ట్రాక్ మౌంట్, బీమ్ వేవ్ గైడ్, ఫీడ్‌సిస్టమ్‌తో కూడిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యాంటెన్నాలో అమర్చినట్లు చెప్పాయి. చంద్రుడిపై తీసే చిత్రాలు, డేటాను స్వాధీనం చేసుకోవడంలోనూ ఈ యాంటెన్నా కీలక పాత్ర పోషిస్తుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో కూడిన యాంటెన్నా సిస్టమ్‌తో పాటుగా సేఫ్ అండ్ సెక్యూర్ ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోల్ (పీఎల్‌సీ)ని అందిస్తూ ఇస్రోతో ఈసీఐఎల్ సన్నిహితంగా పనిచేస్తోందని ఆ వర్గాలు చెప్పాయి. రాబోయే ఆదిత్య, గగన్‌యాన్, మంగళ్‌యాన్-2 మిషన్లకు కూడా ఈసీఐఎల్ పనిచేస్తుందని పేర్కొన్నాయి.

ఫ్యాషన్







కంచిపట్టు

వేడుకలా కట్టు

పట్టు కట్టుకుంటే...

● కట్టుకున్న చీర మనల్ని డామినేట్ చేయకూడదు. ఆ చీరలో మనం మరింత అందంగా వెలిగిపోవాలి. అందుకు బ్లౌజ్ డిజైన్ కూడా దోహదం చేస్తుంది ● టీనేజ్, యంగ్ అమ్మాయిలు బరువుగా ఉండే చీరలను ఇష్టపడరు. లైట్‌వెయిట్ చీరలు వారికి బాగా నప్పుతాయి ● ఏ పని అయినా చేతితో చేసిన దానికి మైండ్‌తో కనెక్షన్ ఉంటుంది. చేనేత చీరకు కూడా అంతే. చేనేత చీర పట్టుకున్నా, కట్టుకున్నా కలిగే ఆ ఫీల్‌ని ఆస్వాదించాల్సిందే ● రాబోయే తరాలకు మన సంప్రదాయాలను అందించాలంటే మన చేనేతలను కానుకగా ఇవ్వాలి. అప్పుడే మన చేనేతలు బతుకుతాయి ● పట్టు చీరలమీదకు ఉన్న ఆభరణాలన్నీ వేసుకోవాలనుకోకూడదు. ఏ అమ్మాయికైనా ఆమెలోని ఆత్మవిశ్వాసంతో ఉండే చిరునవ్వే సరైన జ్యువెలరీ. మనకు మనం ఎంత ప్రాముఖ్యం ఇచ్చుకుంటామో అదే ఆభరణం అవుతుంది. ఇక మెటల్ విషయానికి వస్తే.. బంగారు, కుందన్, టెంపుల్ జ్యువెలరీ కంచిపట్టు చీరల మీదకు బాగా నప్పతాయి. అయితే, మెడ మీదుగా కూడా క్లోజ్డ్‌గా ఉండే జ్యువెలరీ ధరిస్తే లుక్ మరింత బాగా కనిపిస్తుంది.

– భార్గవి కూనమ్, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

బామ్మల కాలం నాటి
పట్టు చీరల గొప్పతనం
ఇప్పుడూ కళ్లకు కట్టాలంటే
ఎవర్‌గ్రీన్‌గా నిలిచే
కంచిపట్టును పట్టుకోవాల్సిందే!
నాటి లుక్‌తో..
నేటి ప్యాటర్న్స్‌తో ఆకట్టుకునే
మనదైన వైభవం
సంప్రదాయ వేడుకల వేళ
నిండుగా, మెండుగా వెలిగిపోవాలంటే
కంచిపట్టును కమనీయంగా
కట్టుకోవాల్సిందే!
రాయల్ స్ఫూర్తిని రాబోయే తరాలకు
మరింత భద్రంగా అందించాల్సిందే!!



ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఎన్నో ఫ్యాషన్స్ వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, మన దక్షిణ భారతాన మాత్రం ఎప్పుడైనా వేడుక అనగానే కంజీవరం చీరలు మైండ్‌లో మెదులుతాయి. దేవాలయాలకు వెళ్లినప్పుడు, ఇంట్లో పూజల వేళ, ఇతర శుభకార్యాలకు పట్టు చీర కట్టుకోవడం సంప్రదాయంగా భావిస్తుంటాం. వేడుకల సమయాల్లో వృద్ధి చెందే పాజిటివ్‌నెస్‌ను మన శరీరం–మైండ్ గ్రహిస్తుంది. వేడుకను మరింత కళగా మార్చేస్తుంది. నాణ్యమైన జరీతో డిజైన్ చేసిన ఈ చీరలు మన బామ్మల కాలం నాటి లుక్‌లో కనిపిస్తుంటాయి. రంగుల కాంబినేషన్స్, పల్లూ, అంచు డిజైన్లలో నేటి కాలానికి అనుగుణంగా చిన్న చిన్న మార్పులు జత చేశారు.

పెంపకం

రాజూ బంటూ అమ్మే

చదరంగంలో
పావులు కదపాలంటే
బుద్ధికి బృహస్పతిలా ఉండాలి.
కాని ఆ బృహస్పతిని కని, పెంచడానికి
అమ్మ అమ్మలా ఉంటే చాలు.
అమ్మకు ఎత్తుకు పై ఎత్తు తెలియదు ప్రేమ తప్ప.
తన బిడ్డను రాజు చేయాలనే తపన తప్ప.
అందుకు తాను బంటుగా మారేందుకు
సిద్ధం కావడం తప్ప.
చెస్ వరల్డ్ కప్ 2023లో సంచలనంగా నిలిచిన
ఆర్. ప్రజ్ఞానందకు రాజుగా, బంటుగా ఉంటూ
తీర్చిదిద్దిన తల్లి నాగలక్ష్మి కథ ఇది.

అజర్‌బైజాన్‌లో జరిగిన 'చెస్ వరల్డ్ కప్ 2023' ఫైనల్స్‌లో ఒక అడుగు దూరంలో టైటిల్ కోల్పోయాడు 18 ఏళ్ల ప్రజ్ఞానంద. అతడు ఓడినా గెలిచినట్టే. ప్రపంచ దేశాల నుంచి 206 మంది గ్రాండ్ మాస్టర్లు పాల్గొన్న ఈ భారీ వరల్డ్ కప్‌లో ఇంత చిన్న వయసులో రన్నరప్‌గా నిలవడం సామాన్యం కాదు. కాకలు తీరిన యోధులను ఓడించి మరీ ఈ స్థానాన్ని దక్కించుకోవడమే కాదు దాదాపు 66 లక్షల రూపాయల ప్రైజ్ మనీ గెలుచుకున్నాడు. భారతదేశం గర్వించేలా చెస్‌లో వెలుగులీనుతున్న ఈ కుర్రవాడి విజయం వెనుక అతని తల్లి నాగలక్ష్మి ఉంది. అందుకే చెస్ అభిమానులే కాదు దేశదేశాల గ్రాండ్ మాస్టర్లు కూడా ప్రజ్ఞానందకు వెన్నంటి వుంటూ తోడ్పాటునందిస్తున్న నాగలక్ష్మిని ప్రశంసిస్తున్నారు. ఆమెను చూసి ముచ్చట పడుతున్నారు.


● తల్లి నాగలక్ష్మి


● కొడుకు ప్రజ్ఞానందతో నాగలక్ష్మి

టీవీ అలవాటు మాన్పించడానికి

చెన్నైలో స్థిరపడ్డ తెలుగు కుటుంబం రమేశ్ బాబు, నాగలక్ష్మిలకు కుమార్తె వైశాలి పుట్టాక ప్రజ్ఞానంద పుట్టాడు. ప్రజ్ఞానందకు నాలుగున్నర ఏళ్లు ఉన్నప్పుడు వైశాలి ఎక్కువగా టీవీ చూస్తున్నదని కూతురి ధ్యాస మళ్లించడానికి చెస్ బోర్డు తెచ్చి పెట్టింది నాగలక్ష్మి. వైశాలి చెస్ ఆడుతుంటే చిన్నారి ప్రజ్ఞా కూడా ఆడటం మొదలెట్టాడు. అతడు చెస్ నేర్చుకున్న పద్ధతి, అంత చిన్న వయసులో గెలుస్తున్న తీరు చూస్తే అతడు బాల మేధావి అని తల్లికి అర్థమైంది. మరోవైపు వైశాలి కూడా చెస్‌లో రాణించసాగింది. ఇక నాగలక్ష్మి తన జీవితాన్ని తన ఇద్దరు పిల్లల ఆట కోసం అంకితం చేయాలని నిశ్చయించుకుంది.

అనుక్షణం వెన్నంటే

ప్రజ్ఞానంద ఏడేళ్ల వయసుకే అండర్ సెవెన్‌లో జాతీయ టైటిల్ గెలిచాడు. పదేళ్ల వయసుకు ఇంటర్నేషనల్ ప్లేయర్ అయ్యాడు. 12 ఏళ్లకు గ్రాండ్ మాస్టర్ అయ్యాడు. అప్పుడైనా ఇప్పుడైనా ఉదయం నుంచి రాత్రి వరకూ చెన్నైలో వేరే దేశంలో అతని వెన్నంటే ఉంటుంది నాగలక్ష్మి. 'ప్రజ్ఞా ఏ పోటీకి వచ్చినా తోడుండే నాగలక్ష్మి ఒక మూల కూచుని దేవుణ్ణి ప్రార్థిస్తూ కూచోవడం మా అందరికీ అలవాటైన దృశ్యం' అంటాడు త్యాగరాజన్ అనే కోచ్. ఇతను చెస్‌లో ప్రజ్ఞాకు మొదటి పాఠాలు నేర్పాడు. 'ఉదయం పది నుంచి సాయంత్రం 7 వరకూ చెస్ పాఠాలు నడిచేవి. ఆ తర్వాత రెండు మూడు గంటల హోమ్‌వర్క్ ఇచ్చేవాణ్ణి. ప్రజ్ఞానంద ఇల్లు చేరాక ఆ హోమ్‌వర్క్ అయ్యేవరకు నాగలక్ష్మి తోడు ఉండేదట. రాత్రి పదికి ఇంటి పనులు మొదలెట్టుకుని మళ్లీ ఉదయం ఆరు గంటలకు కొడుకు కోసం నిద్ర లేచేదట' అని తెలిపాడు అతడు.

చెస్ తెలియని అమ్మ

కొడుకు చెస్‌లో ప్రపంచ విజేత స్థాయి ఆటగాడైనా నాగలక్ష్మికి ఇప్పటి వరకూ చెస్ ఆడటం తెలియదు. 'మా అబ్బాయిని చూసుకోవడమే నాకు సరిపోతుంది. ఆట ఎక్కడ నేర్చుకోను' అంటుందామె నవ్వుతూ. ప్రజ్ఞానంద శాకాహారి. బయటి ఆహారం తినడు. అందుకని ఏ ఊరికి ఆట కోసం బయలుదేరినా, విదేశాలకు ప్రయాణం కట్టినా నాగలక్ష్మి చేసే మొదటిపని లగేజ్‌లో ఒక ఇండక్షన్ స్టవ్వు, కుక్కరు, బియ్యం, మసాలాలు పెట్టుకోవడం. 'ఎక్కడకు వెళ్లినా వాడికి వేడివేడి అన్నం, రసం చేసి పెడతాను. మైండ్ హాయిగా ఉండి బాగా ఆడాలంటే నచ్చిన ఆహారం తీసుకోవాలి' అంటుంది నాగలక్ష్మి. చెస్ వరల్డ్ కప్ సెమీ ఫైనల్స్‌లో అమెరికా దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానాను ఓడించి ప్రజ్ఞానంద ఫైనల్స్‌కు చేరినప్పుడు నాగలక్ష్మి కళ్లల్లో కనిపించి మెరుపును ఎవరో ఫొటో తీస్తే ఆ ఫొటో వైరల్ అయ్యింది. 'మావాడు ఆట ఆడేంతసేపు వాడి కళ్లల్లో కళ్లు పెట్టి చూడను. ఎందుకంటే వాడి కళ్లు చూస్తే వాడి ఆట ఎలా సాగుతున్నదో నాకు తెలిసిపోతుంది. నాకు తెలిసిపోయినట్టుగా వాడికి తెలియడం నాకు ఇష్టం ఉండదు' అంటుంది నాగలక్ష్మి.

కార్ పార్కింగ్‌లో బంధువులు

కూతురు, కొడుకు ఇంట్లో చెస్ ప్రాక్టీస్ చేస్తుంటే ఇంటిని వీలైనంత నిశ్శబ్దంగా ఉంచుతుంది నాగలక్ష్మి. వాళ్లింట్లో టీవీ పెట్టే ఎంతో కాలమైపోతూ వుంది. 'మా ఇంటికి బంధువులొచ్చినా, స్నేహితులొచ్చినా కింద కార్ పార్కింగ్ దగ్గరే పలకరించి పంపేస్తాను... పిల్లలు డిస్టర్బ్ కాకూడదని' అంటుందామె. అందుకే సెమీ ఫైనల్స్ గెలిచిన ప్రజ్ఞాను అభినందిస్తూ రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ 'నీకు మీ అమ్మ ఇచ్చే మద్దతు ప్రత్యేకమైనది' అని ట్వీట్ చేశాడు.

నాగలక్ష్మి లాంటి తల్లి ప్రేమకు పిల్లలు ఎప్పుడూ బంట్లే. వారి మనసులో ఆ తల్లి ఎప్పుడూ రాణే.

●

వంటిల్లు

తియ్యటి అనురాగ బంధం

ఆడపడచులు అన్నదమ్ముల క్షేమాన్ని కోరుతూ ఎంతో ప్రేమానురాగాలతో వారి ముంజేతికి రాఖీ కట్టి, నోరు తీపి చేసే సంప్రదాయం రాకీ పండగది.
ప్రతి ఏటా జరుపుకునే ఈ వేడుకకు ముందుగానే వచ్చేసింది తియ్యటి వంటిల్లు మీకోసం ...





టఫెల్స్

కావలసినవి: బాదం పప్పు – కప్పు; ఎండు కొబ్బరి తురుము – ముప్పావు కప్పు; కర్జూరాలు – పదిహేను; బాదం బటర్ – ముప్పావు కప్పు; డార్క్ చాక్లెట్ ముక్కలు – పావు కప్పు; కొబ్బరి నూనె – అరటీస్పూను; బరకగా దంచిన పిస్తా పలుకులు – పావు కప్పు; బాదం పలుకులు – పావు కప్పు; నల్లని పొరతీసి తురిమిన ఎండు కొబ్బరి – పావు కప్పు; స్ట్రాబెరీ పొడి – పావు కప్పు.

తయారీ: ● కర్జూరాలను ఒకసారి కడిగి పదిహేను నిమిషాల పాటు వేడినీటిలో నానబెట్టుకోవాలి ● బాదం పప్పు, ఎండు కొబ్బరి తురుముని దోరగా వేయించి మిక్సీజార్‌లో వేయాలి ● నానబెట్టిన కర్జూరాలను నీరు లేకుండా తీసి మిక్సీజార్‌లో వేసి గ్రైండ్ చేయాలి ● సగం నలిగిన మిశ్రమంలో బాదం బటర్ వేసి గ్రైండ్ చేయాలి ● అవసరాన్ని బట్టి రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి ● ఇప్పుడు గ్రైండ్ అయిన మిశ్రమాన్ని బయటకు తీసిన నచ్చిన పరిమాణంలో లడ్డుల్లా చుట్టుకోవాలి ● బాదం, పిస్తా పలుకులను పొడిచేసి పక్కన పెట్టుకోవాలి ● చాక్లెట్‌ముక్కల్లో కొబ్బరి నూనెవేసి అవెన్‌లో 45 సెకన్లు ఉంచాలి. చాక్లెట్ కరిగిన తరువాత పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు ముందుగా చేసుకున్న లడ్డులాను ఒక్కొక్కటి ఎండుకొబ్బరి తురుము, పిస్తా, బాదం, స్ట్రాబెరీ పొడులు, చాక్లెట్ మిశ్రమంలో ముంచి అద్దుకుంటే ట్రఫెల్స్ రెడీ. రిఫ్రిజిరేటర్‌లో నిల్వచేసుకుంటే ఇవి పదిరోజులపాటు తాజాగా ఉంటాయి.



చమ్ చమ్

కావలసినవి

వెన్నతీయని ఆవుపాలు – నాలుగు కప్పులు; నిమ్మరసం – రెండు టేబుల్ స్పూన్లు; మైదా – టేబుల్ స్పూను; చక్కెర – ఒకటిన్నర కప్పులు; నీళ్లు – ఎనిమిది కప్పులు; యాలకులు – రెండు; నెయ్యి – టీస్పూను; పాలు – పావు కప్పు; క్రీమ్ – రెండు టేబుల్ స్పూన్లు; పాలపొడి – అరకప్పు; కుంకుమ పువ్వు కలిపిన పాలు – రెండు టేబుల్ స్పూన్లు; చక్కెర పొడి –టేబుల్ స్పూను; కొబ్బరి తురుము – పావు కప్పు; ట్యూటీఫ్రూటీ –మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● పాలను చక్కగా కాయాలి. కాచిన పాలల్లో నిమ్మరసం వేసి విరగగొట్టి.. పన్నీర్‌ను వేరు చేసి పక్కనపెట్టుకోవాలి ● అరగంట తరువాత పన్నీర్ మిశ్రమంలో మైదా వేసి ముద్దలా కలపాలి ● ముద్దను పొడవాటి రోల్స్‌లా చేసుకుని పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు పంచదారలో ఎనిమిది కప్పులు నీళ్లుపోసి 10 నిమిషాలు మరిగించాలి ● తరువాత యాలకులు, పన్నీర్ రోల్స్‌ను వేసి పదిహేను నిమిషాలు మరిగించి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి, పావు కప్పు పాలు పోసి మరిగించాలి ● రెండు నిమిషాల తరువాత క్రీమ్ వేసి కలపాలి. మిశ్రమం చిక్కబడిన తరువాత కుంకుమ పువ్వు కలిపిన పాలు, పంచదార పొడి వేసి ఉండలు లేకుండా కలుపుకోవాలి ● మిశ్రమం బాగా చిక్కబడినప్పుడు దించేస్తే కోవా రెడీ ● ఇప్పుడు సుగర్ సిరప్‌లో ఉడికించిన రోల్స్‌ను బయటకు తీసి మధ్యలో నిలువుగా గాటు పెట్టి చల్లారిన కోవా మిశ్రమాన్ని స్టఫ్ చేసి గాటుని మూసేయాలి ● ఈ రోల్స్‌కు కొబ్బరి తురుము అద్ది, పైన టూటీఫ్రూటీపెట్టాలి ● ఇలా అన్నీ రోల్స్‌ను చేస్తే చమ్‌చమ్ రెడీ.



నంఖాతై

కావలసినవి: మైదా – రెండున్నర కప్పులు; వంటసోడా – టీస్పూను; గడ్డకట్టిన నెయ్యి – ఒకటింబావు కప్పులు; పంచదార పొడి – కప్పు; సూజీ రవ్వ – అరకప్పు; యాలకులపొడి –టీస్పూను; బాదంపొడి – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తాపొడి – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తాపలుకులు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● మైదా, వంటసోడాను కలిపి జల్లెడ పట్టుకుని పక్కనపెట్టుకోవాలి ● పెద్దగిన్నెలో నెయ్యి, పంచదార పొడి వేసి పదిహేను నిమిషాల పాటు చక్కగా కలపాలి ● పంచదార చక్కగా కరిగి, మిశ్రమం దగ్గర పడినప్పుడు సూజీ రవ్వ, మైదా, బాదం, పిస్తా, యాలకులపొడి వేసి కలపాలి ● పిండిమిశ్రమాన్ని మెత్తని ముద్దలా కలపాలి. అవసరాన్ని బట్టి రెండు టీస్పూన్లు పాలుపోసి ముద్దచేయాలి ● పిండి ముద్దను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● పదిహేను నిమిషాల తరువాత బయటకు తీసి గుండ్రని ఉండలుగా చుట్టుకోవాలి ● ఈ ఉండలను నచ్చిన పరిమాణంలో మందంగా బిస్కెట్‌లా ఒత్తుకోవాలి ● ఒకదానికి ఒకటి అంటుకోకుండా ఒక్కో బిస్కెట్‌ను బేకింగ్‌ట్రేలో పెట్టి, పిస్తా పలుకులతో గార్నిష్ చేయాలి ● గార్నిష్ అయిన ట్రేను అవెన్‌లో ఇరవై నుంచి ఇరవై ఐదు నిమిషాలు ఉంచి తీసేస్తే వేడివేడి నంఖాతై రెడీ ● పేరిన నెయ్యితో చేస్తేనే ఈ నంఖాతై లు రుచిగా వస్తాయి.



క్యారట్ లడ్డు

కావలసినవి: క్యారట్ తురుము – రెండు కప్పులు; ఎండు కొబ్బరి తురుము – ఒకటిన్నర కప్పులు; కండెన్స్‌డ్ మిల్క్ – కప్పు; బాదం పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; రోజ్ వాటర్ – అరటీస్పూను; యాలకుల పొడి – అరటీస్పూను; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; పచ్చికొబ్బరి తురుమ – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● రెండు స్పూన్ల నెయ్యివేసి కొబ్బరి తురుముని ఐదు నిమిషాలపాటు దోరగా వేయించాలి ● కొబ్బరి వేగిన తరువాత క్యారట్ తురుము వేసి మీడియం మంట మీద పదినిమిషాలు వేయించాలి ● ఇప్పుడు బాదం పలుకులు, కండెన్స్‌డ్ మిల్క్ వేసి కలపాలి ● ఐదు నిమిషాల తరువాత రోజ్ వాటర్. యాలకులపొడి వేసి సన్నని మంట మీద తిప్పుతూ మగ్గనివ్వాలి ● మిశ్రమం చిక్కబడిన తరువాత దించేసి చల్లారనివ్వాలి ● ఇప్పుడు చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని చల్లారిన మిశ్రమాన్ని లడ్డుల్లా చుట్టుకుని,పైన కొద్దిగా పచ్చికొబ్బరితో గార్నిష్ చేసి సర్వ్‌చేసుకోవాలి.



రసగుల్లా ఐస్‌క్రీమ్

కావలసినవి: వెనీలా ఐస్‌క్రీమ్ – నాలుగు కప్పులు; రసగుల్లాలు – ఎనిమిది; స్ట్రాబెరీ – ఆరు; బాదం పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● గడ్డకట్టిన ఐస్‌క్రీమ్‌ను రిఫ్రిజిరేటర్ నుంచి తీసి పదినిమిషాలు బయటపెట్టాలి ● రసగుల్లాలను గట్టిగా పిండి సిరప్‌ను తీసేయాలి. పూర్తిగా పిండకూడదు. కొద్దిగా సిరప్ తేమ ఉండేలా పిండాలి ● పిండిన రసగుల్లాలను చిన్నచిన్న ముక్కలు చేయాలి ● స్ట్రాబెర్రీలను కూడా కడిగి సన్నగా తరగాలి ● ఇప్పుడు ఐస్‌క్రీమ్‌లో రసగుల్లా ముక్కలు వేసి కలపాలి ● దీనిలో స్ట్రాబెరీ ముక్కలు, బాదం పలుకులు వేసి మరోసారి చక్కగా కలపాలి ● ఈ ఐస్ క్రీమ్ మిశ్రమాన్ని గిన్నెలో వేసి మూతపెట్టి రాత్రంతా లేదా కనీసం నాలుగు గంటల పాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి ● రిఫ్రిజిరేటర్‌లో నుంచి తీసిన పదిహేను నిమిషాల తరువాత రసగుల్లా ఐస్‌క్రీమ్‌ను సర్వ్‌చేసుకోవాలి.



తెలుగు సినిమా...

ఎత్తర జెండా

సినిమా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు



హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్ఆర్ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్ఆర్ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్ఆర్ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్ఆర్ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు..నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.



విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)



ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)



కృతీసనన్ (మిమీ)

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) – కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్ఆర్ఆర్ – ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్ఆర్ఆర్ –ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్ఆర్ఆర్ – కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్ఆర్ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్ఆర్ఆర్- శ్రీనివాస మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ – మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ – సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ, ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా – ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో – గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్-ద రెజొనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్ఆర్ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జీలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్థన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీసింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కొకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బోనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.

– వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. – చిరంజీవి

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్ఆర్ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్ఆర్ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.

– రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. – కీరవాణి

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. – ఆలియా భట్.

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. – అల్లు అరవింద్

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్ఆర్ఆర్ సిక్సర్



కీరవాణి • శ్రీనివాస్ మోహనన్ • కాలభైరవ • ప్రేమ్ రక్షిత్ • కింగ్ సాల్మన్



దేవిశ్రీ ప్రసాద్



చంద్రబోస్



పురుషోత్తమాచార్యులు



బుచ్చిబాబు



కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

ఇదొక చరిత్ర

– నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.

– **నవీన్ యెర్నేని**, నిర్మాత

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్టాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.

– **వై. రవిశంకర్**, నిర్మాత

"నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి" అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. "రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం" అన్నారు.


– **బుచ్చిబాబు సన**, దర్శకుడు

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి యార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను – ఎంఎం శ్రీలేఖ



"ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం" అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరఫున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ – "మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను" అన్నారు.

ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతిశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెల్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
181	57
65,252	19,387

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,945	▽	201
డోజోన్స్	34,241	▽	232
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,334	△	13
డాక్స్	15,621	▽	107
షాంఘై	3,082	△	4
నికాయ్	32,287	△	227

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్)	58,734	△	214
బంగారం (22 క్యారెట్)	58,499	△	213
వెండి (కిలో)	73,667	△	988

3 రోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: వరుసగా నాలుగో రోజు హుషారుగా ప్రారంభమైన దేశీ స్టాక్ మార్కెట్లు మిడ్ సెషన్ నుంచీ దెబ్బతిన్నాయి. కొనుగోళ్ల స్థానే అమ్మకాలు ఊపందుకోవడంతో లాభాలను వీడి నష్టపోయాయి. చివరికి సెన్సెక్స్ 181 పాయింట్లు క్షీణించి 65,252 వద్ద నిలిచింది. నిఫ్టీ 57 పాయింట్లు తగ్గి 19,387 వద్ద ముగిసింది. సెన్సెక్స్ తొలుత 481 పాయింట్లవరకూ జంప్‌చేసి 65,914కు చేరింది. చివర్లో 65,182 వరకూ పతనమైంది. నిఫ్టీ సైతం 19,584 వద్ద గరిష్టాన్నీ, 19,369 కనిష్టాన్నీ తాకింది. ప్రపంచ మార్కెట్ల ప్రోత్సాహంతో ఇండెక్సులు తొలుత లాభపడినప్పటికీ తదుపరి లాభాల స్వీకరణ ప్రభావం చూపింది.

తొలుత లాభాలు.. తుదకు నష్టాలు

- సెన్సెక్స్ 181, నిఫ్టీ 57 పాయింట్లు డౌన్
- 65,252–19,387 వద్ద ముగింపు
- తొలుత సెన్సెక్స్ 481 పాయింట్లు అప్

ఐటీ లాభాల్లో..

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆయిల్, హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్ రంగాలు 0.6 శాతం చొప్పున నీరసించగా.. ఐటీ ఇదేస్థాయిలో బలపడింది. నిఫ్టీ దిగ్గజాలలో ఆర్ఐఎల్, దివీస్, పవర్‌గ్రిడ్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, టాటా స్టీల్, గ్రాసిమ్, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఆటో, ఐషర్, సిప్లా, హెచ్‌సీఎల్ టెక్ 2–1 శాతం మధ్య నీరసించాయి. అయితే బీపీసీఎల్, ఏషియన్ పెయింట్స్, ఇండస్‌ఇండ్, ఇన్ఫోసిస్, బ్రిటానియా 2–1 % మధ్య ఎగశాయి.

చిన్న షేర్లు ప్లస్‌లో

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ స్వల్పలాభాలతో నిలదొక్కుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1,890 డీలాపడగా.. 1,731 లాభపడ్డాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 1,525 కోట్లు, దేశీ ఫండ్స్ మరింత అధికంగా రూ. 5,797 కోట్ల చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

ఏరోఫ్లెక్స్ సూపర్‌హిట్



స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లెక్సిబుల్ హోస్ తయారీ కంపెనీ ఏరోఫ్లెక్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్‌ను సాధించింది. చివరిరోజు గురువారాని(24)కల్లా ఇష్యూకి ఏకంగా 97 రెట్లు అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 162 కోట్ల విలువైన ఈక్విటీ జారీతో పాటు మరో 1.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఇందుకు షేరుకి రూ. 102–108 ధరల శ్రేణిని ప్రకటించింది. తద్వారా రూ. 351 కోట్లు సమకూర్చుకుంది.

నాలుగో రోజూ 'జియో' పతనం



వరుసగా లోయర్ సర్క్యూట్లను తాకుతున్న ఎన్‌బీఎఫ్‌సీ.. జియో ఫైనాన్షియల్ కౌంటర్లో నాలుగో రోజూ అమ్మకాలదే పైచేయిగా నిలిచింది. దీంతో బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో మరోసారి 5 శాతం పతనమై లోయర్ సర్క్యూట్లను తాకింది. బీఎస్‌ఈలో రూ. 11 క్షీణించి రూ. 216 వద్ద, ఎన్‌ఎస్‌ఈలోనూ రూ. 11 తగ్గి రూ. 214 దిగువన ముగిసింది. దీంతో గత నాలుగు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ. 22,777 కోట్లు ఆవిరైంది. తాజాగా రూ. 1,37,167 కోట్లకు చేరింది. మరోపక్క మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు సైతం దాదాపు 2 శాతం నష్టంతో రూ. 2,479 దిగువన నిలిచింది.



చంద్రయాన్ షేర్లు భళా

రెండో రోజూ మెరుపులు

చంద్రయాన్‌-3 మిషన్ విజయం నేపథ్యంలో ఏరోస్పేస్, డిఫెన్స్ షేర్లకు డిమాండ్ కొనసాగింది. చంద్రయాన్‌కు పరికరాలు అందించిన కంపెనీల షేర్లు వరుసగా రెండో రోజు భారీ లాభాలు ఆర్జించాయి. సెంటమ్ ఎలక్ట్రానిక్స్, పరస్ డిఫెన్స్, ఎంటార్ టెక్ తొలుత 20–10 శాతం మధ్య దూసుకెళ్లాయి. చివరికి ఎన్‌ఎస్‌ఈలో సెంటమ్ 8 శాతం, పరస్ 7 శాతం, ఎంటార్ 4 శాతం, భారత్ ఫోర్జ్ 0.6 శాతం చొప్పున లాభపడి ముగిశాయి. బుధవారం సైతం ఈ కౌంటర్లు జోరు చూపిన సంగతి తెలిసిందే. అయితే ఆస్ట్రా మైక్రోవేవ్, మిధాని, బీహెచ్‌ఈఎల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌ఏఎల్ తొలుత లాభపడి చివర్లో నీరసించాయి.

టీవీఎస్ ఎక్స్ ఎలక్ట్రిక్ క్రాస్‌ఓవర్

ధర రూ. 2.50 లక్షలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ కంపెనీ టీవీఎస్ మోటార్ తాజాగా ప్రీమియం ఎలక్ట్రిక్ క్రాస్ ఓవర్ టీవీఎస్ ఎక్స్ ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్ ధర రూ.2,49,990 ఉంది. ప్రస్తుతం దేశంలో ఇదే ఖరీదైన ఎలక్ట్రిక్ స్కూటర్ కావడం విశేషం. టీవీఎస్ ఎక్స్‌లెటన్ ప్లాట్‌ఫామ్‌పై తయారైంది. 4.44 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. గంటకు 40 కిలోమీటర్ల వేగాన్ని 2.6 సెకన్లలో అందుకుంటుంది. గరిష్ఠ వేగం గంటకు 105 కిలోమీటర్లు. భారత్‌లో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్‌తో రూపుదిద్దుకున్న తొలి ఈ–స్కూటర్ ఇదే. 10.25 అంగుళాల హెచ్‌డీ ప్లస్ టీఎఫ్‌టీ టచ్‌స్క్రీన్ ఏర్పాటు ఉంది. రివర్స్ అసిస్ట్, క్రూజ్ కంట్రోల్, హిల్ హోల్డ్ ఫంక్షన్, 19 లీటర్ల స్టోరేజ్ స్పేస్ వంటి హంగులు ఉన్నాయి. 2023 నవంబర్ నుంచి డెలివరీలు ఉంటాయి.

కోఫోర్జ్ నుంచి బీపీఈఏ ఔట్

26.63 శాతం వాటా విక్రయం



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ కోఫోర్జ్ లిమిటెడ్(గతంలో నిట్ టెక్నాలజీస్) నుంచి పీఈ సంస్థ బీపీఈఏ(బేరింగ్ పీఈ ఏషియా) ఈక్విటీ తాజాగా వైదొలగింది. అనుబంధ సంస్థ హల్స్ట్ బీవీ ద్వారా ఐటీ కంపెనీలోగల మొత్తం 26.63 శాతం వాటాను రూ. 7,683.5 కోట్లకు విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 4,722.15 సగటు ధరలో మొత్తం 1,62,71,260 షేర్లను అమ్మివేసింది. వాటాను కొనుగోలు చేసిన మ్యూచువల్ ఫండ్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ, ఏబీ సన్ లైఫ్, కొటక్ మహీంద్రా, ఎస్‌బీఐతోపాటు.. మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్, సొసైటీ జనరాలి, ఐసీఐసీఐ ప్రులైఫ్, స్మాల్‌క్యాప్ వరల్డ్ ఫండ్ ఉన్నాయి.

ఈ వార్తల నేపథ్యంలో కోఫోర్జ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 9.4 శాతం దూసుకెళ్లి రూ. 5,375 వద్ద ముగిసింది.

యూపీఐ లైట్ 'పరిమితి' పెంపు



ముంబై: యూపీఐ లైట్ వాలెట్ వినియోగాన్ని మరింత ప్రోత్సహించే దిశగా రిజర్వ్ బ్యాంక్ చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రతి ఆఫ్‌లైన్ చెల్లింపు లావాదేవీ పరిమితిని ప్రస్తుతమున్న రూ. 200 నుంచి రూ. 500కు పెంచింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై చిన్న మొత్తాల చెల్లింపును వేగవంతం చేసేందుకు 2022 సెప్టెంబర్‌లో యూపీఐ లైట్‌ను ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్ అంతంత మాత్రంగా ఉండే ప్రాంతాలు, అలాగే అసలు నెట్ ఉండని ప్రదేశాల్లో కూడా రిటైల్ డిజిటల్ చెల్లింపు లావాదేవీల నిర్వహణకు ఇది ఉపయోగపడుతుంది. అలాగే, బ్యాంకుల ప్రాసెసింగ్ వ్యవస్థలపై కూడా భారం తగ్గించడం వల్ల లావాదేవీలు విఫలమయ్యే అవకాశాలు కూడా గణనీయంగా తగ్గుతాయి. ప్రస్తుతం దీని ద్వారా నెలకు 1 కోటికి పైగా లావాదేవీలు జరుగుతున్నాయి.

ఇన్ఫోసిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా రఫేల్ నాదల్



న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్‌కు, ఆ సంస్థకే చెందిన డిజిటల్ ఇన్నోవేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా అంతర్జాతీయ టెన్నిస్ స్టార్ రఫేల్ నాదల్ నియమితులయ్యారు. మూడేళ్ల పాటు ఈ భాగస్వామ్యం అమల్లో ఉంటుంది. ఈ సందర్భంగా ఇన్ఫీ, నాదల్ కోచింగ్ టీమ్ కలిసి కృత్రిమ మేధ ఆధారిత మ్యాచ్ అనాలిసిస్ టూల్‌ను అభివృద్ధి చేయనున్నాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. వ్యక్తులు, వ్యాపార దిగ్గజాలు ఎప్పటికప్పుడు మారే పరిస్థితులకు అనుగుణంగా తమను తాము మల్చుకుంటూ, ముందుకు ఎలా సాగాలనేది తెలుసుకునేందుకు నాదల్ చక్కని నిదర్శనమని సంస్థ సీఈవో సలిల్ పరేఖ్ తెలిపారు. ఇన్ఫోసిస్ డిజిటల్ రంగంలో తనకున్న అనుభవంతో టెన్నిస్ క్రీడకు కూడా సేవలు అందించే తీరు తనకు నచ్చిందని నాదల్ పేర్కొన్నారు.

స్వల్పంగా పెరిగిన టెలికం యూజర్లు



న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య జూన్‌లో స్వల్పంగా పెరిగి 117.38 కోట్లకు చేరింది. రిలయన్స్ జియోకి 22.7 లక్షల మంది, భారతీ ఎయిర్‌టెల్‌కు 14 లక్షల మంది యూజర్లు కొత్తగా జతయ్యారు. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం మే ఆఖరు నాటికి టెలిఫోన్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 117.25 కోట్లుగా ఉంది. మరోవైపు, వొడాఫోన్ ఐడియా (వీఐఎల్), ప్రభుత్వ రంగ బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్ యూజర్లు తగ్గారు. బీఎస్‌ఎన్‌ఎల్ సబ్‌స్క్రయిబర్స్ 18.7 లక్షల మంది, వీఐఎల్ 12.8 లక్షల మంది, ఎంటీఎన్‌ఎల్ 1.52 లక్షల మంది యూజర్లను కోల్పోయాయి. జియో 2.08 లక్షలు, భారతీ ఎయిర్‌టెల్ 1.34 లక్షలు, వీ–కాన్ మొబైల్ అండ్ ఇన్‌ఫ్రా 13,100 కలెక్షన్లు నమోదు చేసుకున్నాయి.

కార్పొరేట్లకు 'హిండెన్‌బర్గ్' తరహా షాక్!

నిర్దిష్ట కంపెనీల అవకతవకలు బయటపెట్టనున్న ఓసీసీఆర్‌పీ

న్యూఢిల్లీ: కొద్ది నెలల క్రితం పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్‌ను కుదిపేసిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తరహాలో మరో సంస్థ దేశీ కార్పొరేట్ గ్రూప్‌ల అవకతవకలను బయటపెట్టేందుకు సిద్ధమవుతోంది. రాక్‌ఫెలర్ బ్రదర్స్ ఫండ్, జార్జ్ సొరోస్ వంటి దిగ్గజాల దన్ను గల ఓసీసీఆర్‌పీ (ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు) సన్నద్ధమవుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. యూరప్, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వ్యాప్తంగా ఉన్న 24 లాభాపేక్షరహిత ఇన్వెస్టిగేటివ్ సంస్థలు కలిసి ఈ పరిశోధనాత్మక రిపోర్టింగ్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసినట్లు వివరించాయి. అవి త్వరలోనే ఏదైనా నివేదిక లేదా వరుస కథనాలను ప్రచురించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ముందుగా ఒక నిర్దిష్ట కార్పొరేట్ కంపెనీలో విదేశీ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడానికి సంబంధించిన అవకతవకలను బయటపెట్టవచ్చని సంబంధిత వర్గాలు వివరించాయి. అయితే సదరు కార్పొరేట్ సంస్థ పేరును మాత్రం వెల్లడించలేదు. 2006లో ఏర్పాటైన ఓసీసీఆర్‌పీ వెబ్‌సైట్ ప్రకారం సంఘటిత నేరాలను శోధించడం సంస్థ ప్రత్యేకత. ఇన్వెస్టర్ జార్జ్ సొరోస్‌కి చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్, ఫోర్డ్ ఫౌండేషన్, ఓక్ ఫౌండేషన్, రాక్‌ఫెల్లర్ బ్రదర్స్ ఫండ్ మొదలైనవి దీనికి నిధులు సమకూరుస్తున్నాయి.

రూపాయి మూడో రోజూ అప్

16 పైసలు లాభం; 82.56 వద్ద క్లోజింగ్



ముంబై: క్రూడాయిల్ రేట్లు తగ్గుతుండటం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడంతో రూపాయి వరుసగా మూడో రోజూ బలపడింది. డాలర్‌తో పోలిస్తే 16 పైసలు పెరిగి 82.56 వద్ద ముగిసింది. దీంతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 83.11 నుంచి మూడు సెషన్లలో 57 పైసలు పెరిగినట్లయింది. బ్రిక్స్ సదస్సు, అమెరికా ఫెడ్ రిజర్వ్ చైర్మన్ పావెల్ వడ్డీ రేట్ల తీరు నేపథ్యంలో డాలర్ కదలికలు పరిమితంగా ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-8-2023	
విశాఖ	480–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
24-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	435–00
వరంగల్	437–00
రిటైల్ ధర	4.95

సాక్షి స్పోర్ట్స్

భారత్‌కు మరో ఒలింపిక్ బెర్త్



ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్ మహిళల ట్రాప్ ఈవెంట్‌లో భారత షూటర్ రాజేశ్వరి కుమారి ఐదో స్థానంలో నిలిచింది. అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరుగుతున్న ఈ టోర్నీలో ఆరుగురు షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో రాజేశ్వరి 19 పాయింట్లు సాధించింది. రాజేశ్వరి ప్రదర్శనతో భారత్‌కు ఈ విభాగంలో పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారైంది. ఇప్పటివరకు షూటింగ్ క్రీడాంశంలో భారత్‌కు ఏడు ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి.

మూడో రౌండ్‌లో అంకిత రైనా



యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. న్యూయార్క్‌లో గురువారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ 182వ ర్యాంకర్ అంకిత 6-4, 6-3తో ప్రపంచ 114వ ర్యాంకర్ అలియోనా బొల్సోవా (స్పెయిన్)పై గెలిచింది.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ



కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్‌-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్‌-చిరాగ్ ద్వయం 21–15, 19–21, 21–9తో లియో రాలీ కార్నండొ–డానియెల్ మార్టిన్ (ఇండోనేసియా) జోడీపై నెగ్గింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ 14–21, 9–21తో టాప్ సీడ్ చెన్ క్వింగ్ చెన్–జియా యి ఫ్యాన్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తొమ్మిదో సీడ్ ప్రణయ్ (భారత్) 21–18, 15–21, 21–19తో 2021 ప్రపంచ చాంపియన్ లో కియాన్ యూ (సింగపూర్)పై సంచలన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ చేరగా... లక్ష్య సేన్ (భారత్) 14–21, 21–16, 13-21తో మూడో సీడ్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఫైనల్లో పారుల్



బుడాపెస్ట్ (హంగేరి): ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో భారత అథ్లెట్ పారుల్ చౌధరీ ఫైనల్‌కు అర్హత సాధించింది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన హీట్స్‌లో పారుల్ ఐదో స్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. రెండో హీట్‌లో పోటీపడ్డ పారుల్ తన అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. పారుల్ 9 నిమిషాల 24.29 సెకన్లలో గమ్యానికి చేరి ఐదో స్థానంలో నిలిచింది. మొత్తం మూడు హీట్స్ నిర్వహించారు. ప్రతి హీట్‌లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత పొందారు. ఫైనల్ ఆదివారం జరుగుతుంది.

మరోవైపు పురుషుల లాంగ్‌జంప్ ఈవెంట్ ఫైనల్లో భారత అథ్లెట్ జెస్విన్ ఆల్డ్రిన్ నిరాశపరిచాడు. 12 మంది పాల్గొన్న ఫైనల్లో జెస్విన్ తొలి రెండు ప్రయత్నాల్లో ఫౌల్ చేశాడు. మూడో ప్రయత్నంలో 7.77 మీటర్ల దూరం దూకి 11వ స్థానంలో నిలిచాడు.

టైటిల్ కార్ల్‌సన్‌కు... ప్రశంసలు ప్రజ్ఞానందకు

ప్రపంచకప్ చెస్ టోర్నీ రన్నరప్‌గా భారత గ్రాండ్‌మాస్టర్ • తొలిసారి ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన నార్వే చెస్ దిగ్గజం

గత దశాబ్దకాలంగా పురుషుల చెస్‌లో మాగ్నస్ కార్ల్‌సన్‌కు ఎదురులేదు. ఈ నార్వే సూపర్‌స్టార్ క్లాసికల్, ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు. చెస్‌లో అత్యుత్తమ రేటింగ్ కూడా అందుకున్నాడు. అయితే అగ్రశ్రేణి చెస్ ఆటగాళ్ల మధ్య రెండేళ్లకోసారి నాకౌట్ పద్ధతిలో జరిగే ప్రపంచకప్ టోర్నీలో మాత్రం కార్ల్‌సన్ శిఖరాన నిలువలేకపోయాడు. ఈసారి మాత్రం నిలకడైన ఆటతీరుతో కార్ల్‌సన్ తన కెరీర్‌లో తొలిసారి ప్రపంచకప్ టైటిల్‌ను సాధించాడు. కార్ల్‌సన్‌కు టైటిల్ దక్కినా అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందనే. తన అసమాన పోరాటపటిమతో... ఊహకందని ఎత్తులతో... తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థులను బోల్తా కొట్టిస్తూ... తమిళనాడుకు చెందిన 18 ఏళ్ల ఈ టీనేజర్ రెండో ప్రయత్నంలోనే ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరాడు. కార్ల్‌సన్‌కు ఆద్యంతం గట్టిపోటీనిచ్చాడు. అనుభవలేమితో తుది మెట్టుపై తడబడ్డా... భవిష్యత్‌లో ప్రపంచ చాంపియన్ అయ్యే లక్షణాలు తనలో పుష్కలంగా ఉన్నాయని ప్రజ్ఞానంద చాటుకున్నాడు.



కార్ల్‌సన్ / ప్రజ్ఞానంద

బాకు (అజర్‌బైజాన్): ఇన్నాళ్లూ భారత చెస్ అంటే ముందుగా విశ్వనాథన్ ఆనంద్ పేరు గుర్తుకొచ్చేది. కానీ ఇక నుంచి ఆనంద్‌తోపాటు తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద పేరు కూడా అభిమానుల మదిలో మెదులుతుంది. గత 25 రోజులుగా అజర్‌బైజాన్ రాజధాని బాకులో జరిగిన ప్రపంచకప్ టోర్నీలో ఆరంభం నుంచి మేటి ఆటగాళ్లను మట్టికరిపించిన ఈ తమిళనాడు కుర్రాడు తుదిపోరులో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌ను బోల్తా కొట్టించలేకపోయాడు. నిర్ణీత రెండు క్లాసికల్ గేముల్లో ప్రజ్ఞానంద నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొని 'డ్రా'తో సంతృప్తి పడ్డ 32 ఏళ్ల కార్ల్‌సన్ టైబ్రేక్‌లోని ర్యాపిడ్ గేముల్లో తన అనుభవాన్నంతా ఉపయోగించి గట్టెక్కాడు. తొలి గేమ్‌లో నల్ల పావులతో ఆడిన కార్ల్‌సన్ 47 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై గెలుపొంది... రెండో గేమ్‌లో తెల్ల పావులతో ఆడి 22 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని ఓవరాల్‌గా 2.5–1.5తో విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన కార్ల్‌సన్ 156 మంది ఆటగాళ్ల మధ్య నాకౌట్ పద్ధతిలో నిర్వహించే ప్రపంచకప్ టోర్నీలో మాత్రం తొలిసారి విజేతగా నిలిచాడు. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా) 3–1తో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)పై గెలిచాడు.

విజేతగా నిలిచిన కార్ల్‌సన్‌కు 1,10,000 డాలర్లు (రూ. 90 లక్షలు), రన్నరప్ ప్రజ్ఞానందకు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షలు), మూడో స్థానం పొందిన కరువానాకు 60 వేల డాలర్లు (రూ. 49 లక్షలు)... నాలుగో స్థానంతో నిలిచిన అబసోవ్‌కు 50 వేల డాలర్లు (రూ. 41 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఈ ప్రపంచకప్ టోర్నీలో టాప్‌-3లో నిలిచిన ముగ్గురు ప్లేయర్లు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్ టోర్నీకి అర్హత సాధించారు. తనకు సరైన పోటీనిచ్చేవారు లేకపోవడంతో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఆసక్తి లేదని గత ఏడాది ప్రకటించిన కార్ల్‌సన్ క్యాండిడేట్ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. దాంతో రన్నరప్ ప్రజ్ఞానంద, కరువానా, అబసోవ్ క్యాండిడేట్ టోర్నీకి అర్హత పొందారు. క్యాండిడేట్ టోర్నీ విజేత ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఆడతారు.

ఒక్కో రౌండ్ దాటి...

2019 ప్రపంచకప్‌లో తొలిసారి బరిలోకి దిగిన ప్రజ్ఞానంద నాలుగో రౌండ్‌లో వెనుదిరిగాడు. ఈసారి మాత్రం ఈ తమిళనాడు కుర్రాడు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ టోర్నీ చరిత్రలో ఫైనల్ చేరిన రెండో భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ నుంచి ఓపెన్ విభాగంలో పది మంది గ్రాండ్‌మాస్టర్లు పోటీపడగా ఒకరు ఫైనల్‌కు, మరో ముగ్గురు క్వార్టర్ ఫైనల్‌కు చేరడం విశేషం.

- 2690 రేటింగ్‌తో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 29వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానందకు తొలి రౌండ్‌లో 'బై' లభించింది.
- రెండో రౌండ్‌లో 2599 రేటింగ్ ఉన్న ఫ్రాన్స్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమి లగార్డె (ఫ్రాన్స్)పై 1.5-0.5తో గెలిచాడు.
- మూడో రౌండ్‌లో చెక్ రిపబ్లిక్ గ్రాండ్‌మాస్టర్, 2689 రేటింగ్ ఉన్న డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)ను ప్రజ్ఞానంద ఓడించాడు.
- నాలుగో రౌండ్‌లో ప్రజ్ఞానంద ప్రపంచ రెండో ర్యాంకర్, 2787 రేటింగ్ ఉన్న హికారు నకమురా (అమెరికా)పై టైబ్రేక్‌లో 3-1తో సంచలన విజయం సాధించాడు.
- ఐదో రౌండ్‌లో 1.5-0.5తో ఫెరెంక్ బెర్కెస్ (హంగేరి)పై గెలిచాడు.
- క్వార్టర్ ఫైనల్లో ప్రజ్ఞానంద భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్, 2710 రేటింగ్ ఉన్న ఇరిగేశి అర్జున్‌పై టైబ్రేక్‌లో 5-4తో సంచలన విజయం సాధించాడు.
- ప్రపంచ మూడో ర్యాంకర్, 2782 రేటింగ్ ఉన్న ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన సెమీఫైనల్లో ప్రజ్ఞానంద టైబ్రేక్‌లో 3.5-2.5తో గెలుపొంది ఫైనల్ చేరాడు.

భారత రెజ్లింగ్ సమాఖ్యపై వేటు

న్యూఢిల్లీ: ఇటీవల అత్యంత వివాదాస్పద క్రీడా సమాఖ్యగా వార్తల్లో నిలుస్తున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై మరో పిడుగు పడింది! 45 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగించకుండా పదేపదే వాయిదా వేయడంతో సమాఖ్యపై యునైటెడ్ రెజ్లింగ్ వరల్డ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుతం డబ్ల్యూఎఫ్ఐ రోజువారీ వ్యవహారాలను అడ్‌హాక్ కమిటీ నిర్వహిస్తోంది. తాజా సస్పెన్షన్‌తో భారత రెజ్లర్లకు పెద్ద చిక్కే వచ్చిపడింది. వాళ్లు పోటీపడేందుకు ఇబ్బంది లేకపోయినా ... అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పతకం గెలిస్తే మన త్రివర్ణ పతాకం ఎగురదు. భారత రెజ్లర్లు యూడబ్ల్యూడబ్ల్యూ జెండా కింద పోటీ పడాల్సి ఉంటుంది. వచ్చే నెల 16 నుంచి జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా బరిలోకి దిగుతారు. వాస్తవానికి గత జూలై 11న డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు జరగాలి. అయితే గువాహటి హైకోర్టు స్టే విధించడంతో వాయిదా పడ్డాయి. అనంతరం ఆగస్టు 7కు మరో వాయిదా! అంతలోనే మళ్లీ 12కు జరిపారు. సరిగ్గా ఎన్నికలకు ఒక రోజు ముందు పంజాబ్–హరియాణా హైకోర్టు స్టే కారణంగా 12న జరగాల్సిన ఎన్నికలు కూడా వాయిదా పడ్డాయి.

ఫిట్‌నెస్‌పైనే దృష్టి

భారత క్రికెటర్లకు ప్రత్యేక శిబిరం



బెంగళూరు: ఆసియా కప్‌కు ముందు ఆరు రోజుల స్వల్పకాలిక శిక్షణా శిబిరంలో భారత క్రికెటర్లు చెమటోడుస్తున్నారు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో జరుగుతున్న ఈ శిబిరంలో ఫిట్‌నెస్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. జట్టు సభ్యులందరికీ సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు కీలకమైన 'యో–యో టెస్టు' కూడా నిర్వహించనున్నారు. బీసీసీఐ 16.5 పాయింట్లను యో–యో టెస్టు ఉత్తీర్ణత మార్క్‌గా గుర్తించింది. గురువారం కెప్టెన్ రోహిత్ శర్మ, కోహ్లి, హార్దిక్ పాండ్యాలు ఈ టెస్టులో పాల్గొన్నట్లు సమాచారం. వీరి ఫలితాలను అధికారికంగా ప్రకటించకపోయినా... 17.2 పాయింట్లతో తాను పాస్ అయినట్లు కోహ్లి సోషల్ మీడియాలో వెల్లడించాడు. అయితే అందరి దృష్టి కేఎల్ రాహుల్‌పైనే నిలిచింది . గాయం నుంచి కోలుకొని ఆసియా కప్ జట్టులోకి ఎంపికైనా, అతను కొంత 'అసౌకర్యం'తో ఉన్నట్లు సెలక్టర్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడం అతనికి ఎంతో ముఖ్యం. ఐర్లాండ్ పర్యటన నుంచి ఇంకా భారత్‌కు చేరుకోని బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, సామ్సన్, తిలక్ మినహా మిగతా జట్టు సభ్యులంతా ఎన్‌సీఏలో ఉన్నారు.

పాకిస్తాన్‌దే సిరీస్

హంబన్‌టోటా: అఫ్గానిస్తాన్‌తో రెండో వన్డేలో ఒక వికెట్ తేడాతో నెగ్గిన పాకిస్తాన్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సొంతం చేసుకుంది. రెండో వన్డేలో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. ఓపెనర్ గుర్బాజ్ (151; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. ఓపెనర్ ఇబ్రహీమ్ జద్రాన్ (80; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి తొలి వికెట్‌కు 227 పరుగులు జోడించాడు. అనంతరం పాకిస్తాన్ 49.5 ఓవర్లలో 9 వికెట్లకు 302 పరుగులు చేసి గెలిచింది. ఇమామ్ ఉల్ హఖ్ (91; 4 ఫోర్లు), షాదాబ్ ఖాన్ (48; 3 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ ఆజమ్ (53; 6 ఫోర్లు) రాణించారు.

క్లుప్తంగా...

గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణం శుభపరిణామం

- ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణం శుభ పరిణామమని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ హర్షం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా చినమేడలపల్లి వద్ద కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా శుక్రవారం దీనికి శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో శంకర్‌నాయక్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. విభజన హామీల సాధనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి గిరిజన విశ్వ విద్యాలయ నిర్మాణమే నిదర్శనమన్నారు. నాలుగేళ్లలో పోర్టులు, మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టిన సీఎం వైఎస్ జగన్ కేంద్ర సంస్థలను కూడా సాధించడంలో ఫలప్రదమయ్యారని కొనియాడారు.

29న ఢిల్లీలో పోలవరంపై కీలక భేటీ

- 32 గ్రామాల నిర్వాసితుల పునరావాసానికి రూ.5,124 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించి.. తొలి దశ పనులను పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఈ నెల 29న ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా, పీపీఏ సీఈవో శివ్‌నందన్‌కుమార్, రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొననున్నారు. పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తికి రూ.12,911.15 కోట్లు ఇచ్చేందుకు జూన్ 5న కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరిస్తూ నోట్ జారీ చేసింది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన లిడార్ సర్వేలో 41.15 కాంటూరు పరిధిలోకి మరో 32 గ్రామాలు వస్తాయని తేలింది. ఆ గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి రూ.5,124 కోట్లు అవసరమని ఇప్పటికే పీపీఏ ద్వారా కేంద్ర జల్ శక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. తొలి దశ పూర్తిలో భాగంగా తక్షణం చేపట్టాల్సిన పనులకు, నిర్వహణకు రూ.800 కోట్లు అవసరం అవుతాయని ప్రతిపాదించింది. ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ ఇచ్చేందుకు అంగీకరించిన రూ.12,911.15 కోట్లకు అదనంగా రూ.6,924 కోట్ల మంజూరుపై కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ సమావేశంలో చర్చించి, విధానపరమైన నిర్ణయం తీసుకోనున్నారు.

ఇక రైళ్లలోనూ బ్లాక్ బాక్సులు

- తొలిసారిగా వందే భారత్ రైళ్లలో ప్రవేశపెట్టాలని నిర్ణయం
- ప్రమాదాలు సంభవిస్తే సమగ్ర విశ్లేషణకు అవకాశం
- ఏరో డైనమిక్ ఇంజిన్లు.. కోచ్‌లకు డిస్క్ బ్రేకులు
- రైల్వే శాఖ నిర్ణయం



సాక్షి, అమరావతి: భారతీయ రైల్వే మరింత ఆధునికతను సంతరించుకుంటోంది. విమానాల తరహాలో రైళ్లలోనూ బ్లాక్ బాక్సులు ప్రవేశపెట్టాలని రైల్వే శాఖ తాజాగా నిర్ణయించింది. తద్వారా ప్రమాదాలు సంభవిస్తే సమగ్ర విశ్లేషణకు అవకాశం ఏర్పడనుంది. తొలిసారిగా వందే భారత్ రైళ్లలో బ్లాక్ బాక్సులు ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ఇప్పటికే రైల్వే కోచ్ ఫ్యాక్టరీలకు విధివిధానాలను నిర్దేశించింది. సెప్టెంబర్ నుంచి రూపొందించే రైళ్లలో బ్లాక్ బాక్సులు ప్రవేశపెట్టాలని ఆదేశించింది. దాంతోపాటు రైలు ఇంజిన్లు, బ్రేకులు, ఇతర అంశాల్లో కూడా భద్రతా ప్రమాణాలను మెరుగుపరచనుంది.

సీసీఆర్‌సీవీఆర్ పరిజ్ఞానంతో..

కేబిన్ క్రూ రెస్ట్ కంపార్ట్‌మెంట్ వీడియో రికార్డింగ్ (సీసీఆర్‌సీవీఆర్) సాంకేతిక పరిజ్ఞానంతో బ్లాక్ బాక్సులు తయారు చేస్తారు. విమానాల్లోని బ్లాక్ బాక్సులను కూడా అదే సాంకేతిక పరిజ్ఞానంతోనే రూపొందిస్తున్నారు. చిత్తరంజన్‌లోని లోకోమోటివ్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేసే వందేభారత్ రైళ్లలో ఈ బ్లాక్ బాక్సులను ప్రవేశపెడతారు. అందుకోసం డిజైన్లు ఖరారు చేశారు. సెప్టెంబర్‌లో తయారు చేసే వందేభారత్ రైళ్లలో వాటిని ప్రవేశపెట్టిన అనంతరం చెన్నైలోని ఇంటిగ్రెల్ కోచ్ ఫ్యాక్టరీలో పరీక్షించి తుది ఆమోదం తెలుపుతారు. రైలు డ్రైవర్ కేబిన్‌లో అన్ని కదలికలను ఈ బ్లాక్‌బాక్సులు రికార్డు చేసి ఆడియో, వీడియో రూపంలో భద్రపరుస్తాయి. రైలు ఎలాంటి ప్రమాదానికి గురైనా సరే ఆ బ్లాక్ బాక్సులో రికార్డు అయిన సమాచారం భద్రంగా ఉంటుంది. దాంతో ప్రమాద కారణాలను సహేతుకంగా విశ్లేషించి ఇకముందు ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు రైల్వే శాఖ తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఏరో డైనమిక్ ఇంజిన్లు

భద్రతా ప్రమాణాలను పెంచుతూ వందేభారత్ రైళ్లకు సరికొత్త రూపునిస్తోంది రైల్వే శాఖ. ఇప్పటి వరకు హైస్పీడ్ ఎలక్ట్రిక్ కోచ్‌ల స్థానంలో ఏరో డైనమిక్ ఇంజిన్ కోచ్‌లు ప్రవేశపెట్టనున్నారు. 20 డిగ్రీలు ఉండే రైలు ముందు భాగాన్ని 45 డిగ్రీలకు పెంచుతున్నారు. దాంతో ఇంజిన్‌లో గాలి నిరోధకత తగ్గి రైలు వేగం మరింత పెరుగుతుంది. రైలు ముందు ఉండే అద్దం మరింత పెద్దదిగా ఉంటుంది. దాంతో రైలు లోకో పైలట్‌కు ముందున్న ట్రాక్ మరింత స్పష్టంగా కనిపిస్తుంది. లోకో పైలట్ కేబిన్‌లో ఏసీ సౌకర్యం కల్పిస్తారు. దాంతో సుదూర ప్రయాణాల్లో కూడా లోకో పైలట్ అసౌకర్యానికి గురి కాకుండా ఉంటారు. ఇక రైలుకు ముందు, వెనుక వైపు కూడా ఇంజిన్లు ఏర్పాటు చేస్తారు. దాంతో రైలు రెండు వైపులా కదిలేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆ రెండు ఇంజిన్లను ఒకే లోకో పైలట్ మాత్రమే నియంత్రించే వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌కు డిస్క్ బ్రేకులు ఏర్పాటు చేయనున్నారు.

ఆఫ్రికాలో ఆకలి కేకలు

- పెరుగుతున్న ఆహార సంక్షోభం
- ప్రపంచ వ్యాప్తంగా 73.5 కోట్ల మంది పస్తులు
- 2019తో పోలిస్తే 12.2 కోట్ల మంది పెరుగుదల
- 2030 నాటికి అందరికీ ఆహారం లక్ష్యం అసాధ్యం
- 14.8 కోట్ల మంది ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం
- ఐక్యరాజ్య సమితి, ఎస్‌ఓఎఫ్‌ఐ తాజా నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా ఆకలి కేకలు పెరుగుతున్నాయని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. ప్రస్తుతం 73.5 కోట్ల మంది ఆహారం అందక అలమటిస్తున్నారని పేర్కొంది. 2019లో 61.3 కోట్ల మంది పస్తులుంటే.. ప్రస్తుతం 73.5 కోట్ల మంది తిండి లేకుండా కాలం గడుపుతున్నట్టు స్పష్టం చేసింది. కరోనా మహమ్మారితో పాటు ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆకలి సూచీ వృద్ధి చెందినట్టు ఐక్యరాజ్య సమితి ఐదు ప్రధాన ఏజెన్సీలు, స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ (ఎస్‌ఓఎఫ్‌ఐ) సంయుక్త నివేదికలో వెల్లడైంది. 2030 నాటికి ఆకలి కేకలు లేకుండా చేయాలనే స్థిరమైన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రస్తుత పరిస్థితులు సవాలుగా మారతాయని నివేదిక అభిప్రాయపడింది. 2030 నాటికి ఇంకా 60 కోట్ల మంది ఆహారం కోసం ఎదురు చూస్తుంటారని అంచనా వేసింది.

తీవ్రమవుతున్న ఆహార సంక్షోభం

తాజా అధ్యయనం ప్రకారం ఆహార లభ్యత విషయంలో ఆసియా, లాటిన్ అమెరికా మెరుగ్గా ఉండగా.. ప్రపంచంలోని అనేక దేశాలు తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. 2022లో పశ్చిమాసియా, కరేబియన్, ఆఫ్రికా అత్యధికంగా ఆకలికి ప్రభావితమయ్యాయి. ఆఫ్రికా ఖండంలో ప్రతి ఐదుగురిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు కంటే రెండు రెట్లు ఎక్కువ. గతేడాది ప్రపంచ వ్యాప్తంగా సుమారు 240 కోట్ల మందికి ఆహారం నిరంతరం అందుబాటులో లేదు. వారిలో సుమారు 90 కోట్ల మంది తీవ్రమైన ఆహార అభద్రతలో నలిగిపోయారు. ఆహార అభద్రత గ్రామాల్లో 33 శాతం, పట్టణాల్లో 26 శాతం మందిని ప్రభావితం చేస్తోంది.

ఆహార అభద్రత, పోషకాహార లోపం

ఇప్పటికీ ప్రపంచ జనాభాలో 42 శాతం మంది మంచి ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. ఇక ఐదేళ్లలోపు 14.8 కోట్ల మంది పిల్లల్లో పోషకాహార లోపం తీవ్రంగా ఉండగా, 4.5 కోట్ల మందిలో నీరసం, నిస్సత్తువ కనిపిస్తున్నాయి. 3.7 కోట్ల మంది అధిక బరువుతో అనారోగ్యం పాలవుతున్నారు. పట్టణీకరణ ప్రజల ఆహారపు అలవాట్లను సమూలంగా మార్చేస్తోంది. 2050 నాటికి దాదాపు పది మందిలో ఏడుగురు నగరాల్లోనే నివసిస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రభుత్వాలు ఆహార అభద్రత, పోషకాహార లోపాలను నివారించడానికి వీలైనంత వేగంగా పట్టణీకరణ పోకడలను అర్థం చేసుకోవాలని యూఎస్‌ఓ సూచిస్తోంది. పట్టణాలు, గ్రామాలనే తేడా లేకుండా ప్రాసెస్డ్, ప్యాక్డ్ ఆహారాన్నే కొనుగోలు చేసి తినే పరిస్థితి తలెత్తుతోందని వివరించింది. ఆహారాన్ని అందరికీ అందించాలంటే చిన్న తరహా రైతులకు పెట్టుబడులిచ్చి ప్రోత్సహించి వీలైనంత ఎక్కువగా సేంద్రియ పంటలను పండించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

క్షిపణుల డిజైన్‌లో స్టార్టప్‌లను భాగస్వాములను చేయాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, సమీర్ సక్సేనా

సాక్షి, విశాఖపట్నం: క్షిపణుల మరమ్మతులు, డిజైన్లలో స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలను భాగస్వాములను చేస్తే ఆత్మ నిర్భర్ భారత్ దిశగా మరింత పురోగతి సాధించవచ్చని డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం(ఈఎన్సీ) ప్రధాన కేంద్రానికి అనుబంధంగా ఉన్న ఐఎన్ఎస్ కళింగ బేస్‌లో గురువారం 'అమృత్–2023' పేరుతో మిస్సైల్ టెక్నాలజీ కాంక్లేవ్, సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీనివాసరావు, ఈఎన్సీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ప్రారంభించారు. డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ భారత్ మిషన్‌కు అనుగుణంగా ఇండియన్ పబ్లిక్, ప్రైవేట్ ఇండస్ట్రీస్, డీఆర్‌డీవో ల్యాబ్స్, అకాడమీ, ఇండియన్ నేవీ ముందుకువెళ్తుండటం శుభపరిణామమని చెప్పారు. విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా రక్షణ పరిశ్రమ ప్రధాన సామర్థ్యాలను బలోపేతం చేయాలని సూచించారు. ఈ సింపోజియంలో డీఆర్‌డీవో, పీఎస్‌యూలు, డీపీఎస్‌యూలు, దేశంలోని ప్రైవేట్ డిఫెన్స్ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం, సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్‌మ్యాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడీఎం) తరఫున స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆయా డిఫెన్స్ సంస్థలు క్షిపణి మరమ్మతులు, మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారు చేసిన రక్షణ ఉత్పత్తులు, సామర్థ్యాలను ప్రదర్శించాయి.

తెలంగాణ

ఐఏఎస్ అధికారి రజత్‌కుమార్‌పై కేసు విచారణ వాయిదా

- కుమార్తె వివాహానికి ఓ కాంట్రాక్టర్ ఖర్చు చేశారనే ఆరోపణపై ఢిల్లీ కోర్టులో కేసు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్‌కుమార్‌పై కేసు విచారణ ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. రజత్‌కుమార్ కుమార్తె వివాహానికి ఖర్చు ఓ కాంట్రాక్టర్ చెల్లించారని, ఆ అధికారిపై కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా సర్పంచ్‌ల సంఘం నాయకుడు గవినోళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ సుబ్రహ్మణ్య ప్రసాద్ విచారించారు. రజత్‌కుమార్ తరఫు న్యాయవాది తొలుత పాస్ ఓవర్ అడిగారు. అయితే, తమ ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేస్తున్నామన్న తెలంగాణ ప్రభుత్వం ఇంకా నివేదిక దాఖలు చేయలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది అక్షయ్‌మాన్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతివాది వాయిదా కోరుతున్నారన్న ధర్మాసనం తదుపరి విచారణ డిసెంబర్ 12కు వాయిదా వేసింది.

తెలంగాణ మంత్రిగా పట్నం ప్రమాణస్వీకారం

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర మంత్రిగా గురువారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈటల రాజేందర్‌ను మంత్రివర్గం నుంచి తొలగించిన తర్వాత ఓ స్థానం ఖాళీ అయింది. దీంతో పట్నం మహేందర్ రెడ్డికి అవకాశం కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాగా, గవర్నర్ తమిళిసై ఇచ్చిన తేనేటి విందులో సీఎం కేసీఆర్, మంత్రులు, ఇతర అతిథులు పాల్గొన్నారు. గవర్నర్‌తో కలిసి మంత్రి మండలి సభ్యులందరితో గ్రూపు ఫోటో సెషన్‌లో కేసీఆర్ పాల్గొన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

'చేప ప్రసాదం' బత్తిని కన్నుమూత

ముషీరాబాద్(హైదరాబాద్): చేప ప్రసాదం పంపిణీ చేసే బత్తిని హరినాథ్‌గౌడ్(79) కన్నుమూశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ,విదేశాలకు చెందిన ఉబ్బస వ్యాధిగ్రస్తులకు బత్తిని హరినాథ్ గౌడ్ చేప ప్రసాదం సుపరిచితమే. బత్తిని 1944లో హైదరాబాద్‌లోని దూద్‌బౌళిలో జన్మించారు. 40 సంవత్సరాల క్రితం భోలక్‌పూర్‌లోని పద్మశాలీకాలనీకి వచ్చి స్థిరపడ్డారు. ఆయనకు భార్య సుమిత్రాదేవి, ఇద్దరుకుమారులు అనిల్‌గౌడ్, అమర్‌నాథ్ గౌడ్, ఇద్దరు కూతుళ్లు అలకనంద, అర్చనలు ఉన్నారు. బత్తిని చిన్ననాటి నుంచే తన నానమ్మ వద్ద చేప ప్రసాదం తయారీ నేర్చుకున్నాడు. అన్నదమ్ములతో చేపమందు పంపిణీ చేసేవారు. కొద్దిరోజులుగా ఆయన షుగర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి షుగర్ లెవల్స్ పెరగడంతో తన స్వగృహంలోనే మృతి చెందారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 25 । ఆగస్టు । 2023

మద్యం తాగి హల్‌చల్.. డ్రైవర్, కండక్టర్ సస్పెండ్

మైసూరు: డ్యూటీలో ఉండి పీకల దాకా మద్యం తాగిన కేఎస్ ఆర్‌టిసి బస్సు డ్రైవర్, కండక్టర్‌లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. డ్రైవర్ గోపాల కృష్ణ, కండక్టర్ ప్రకాశ్‌లు హెచ్‌డి కోటి నుంచి మైసూరు సిటీకి బస్సుతో బయల్దేరారు. ఇద్దరూ బాగా మద్యం తాగి ఉన్నట్లు ప్రయాణికులు గుర్తించారు. బస్సును స్టాపులో కాకుండా దూరంగా నిలపడంతో ఆగ్రహించిన ప్రయాణికులు ఫోన్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నేను తెల్లవారుజామునే మందు తాగాను, డ్యూటీకి రానని చెప్పినా రమ్మన్నారు, నేనేం చేసేది అని ప్రయాణికులపైన డ్రైవర్ భగ్గుమన్నాడు. దీంతో కొందరు ప్రయాణికులకు పోలీసులకు కాల్ చేశారు. డ్రైవర్, కండక్టర్‌లను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చివరకు ఇద్దరినీ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

న్యూస్‌రీల్

తప్పెట్లతో నిరసన



భైఠాయించిన పాడిరైతులు

గౌరిబిదనూరు: నగర శివార్లలోని పాల శీతలీకరణ కేంద్రం నిర్వాహకులు రైతుల వద్ద నుంచి కొనే పాల ధరను తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ పాడి రైతులు ధర్నా కొనసాగించారు. గురువారం ఉదయం డప్పులు వాయిస్తూ కేంద్రం ముందు రైతులు, మహిళలు భైఠాయించారు. మధ్యాహ్నం వరకు డప్పుల మోతతో ప్రతిధ్వనించింది. అయినా అధికారులు ఎవరూ మాట్లాడడానికి రాలేదు. సిఐటియు నేత సిద్ధగంగప్ప ప్రసంగిస్తూ నిరసనకు దిగామని పోలీసు కేసులలో ఇరికించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, జైలుకెళ్ళడానికి కూడా సిద్ధమని చెప్పారు. తక్షణం పాల సేకరణ ధరను పెంచి పశుపోషకులకు న్యాయం చేయాలని కోరారు.

ఆయనూరు కాంగ్రెస్‌లో చేరిక

శివాజీనగర: ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరికలు మొదలయ్యాయి. తాజాగా గురువారం కేపీసీసీ కార్యాలయంలో ఆయనూరు మంజునాథ్ జేడీఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు డీ.కే.శివకుమార్ మంజునాథ్‌కు పార్టీ జెండాను అందించటం ద్వారా ఆహ్వానించారు. మంత్రి మధు బంగారప్ప, నాయకులు బేళూరు గోపాలకృష్ణతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

మైసూరు: వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మరణించారు, ఈ సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకా బదనవాలు గ్రామంలో జరిగింది. చామరాజనగరలోని పౌర కార్మికుల కాలనీలో నివాసం ఉండే మాదేశ (21), విజయ్(21) ఈ దుర్ఘటనలో మృతి చెందగా, విశ్వ (20) తీవ్రంగా గాయపడి మైసూరు నగరంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ముగ్గురూ బైకులో మైసూరు నగరం నుంచి చామరాజనగరకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఇద్దరు సంఘటనా స్థలంలోనే చనిపోయారు. కౌలంద పోలీసులు పరిశీలించి లారీ డ్రైవర్‌ని అరెస్టు చేశారు.

మెస్‌లో సిలిండర్ పేలి..

యశవంతపుర: గ్యాస్ సిలిండర్ పేలి ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడిన ఘటన బెంగళూరు అడుగోడి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కలక్కయ్య లేఔట్‌లోని పోలమ్మాస్ హోటల్ వద్ద గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఒక భవనంలో పై అంతస్తులో వంట గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో రవి (40) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన కొన్నేళ్లు నుంచి పోలమ్మాస్ పేరుతో మెస్ నడుపుతున్నారు. రెండో అంతస్తులో వంటలు చేస్తుండగా గ్యాస్ లీకై విస్ఫోటం జరిగింది. చోర్ల, నాగరాజు అనే ఇద్దరు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మూడు.. ముళ్ల నుంచి

బాల్యానికి భరోసా

- మైనర్ల పెళ్లిళ్లకు అడ్డుకట్ట
- వేగంగా ఉప్పందడంతో అధికారుల దాడులు
- బాలికల స్నేహితుల నుంచి కాల్స్
- నాలుగేళ్లలో 8,929 వివాహాలకు బ్రేక్



బనశంకరి: బాల్య వివాహాలు అనే సామాజిక జాఢ్యాన్ని తొలగించడానికి ప్రభుత్వం చట్టం తీసుకువచ్చినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. కళ్లుగప్పి జరిపిస్తున్న బాల్య వివాహాలను ప్రేమ అడ్డుకోవడం విశేషం. చదువుకునే ఆడపిల్లలు ప్రేమలో చిక్కుకుంటే తల్లిదండ్రులు మైనారిటీ తీరకుండానే పెళ్లిచేసేయడానికి సిద్ధమవుతారు. ఇంతలో ప్రియుడు పోలీసులకు, సహాయవాణికి కాల్ చేసి నిలుపుదల చేయిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో వేలాది బాల్యవివాహాలను చట్టపరంగా అడ్డుకోవడానికి ప్రేమికులే ఆసరాగా నిలిచారు.

సహాయవాణికి కాల్స్ జోరు

బాల్య వివాహాల నిషేధ చట్టం, ఇటువంటి పెళ్లిళ్ల వల్ల కలిగే కష్టనష్టాల గురించి పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లు తదితరాల్లో మహిళా శిశుసంక్షేమశాఖ, పోలీస్ సిబ్బంది జాగృతం చేస్తున్నారు. వీటితో పాటు సహాయవాణి ఆపద్బాంధవిగా ఉంది. తోటి విద్యార్థులు సంక్లిష్ట పరిస్థితుల్లోకి చిక్కుకున్న స్నేహితులే బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. బాలల సహాయవాణి 1098 , 112 టోల్ ఫ్రీ నంబర్లకు వచ్చే కాల్స్ ఆధారంగా గత నాలుగేళ్లలో రాష్ట్రంలో సగటున రోజుకు ఆరేడు బాల్యవివాహాలను అధికారులు అడ్డుకుంటున్నారు.



రాష్ట్రంలో ఏటా వేలాదిగా బాల్య వివాహాలు జరుగుతున్నాయి

అలాగే బాల్యవివాహాలు చేసిన వారిపై 1,085 కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు 8,929 మైనర్లకు పెళ్లిని అడ్డుకున్నారు. వీటిలో చాలా కేసుల్లో ప్రేమికులు, తోటి స్నేహితులు చేసిన ఫిర్యాదులతోనే అధికారులు తనిఖీలు నిర్వహించారు.

అధికారులకు స్నేహితుల సాయం

గత రెండేళ్ల నుంచి బాల్యవివాహాల పట్ల సమాచారం అందించేవారి సంఖ్య పెరిగింది. దీంతో అధికారుల పని సులువవుతోంది. అలాగే పిల్లల సహాయవాణి 1098 సిబ్బందికి కూడా కాల్స్ వల్ల ఉపయోగం కలుగుతోంది. వివాహాల ఏర్పాట్లు, స్థలం సమాచారాన్ని బాలికల స్నేహితులే చేరవేస్తున్నారు. తాము ప్రేమించిన అమ్మాయి వివాహం మరొకరితో జరుగుతుందని భావించే ప్రియులు, లేదా స్నేహితులు కాల్ చేసి బాల్య వివాహాలకు చెక్ పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పొరుగువారు, బంధువులు విభేదాలను మనసులో ఉంచుకుని అధికారులకు సమాచారం ఇచ్చి బాల్య వివాహాలకు బ్రేక్ వేసినట్లు బెళగావి జిల్లా శిశు సంక్షేమ అధికారి లోకేశ్ జగళూరు తెలిపారు.

గత నాలుగేళ్లలో రాష్ట్రంలో బాల్య వివాహాల సమాచారం		
ఏడాది	అడ్డుకోవడం	కేసులు
2019-20	1,623	130
2020-21	2,711	239
2021-22	2,401	389
2022-23	2,194	327

ఉపాధ్యాయుడు సస్పెండ్

మైనర్ బాలికను పెళ్లాడిన బాల్కి తాలూకా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సందీప్‌కుమార అజుర ను డీడీపీఐ సలీం పాషా గత సోమవారం సస్పెండ్ చేశారు. బాలికకు మాయమాటలు చెప్పిన ఉపాధ్యాయుడు గత మార్చిలో మూడుముళ్లు వేశాడు, ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.



112 సహాయవాణికి సమాచారంతో ఫలితాలు



ప్రేమికుల నుంచి ఎక్కువగా కాల్స్ వస్తున్నాయి

తామరపూల కోసం చెరువులో దిగి...

- తండ్రి, కుమారుడు మృతి

దొడ్డబళ్లాపురం: శుక్రవారం వరమహాలక్ష్మి పూజ కోసం తామర పూలు కోసి విక్రయించడానికి చెరువులో దిగిన తండ్రీ కుమారుడు నీటమునిగి మృతి చెందిన సంఘటన దొడ్డ తాలూకా హులికుడి కొండ వద్ద ఉన్న చెరువులో చోటుచేసుకుంది. దొడ్డ పట్టణ పరిధిలోని శాంతినగర్ నివాసులైన పుట్టరాజు (45), ఇతని కుమారుడు కేశవ (16) మృతి చెందిన వారు. వరమహాలక్ష్మి పండగ సందర్భంగా తామర పూలకు ఎక్కువ డిమాండు ఉంటుంది. దీంతో చెరువులో తామర పూలు కోసి విక్రయించాలని బుధవారం సాయంత్రం హులుకుడి కొండ కింద ఉన్న చెరువులో దిగిన తండ్రి, కుమారుడు ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతి చెందారు. మృతుడు పుట్టరాజు ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కుమారుడు కేశవ పదవ తరగతి చదువుతున్నాడు. పుట్టరాజు భార్య గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. వీరికి ఇద్దరు సంతానం. గురువారం అగ్నిమాపకదళం సిబ్బంది మృతదేహాలను వెలికి తీసారు. భార్య, బంధుమిత్రుల తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



మృతి చెందిన బాలుడు కేశవ



తండ్రి పుట్టరాజ (ఫైల్)

ఖరీదైనా కొనాల్సిందే



గురువారం బెంగళూరు కేఆర్ మార్కెట్ పరిసరాల్లో జనసంద్రాన్ని తలపించిన రద్దీ

- వర మహాలక్ష్మి పండుగకు మార్కెట్లు కిటకిట
- భగ్గుమన్న పూలు, పండ్ల ధరలు

బనశంకరి: ఆకాశాన్ని అంటుతున్న ధరల మధ్య శ్రావణమాసం మొదటి పండుగ అయిన వర మహాలక్ష్మీ పర్వదినానికి ప్రజలు షాపింగ్ చేశారు. సిరిసంపదలిచ్చే మహాలక్ష్మి కటాక్షం కోసం ఖర్చుకు వెనుకాడకుండా పూలు పండ్లు ఇతర సామగ్రి కొనుగోలుకు తరలిరావడంతో మార్కెట్లు కిక్కిరిశాయి. నగరంలోని కేఆర్ మార్కెట్, యశవంతపుర, మల్లేశ్వరం, విజయనగర, జయనగర, బసవనగుడి, బనశంకరి, మడివాళ, గాంధీ బజార్, కృష్ణరాజపురం మార్కెట్లతో పాటు నగర వివిధ రోడ్లు, వీధుల్లో పూలు, పండ్లు అరటి పిలకలు, మామిడి ఆకులు, తామర పుష్పాలు విక్రయాలు భారీగా జరిగాయి. ఉదయం నుంచే మార్కెట్లలో సందడి మొదలైంది. పూలు, పండ్లు ధరలు ఆకాశానికి అంటినప్పటికీ నగరవాసులు కొనుగోలు ఏమాత్రం తగ్గలేదు. మహిళలు మార్కెట్లకు తరలివచ్చారు. ఇంట్లో ప్రతిష్టించే లక్ష్మీదేవి విగ్రహాలకు బాగా డిమాండు ఏర్పడింది. పూజలో అలంకరణ, అతిథులకు వాయనానికి పూలు అవసరం. ఈ నేపథ్యంలో ఈ వారంలో ధరలు పెరిగాయి.

కనకాంబరం కేజీ రూ. 2వేలు

- మార్కెట్లలో పూల ధరలు విని జనం షాక్‌కు గురయ్యారు. దీంతో కొందరు ఆచితూచి కొనుగోలు చేశారు.
- కొద్దిరోజుల క్రితం కిలో రూ.600 -800 ధర పలికిన కనకాంబరం గురువారం రూ.1500 నుంచి 2 వేల వరకు ధరతో విక్రయించారు. వంద గ్రాములు రూ.150 నుంచి 200 వరకు పలికాయి.
- మైసూరు మల్లెపూలు సైతం కిలో రూ.600కు చేరాయి. మంగళవారం కిలో రూ.400 ధర ఉండగా ఒకే రోజు రూ. 200 పెరిగింది.
- మల్లెపూలు మూర రూ.120 కి చేరాయి. సేవంతి కిలో రూ.200, మూర రూ.60–80 కి అమ్మారు.
- లక్ష్మీదేవీ ఇష్టమైన తామర, కలువ పూలు జతకు రూ.100 చెల్లించాల్సి వచ్చింది.
- చెండుపూలు కిలో రూ.160, విడి గులాబీ రూ.320 ఉండగా, తులసి మూర రూ.100తో విక్రయించారు.
- పండ్లలో యాలక్కి అరటి పండ్లు కిలో రూ.100– 120, సీతాఫలం కిలో రూ.70–80, దానిమ్మ కిలో రూ.150, సీడ్‌లెస్ ద్రాక్ష రూ.200, మూసంబి రూ.70–80, ఆపిల్ కిలో రూ.200, అనాస ఒకటి రూ.50 పలికాయి.



అమ్మవారికి సమర్పించడానికి గాజుల విక్రయాలు

బెంగళూరులో శ్రీలంక నేరగాళ్ల అరెస్టు

- అంతర్జాతీయ ముఠాతో లింకులు?

బనశంకరి: బెంగళూరులో ముగ్గురు శ్రీలంక అంతర్జాతీయ నేరగాళ్లు పట్టుబడ్డారు. వారికి ఆశ్రయమిచ్చిన జైపరమేశ్ అనే వ్యక్తితో పాటు, శ్రీలంకకు చెందిన కాసిన్ కుమార్, అమిలా నువాన్, రంగప్రసాద్ అనే ముగ్గురు పట్టుబడ్డారని జాయింట్ పోలీస్‌కమిషనర్ ఎస్‌డీ.శరణప్ప గురువారం తెలిపారు. హత్యకేసులో నిందితునిగా ఉన్న జైపరమేశ్ యలహంక విశ్వప్రకృతి అపార్టుమెంట్‌లో ముగ్గురు శ్రీలంక క్రిమినల్స్‌కు ఆశ్రయం కల్పించాడు. కాసిన్‌కుమార్ పై శ్రీలంకలో 4 హత్యకేసులు, అమిలా నువాన్ పై 5 హత్యకేసులు, రంగప్రసాద్ పై దాడులు, హత్యకేసు నమోదై ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 13 మొబైల్‌ఫోన్లు, శ్రీలంక కు చెందిన విజిటింగ్ కార్డులు, బస్‌టికెట్లు, పేపర్ కటింగ్స్, ఇంటి అద్దె ఒప్పందపత్రాలు, ఆధార్‌కార్డు, ఎన్నికల గుర్తింపుకార్డు జిరాక్స్ కాపీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు 20 రోజుల కిందట శ్రీలంక నుంచి చెన్నై వద్దకు బోట్‌లో ప్రవేశించి, అక్కడి నుంచి నేవీ అధికారుల కళ్లుగప్పి దేశంలోకి వచ్చారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంగా బెంగళూరుకు చేరుకున్నారు. బెంగళూరుకు ఎందుకు వచ్చారన్నది కూపీ లాగుతున్నట్లు చెప్పారు.



ఒమన్‌లో జలాన్..

జలాన్ అనే వ్యక్తి అదేశాల మేరకు ఈ ముగ్గురు బెంగళూరుకు వచ్చినట్లు తెలిసింది. జలాన్ ఇదివరకే ఒమన్ దేశంలో అరెస్టయ్యాడు. జలాన్ శ్రీలంక, భారత్, పాకిస్తాన్ దేశాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా చేసేవాడు. అలాగే శ్రీలంకలోని ఎల్‌టీటీఈ తోనూ సంబంధాలు కలిగి ఉన్నట్లు తెలిసిందన్నారు. దీంతో విభిన్న కోణాల్లో విచారణ చేపడుతున్నామని శరణప్ప తెలిపారు.


సాటిలేని విజయం చంద్రయాన్

బనశంకరి: చంద్రయాన్–3 విజయవంతమైన నేపథ్యంలో త్వరలో ప్రధాని మోదీ బెంగళూరు విచ్చేసి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేస్తారని బీజేపీ నేత ఆర్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన పద్మనాభనగరలో విలేకరులతో మాట్లాడుతూ... చంద్రయాన్–3 సరిసాటి విజయం ప్రపంచంలో ఎవరూ చేయలేదని ఈ విజయంతో తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ప్రధాని మోదీ ఈనెల 26న బెంగళూరు విచ్చేస్తారని, ప్రధానమంత్రికి స్వాగతం పలకడానికి ఐదు వేల మంది విచ్చేస్తారని, ఇస్రో సంస్థ ఉన్న దాసరహళ్లికి ప్రధాని మోదీ విచ్చేసినప్పుడు రోడ్ షో నిర్వహిస్తామని తెలిపారు. చంద్రయాన్ విజయవంతమైన నేపథ్యంలో పద్మనాభనగరలోని వెంకటేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని, 1000 మందికి పైగా ఇస్రో శాస్త్రవేత్తలను సన్మానించామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ బీబీఎంపీ విపక్ష నేత ఏహెచ్.బసవరాజ్, మాజీ కార్పొరేటర్ సురేశ్, బీజేపీ నేతలు లక్ష్మీకాంత్, ఉమేశ్ కబ్బాలు తదితరులు పాల్గొన్నారు.



ఇస్రో శాస్త్రవేత్తలను సన్మానిస్తున్న ఆర్.అశోక్ తదితరులు

కావేరిపై తమిళనాడు తీరు సరికాదు



జలం, జగడం.. కావేరి నది

- త్వరలో ఢిల్లీ యాత్ర: సీఎం సిద్దు

శివాజీనగర: కావేరి జల వివాదంలో ఇప్పటికే సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వగా, తమిళనాడు ప్రభుత్వం కొత్తగా అప్పీల్ చేయడం సబబు కాదని సీఎం సిద్దరామయ్య అన్నారు. గురువారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, 2018 ఫిబ్రవరి 5న సుప్రీం కోర్టు కావేరి వివాదంలో తీర్పు ఇచ్చింది, ఇప్పుడు తమిళనాడు ప్రభుత్వ కొత్తగా వివాదం తీసుకొచ్చి సుప్రీం కోర్టు మెట్లెక్కడం బాగా లేదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామూలు సమయంలో బిళిగుండ్లు డ్యాంకి 177 టీఎంసీ నీరు వదిలేది, అయితే వర్షాలు లేని సమయంలో ఇది సాధ్య పడదు. వర్షాలు కురవక కేఆర్‌ఎస్, కబిని, హారంగితో పాటు కావేరి నది మీద ఉండే జలాశయాల్లో కొరత ఉంది. ఉన్న నీటిని ఏడాది మొత్తం తాగు నీటి కోసం కాపాడుకోవాల్సి ఉంది. మా రైతుల హితాసక్తిని కాపాడుకోవాలని అన్నారు. ఇదే అంశంతో రాష్ట్ర న్యాయవాదుల బృందం సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తారన్నారు. గత మూడు నెలల నుంచి 26 టీఎంసీల నీటిని తమిళనాడుకు వదలినట్లు తెలిపారు. నదీ జలాల వివాదాలపై చర్చించేందుకు ప్రధానమంత్రి, మంత్రుల సమయాన్ని కోరాము, అవకాశం ఇవ్వగానే అన్ని పార్టీల నాయకులతో ఢిల్లీకి వెళ్తామని చెప్పారు.

కావేరి వివాదంపై సుప్రీంకు అప్పీల్

కావేరి నీటి వివాదంపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ తెలిపారు. సదాశివ నగరలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో, నీటి వివాదానికి సంబంధించి న్యాయ పోరాటం చేపట్టేందుకు విధానసౌధలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రంలో వాస్తవ పరిస్థితిని సుప్రీంకోర్టులో విచారణ సమయంలో వివరిస్తామని తెలిపారు. ఇక కేంద్రమంత్రి గజేంద్ర సింగ్‌తో భేటీకి విజ్ఞప్తి చేశామని, ఆయన వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

అంతు తేలని రూ.2 కోట్ల దోపిడీ

= అనంత పోలీసుల సతమతం

అనంతపురం (శ్రీకంఠం సర్కిల్): రూ. 2 కోట్లను కాజేసిన దారి దోపిడి ముఠా అన్వేషణలో అనంతపురం పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వడంలేదు. దుండగులు ఉపయోగించిన వాహనంతో సహా చిన్న ఆచూకీ కూడా లభించలేదు. దోపిడి అనంతరం ముఠా ఎటువైపు వెళ్లిందన్న దానిపై స్పష్టత రాక పోవడంతో తల పట్టుకుంటున్నారు. రూ.2 కోట్లు నగదు తీసుకుని బెంగళూరుకు బయలు దేరిన ఎస్‌ఆర్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ సిబ్బందిని బెదిరించిన వారు తెలుగులో మాట్లాడినట్లు తెలిసింది. నల్లటి ఇన్నోవా వాహనంలో వచ్చిన దుండగులు దోపిడి తరువాత గుత్తి వైపుగా జాతీయ రహదారిపై వెళ్లారని చెప్పారు. ఇప్పటి దాకా గుత్తి పట్టణ శివారుల్లోని టోల్ గేట్‌లో ఈ రంగు కలిగిన వాహనమే వెళ్లినట్లు కెమెరా చిత్రాల్లో లేదు.

ఎవరు చేసి ఉంటారు?

రూ.2 కోట్ల డబ్బును దోచుకెళ్లిన వైనం చూసిన కొంత మంది పోలీసు అధికారులు శ్రీధరన్ తరహా ముఠానే ఈ పని చేసుంటుందని చెబుతున్నారు. వాహనాలకు నంబరు ప్లేట్లు మార్చడం. చోరీ సమయాల్లో సెల్‌ఫోన్‌లను వాడకపోవడం వంటివి ఆ ముఠాకి వెన్నతో పెట్టిన విద్య. ఎక్కడా నేరగాళ్లు ఆనవాళ్లు లేకుండా జాగ్రత్త పడ్డారు. పోలీసులు బెంగళూరులోనూ మకాం వేసి విచారణ సాగిస్తున్నారు. మరోవైపు, డబ్బు తీసుకెళుతున్న ముగ్గురిపై కూడా పలు అనుమానాలున్నాయి. దీంతో డ్రైవరు శివతో పాటు మిగిలిన ఇద్దరి సెల్‌ఫోన్‌లోని కాల్ డేటాను కూడా తీస్తున్నట్లు తెలిసింది.

ప్రతిభా కారంజి రిహార్సల్స్‌లో ప్రమాదం

దొడ్డబళ్లాపురం: పాఠశాలలో జరగబోయే ప్రతిభా కారంజి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు రిహార్సల్స్ చేస్తుండగా పెట్రోల్ పడి మంటలు చెలరేగి విద్యార్థి గాయపడ్డ సంఘటన రామనగర తాలూకా లక్ష్మీపుర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రీతమ్ (12) గాయపడ్డ విద్యార్థి. పాఠశాలలో జరగబోయే ప్రతిభాకారంజి కార్యక్రమం కోసం విద్యార్థులచేత సాధన చేయిస్తుండగా వీరగాసె నృత్యంలో భాగంగా ప్రీతమ్ చేతికి పెట్రోల్ ఇవ్వడం జరిగింది. ఈ క్రమంలో మంటలు చెలరేగి ప్రీతమ్ ముఖం, తలకు కాలిన గాయాలయ్యాయి. తక్షణం విద్యార్థిని రామనగర జిల్లా ఆస్పత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రీతమ్

30న మైసూరులో గృహలక్ష్మికి నాంది

మైసూరు: గృహలక్ష్మి పథకం అనేది దేశంలోనే పెద్ద పథకమని, ఇందులో సుమారు 1.10 కోట్ల మంది మహిళలు పేర్లు నమోదు చేసుకొన్నారని డిప్యూటీ సీఎం డికే శివకుమార్ అన్నారు. గురువారం మైసూరులో ఆయన పర్యటించారు. ఈ నెల 30వ తేదీన గృహలక్ష్మి పథకాన్ని మైసూరులో మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సీఎం తదితరులు ప్రారంభిస్తారు. మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్‌తో కలిసి డీకే అధికారులతో ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ నెల 30వ తేదీన మైసూరు మహారాణి కళాశాల మైదానంలో గృహలక్ష్మి పథకం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి లక్ష మంది లబ్ధిదారులైన మహిళలు పాల్గొంటారని చెప్పారు. వారి కోసం సుమారు 2 వేల బస్సులను కేటాయించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

జాతీయ రహదారికి మరమ్మతు చేపట్టరూ



వినతిపత్రం సమర్పిస్తున్న బాబూరావ్

రాయచూరు రూరల్: నగరంలో గుండా వెళుతున్న జాతీయ రహదారికి మరమ్మతు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సలహాదారుడు బాబూరావ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గంజ్ సర్కిల్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు అధ్వానంగా మారిన జాతీయ రహదారి–167లో గుంతలు పూడ్చించాలని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్లాక్‌టవర్ పనులు పునఃప్రారంభం



ఊపందుకున్న క్లాక్‌టవర్ నిర్మాణ పనులు

బళ్లారిఅర్బన్: నగరం నడిబొడ్డున ఉన్న గడిగిచెన్నప్ప(రాయల్) సర్కిల్‌లో 120 అడుగుల ఎత్తైన క్లాక్‌టవర్ నిర్మాణానికి గత బీజేపీ ప్రభుత్వ హయాంలో రూ.7 కోట్ల వ్యయంతో మాజీ మంత్రి బీ.శ్రీరాములు పనులు ప్రారంభించినా ఎన్నికల సమయంలో పనులు నిలిచిపోయాయి. అయితే కాంట్రాక్టర్లు తమ బిల్లులు రాకపోవడంతో గత జూలై నెల నుంచి పనులు నిలిపి వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి నాగేంద్ర చొరవ తీసుకొని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సూచనల మేరకు కాంట్రాక్టర్లు గత రెండు రోజుల నుంచి పనులు తిరిగి ప్రారంభించారు. గురువారం ఎత్తైన క్రేన్ సహాయంతో సిమెంట్ కాంక్రీట్ పిల్లర్ పనులు ప్రారంభించడంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

బోగస్ కార్డులను రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: జిల్లాలో బోగస్ కార్మికుల కార్డులను జిల్లా బాల కార్మిక శాఖ అధికారి రద్దు చేయాలని అఖిల కర్ణాటక కార్మికుల సమాఖ్య సంచాలకుడు వీరణ్ణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 2021–22లో కార్మికులు పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. నిజమైన కార్మికులను గుర్తించి ప్రభుత్వం కార్డులను కేటాయించాలని, ఆరోగ్య సంజీవిని పరిధిలో కార్మికులకు అవకాశం కల్పించాలని, నగరానికి ఈఎస్ఐ ఆస్పత్రిని మంజూరు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జాతీయ విద్యా ప్రణాళిక రద్దు తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో జాతీయ విద్యా ప్రణాళిక(ఎన్ఈపీ–2020)ను రద్దు చేయడం తగదని ఏబీవీపీ పేర్కొంది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి చేపట్టిన ధర్నానుద్దేశించి సంచాలకుడు లక్ష్మీకాంత్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎన్ఈపీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

హత్య కేసు విచారణ కోసం పాదయాత్ర



మాట్లాడుతున్న గురుపాద గోమర్సి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో సంచలనం రేపిన సౌజన్య హత్య కేసుపై సమగ్ర విచారణ చేయాలని ఒత్తిడి చేస్తూ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ పేర్కొంది. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యాధ్యక్షుడు గురుపాద గోమర్సి మాట్లాడారు. ధర్మస్థలలో జరిగిన సౌజన్య హత్య కేసులో ఇంతవరకు ముద్దాయిలను అరెస్ట్ చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 26 న బెళ్తంగడి నుంచి సెప్టెంబర్ 8న బెంగళూరు వరకు పాదయాత్రను చేపడుతున్నట్లు తెలిపారు.

వైకల్యాన్ని జయించిన సంకల్పం

- ప్రపంచ మరుగుజ్జు క్రీడల్లో బంగారు పతకాలు
- కేజీఎఫ్ క్రీడాకారుడు నాగేష్ అద్భుత సాధన



మరుగుజ్జు క్రీడాకారుడు ఎన్.నాగేష్



నాగేష్ సాధించిన పతకాలు ఇవే

కేజీఎఫ్: పేదరికంలో మగ్గిన వ్యక్తి చదువుకోలేక ఆర్కెస్ట్రా బృందంలో చేరి నృత్యాలు చేసి అనంతరం అందివచ్చిన క్రీడావకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచ మరుగుజ్జు క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించాడు. కేవలం 3.4 అడుగుల ఎత్తు మాత్రమే కలిగిన కేజీఎఫ్ తాలూకా కద్రిపురకు చెందిన ఎస్.నాగేష్‌కు ఏదైనా సాధించాలనే తపన ఉండేది. అయితే ఆర్థిక ఇబ్బందులు, సమాజం నుంచి ఎదురవుతున్న హేళనలను ఎదుర్కొంటూనే క్రీడా రంగంలో సాధన చేయాలని సంకల్పించాడు. పట్టుదలతో సాధించి ప్రపంచ మరుగుజ్జు క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించాడు. జర్మనీలోని కోలోన్‌లో గతనెల 28 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించిన 8వ విశ్వ మరుగుజ్జు క్రీడా పోటీల్లో నాగేష్ మూడు బంగారు పతకాలను సాధించడం ద్వారా గొప్ప సాధన చేసి తానేమిటో నిరూపించుకున్నాడు. సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని రుజువు చేశాడు. క్లాస్–1 విభాగంలోని షాట్‌పుట్, డిస్క్ త్రో, జావలిన్ త్రో పోటీల్లో ఈ సాధన చేశాడు. పవర్ లిఫ్టింగ్ పోటీల 45 కేజీల విభాగంలో వెండి పతకం సాధించాడు. క్రీడా పోటీలకు వెళ్లడానికి రూ.2 లక్షలు ఖర్చయింది. విమాన ఛార్జీలు, హోటల్‌లో బస, భోజనాలకు తామే ఖర్చు భరించుకోవాల్సి వచ్చిందన్నారు.

అప్పు చేసి మరీ పోటీలకు హాజరు

ఇందుకోసం తాను రూ.1.50 లక్షలను అప్పు చేశానన్నారు. రూ.50 వేలు దాతలు విరాళంగా ఇచ్చారని నాగేష్ తెలిపాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆర్కెస్ట్రాలో చేరాను. ఓ స్టేజీ డ్యాన్స్‌కు రూ.100 ఇచ్చేవారు. ఎలాగో జీవితం గడిపేవాడిని. డిగ్రీ వరకు చదివి ప్రస్తుతం క్రీడల ద్వారా గుర్తింపు పొందుతున్నానని నాగేష్ తెలిపాడు. మూడు బంగారు పతకాలను సాధించడం తనకు ఎంతో స్ఫూర్తిని కలిగించిందని, మరింత సాధన చేయడానికి ఉత్సాహం అందించిందన్నాడు. 38 ఏళ్ల వయసు కలిగిన నాగేష్ 2008 నుంచే జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని సాధన చేస్తున్నాడు. నాగేష్ బేతమంగల డిగ్రీ కళాశాలలో బీఏ చదివాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లోను పాల్గొంటున్నాడు. తండ్రి నారాయణప్ప మరణించగా తల్లి, భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా కూడా పని చేశారు. తాను అంతర్జాతీయ క్రీడా పోటీల్లో 11 పతకాలు సాధించానని, ప్రభుత్వం గుర్తించి స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నాగేష్ ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. ఇంతవరకు ప్రభుత్వం, సమాజం తనను నిర్లక్ష్యం చేశాయని, ఇకనైనా గుర్తించి తనను ఆదుకోవాలని కోరాడు.

నేడు ఉచిత సామూహిక వివాహాలు

- గాలి లక్ష్మీఅరుణ నేతృత్వంలో నిర్వహణ



ఉచిత సామూహిక వివాహాలకు సిద్ధమైన వేదిక



వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు

సాక్షి బళ్లారి: మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారి నగరంలో ఉచిత సామూహిక వివాహాలు జరగనున్నాయి. వరమహాలక్ష్మి పర్వదినం సందర్భంగా సిరుగుప్ప రోడ్డు హవంబావిలోని గాలి జనార్దన్‌రెడ్డి స్వగృహం పక్కనే ఉన్న క్యాంప్‌హౌస్ ఆవరణలో వివాహోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటలకు వరమహాలక్ష్మి పూజ, 10.45 గంటలకు వేదికలో కార్యక్రమాన్ని ప్రారంభించి 12.15 గంటల్లోపు సంప్రదాయబద్ధంగా వేద మంత్రాలతో వధూవరులకు ఉచిత సామూహిక వివాహాలను జరపనున్నారు.

కోర్టు ఆంక్షల నేపథ్యంలో గాలి జనార్దన్‌రెడ్డి రావడానికి అనుమతి లేకపోవడంతో ఆయన సతీమణి, కేఆర్‌పీపీ నాయకురాలు గాలి లక్ష్మీఅరుణ నేతృత్వంలో వివాహాలను అంగరంగ వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. వరమహాలక్ష్మి రోజున ఉచిత సామూహిక వివాహాలను దాదాపు 25 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 40 వేల జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించడం విశేషం. బీజేపీలో ఉన్నప్పుడు ప్రతి ఏటా కొన్నేళ్ల పాటు దివంగత కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ వరమహాలక్ష్మి పూజకు విచ్చేసి ఉచిత సామూహిక వివాహ కార్యక్రమాల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించేవారు. అప్పటి నుంచి ఉచిత సామూహిక వివాహాలను జరిపించడం సేవా కార్యక్రమంగా భావించి పేదలకు పెళ్లిళ్లు జరిపించి వారికి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

పీహెచ్‌సీల్లో అధికారుల తనిఖీ



ఆరోగ్య కేంద్రంలో సమీక్షిస్తున్న సురేంద్రబాబు

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి శాఖాపరంగా పరిశీలించారు. గురువారం జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు రాయచూరు తాలూకా జేగరకల్, మల్లాపుర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్య పథకాల గురించి వివరించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

డివిజనల్ స్థాయి పుట్‌బాల్ పోటీల్లో సత్తా

- విజేతగా నిలిచిన ఆర్‌వైఎంఈసీ



విజేత ఆర్‌వైఎంఈసీ జట్టుకు కప్‌ను అందజేస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్: రావుబహదూర్ వై.మహాబళేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాల(ఆర్‌వైఎంఈసీ) ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన వీటీయూ కలబుర్గి డివిజనల్ స్థాయి పుట్‌బాల్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో విజేతగా బళ్లారికి చెందిన ఆర్‌వైఎంఈసీ, రన్నరప్‌గా బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(బీఐటీఎం) కళాశాల జట్లు నిలిచాయి. హోరాహోరీగా సాగిన పుట్‌బాల్ పోటీల్లో 03–01 పాయింట్లతో నగరానికి చెందిన రెండు ఇంజినీరింగ్ కళాశాలలు విన్నర్స్, రన్నర్స్‌గా నిలవడం అభినందనీయం. గెలుపొందిన రెండు జట్లను ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్స్‌పాల్స్, సిబ్బంది అభినందించారు.

నిధుల స్వాహా ఖండిస్తూ ధర్నా




ఆందోళన చేస్తున్న రైతు సమితి కార్యకర్తలు

రాయచూరు రూరల్: పనులు చేయకుండానే అధికారులు నిధులు దిగిమింగారని కర్ణాటక జాగృతి రైతు సమితి జిల్లాధ్యక్షుడు లింగప్ప పేర్కొన్నారు. గురువారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. సిరవార, మాన్వి ప్రాంతాల్లో వ్యవసాయ శాఖాధికారులు ఎస్సీ, ఎస్టీ భూముల్లో గట్ల నిర్మాణం చేపట్టినట్లు రికార్డులు సృష్టించి నిధులు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయంలో తప్పు చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

నగరసభలో ఖాళీ ఉద్యోగాల భర్తీకి వినతి

కోలారు: నగరసభలో ఖాళీగా ఉన్న 282 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని సామాజిక కార్యకర్త కెఎస్ రవీంద్రనాథ్ గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నగరసభలోని 418 పోస్టులకు గాను కేవలం 136 మంది మాత్రమే విధుల్లో ఉన్నారన్నారు. పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉండడం వల్ల నగర ప్రజల పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు కూడా కుంటుపడ్డాయన్నారు. మొత్తం 35 వార్డుల్లో 2.5 లక్షల మంది జనాభాకు అనుగుణంగా నగర ప్రజల సమస్యల పరిష్కారం దృష్ట్యా వెంటనే నగరసభలో సీ, డీ గ్రూప్ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

మరుగుదొడ్లకు మరమ్మతులేవీ?



శుభ్రత కరువైన మరుగుదొడ్ల పరిసరాలు

కంప్లి: సిరుగుప్ప తాలూకాలోని సిరిగేరి బస్టాండులో ప్రయాణికుల సౌకర్యం కోసం మరుగుదొడ్లు నిర్మించినా గత కొన్ని నెలలుగా నిర్వహణ లోపించి దుస్థితికి చేరాయి. గతంలో ఇతర ప్రాంతాలకు సిరిగేరి మీదుగా రాకపోకలు సాగించే మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం లేక నానా యాతన పడేవారు. దీనిని గమనించిన వివిధ సంఘ సంస్థల ఒత్తిడితో ఎట్టకేలకు మరుగుదొడ్లు నిర్మించారు. సుమారు రెండేళ్ల పాటు ఉపయోగకరంగా ఉన్నా ఇటీవల నిర్వహణ లోపంతో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మారాయి. పైగా మరుగుదొడ్ల తలుపులు విరిగినందున అత్యవసర పరిస్థితిలో మహిళలు మరుగుదొడ్లను వినియోగించుకొనేందుకు జంకుతున్నారు. ఇటీవల మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరిగింది. ఈనేపథ్యంలో అత్యవసరమైన పరిస్థితుల్లో మహిళలకు సౌకర్యం కోసం మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి శుభ్రత పెంపొందించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

తోటలో పనిచేస్తూ టెక్కీ దుర్మరణం

- కాటేసిన కరెంటు తీగలు



రామ్మోహన్ (ఫైల్)

తాడిమర్రి: విద్యుదాఘాతంతో ఐటీ ఇంజినీరు మృతి చెందిన సంఘటన పుట్టపర్తి జిల్లా ధర్మవరం నియోజకవర్గం తాడిమర్రి మండలంలోని కునుకుంట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గజ్జెల చిన్నయల్లప్ప, ముత్యాలమ్మ దంపతులకు ఐదు మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారి కుమారుడు రామ్మోహన్ (32), అతని భార్య శ్రీలత ఇద్దరు బెంగళూరులో ఐటీ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. గ్రామంలోని తోటలో చీనీచెట్లు, ఎర్రచందనం సాగు చేస్తున్నారు. రామ్మోహన్ అప్పుడప్పుడు వచ్చి పొలాల్లో పనులు చేయిస్తుండేవాడు.

తల్లిదండ్రుల కళ్లముందే

బుధవారం రాత్రి రామ్మోహన్ డ్రిప్పు పరికరాలను కొత్తవి అమర్చాలని తీసుకుని గ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో పంపుసెట్ మోటార్‌కు అమర్చిన తీగలను మార్చే క్రమంలో చేతితో లాగుతుండగా, అవి పైన వెళ్లే 11 కేవీ విద్యుత్ తీగలను తాకాయి. దీంతో తీవ్రంగా షాక్ కొట్టి తీగలకు అతుక్కుపోయాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు, కూలీలు కట్టెతో కొట్టి తీగలను విడిపించేందుకు విఫలయత్నం చేశారు. అందరూ చూస్తుండగానే రామ్మోహన్ విగతజీవుడు అయ్యాడు. కళ్లముందే కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతం అయ్యారు. మృతునికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఘటనపై విచారించారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సాగునీటి కోసం నేడు రాస్తారోకో

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ కింద చివరి ఆయకట్టుకు సాగునీరందించాలని శుక్రవారం నుంచి సిరవారలో రాస్తారోకో చేపడుతున్నట్లు పోరాట సమితి నేతలు తెలిపారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరవాధ్యక్షుడు చామరస మాలిపాటిల్, శంకర్‌గౌడ మాట్లాడారు. 49, 69, 104వ మైల్ వద్ద నీటి నిర్వహణకు అధికారులు సహకరించాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందాలంటే ఇంజినీర్లు గేజ్ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. కాలువ పైభాగంలోని కొప్పళ జిల్లాలో అక్రమంగా వాడకం, నీటి చౌర్యం జరుగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించక పోతే పోరాటమే శరణ్యమన్నారు. ఈసందర్భంగా అధ్యక్షుడు శంకర్‌గౌడ, అమరేష్, శరణప్పగౌడ, బసనగౌడ, చుక్కి సూగప్పలున్నారు.

ఎన్నికలకు పార్టీని బలోపేతం చేస్తాం



మాట్లాడుతున్న హన్మంతప్ప ఆల్కోడ్

రాయచూరు రూరల్: వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల నాటికి రాష్ట్రంలో జేడీఎస్ పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి హన్మంతప్ప ఆల్కోడ్ పేర్కొన్నారు. ఆయన గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం పంచ గ్యారంటీలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. భవిష్యత్తులో ఏ పార్టీలతో పొత్తు లేదని, లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కలబుర్గిలో వచ్చే నెలలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు నీరందించే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కొప్పళ జిల్లాలో రైతులు అధికంగా పైపులు వేసుకోవడంతో నీటి నిర్వహణలో లోపాలు ఏర్పడ్డాయన్నారు. జిల్లా అధ్యక్షుడు విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు వెంకట్రావ్ నాడగౌడ, రాజా వెంకటప్ప నాయక్, నాయకులు శివశంకర్, యూసుఫ్‌ఖాన్‌లున్నారు.

120 ఎకరాల ఆక్రమిత అటవీ భూమి స్వాధీనం



జేసీబీలతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: అటవీ, పోలీస్ శాఖల అధికారులు గురువారం పట్టణ సమీపంలో ఆక్రమించుకున్న అటవీ భూముల్లో జేసీబీల సహాయంతో ఆక్రమణలను తొలగించి 120 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది వ్యవసాయ గుంతలను తవ్వుకుని వ్యవసాయం చేస్తుంటే మరికొంత మంది ఆక్రమిత స్థలంలో మామిడి, నేరేడు, కానుగ తదితర చెట్లను పెంచుతున్నారు. మామిడి తోటలో మూడు వ్యవసాయ గుంతలను, నిర్మాణ దశలో ఉన్న 2 కోళ్ల ఫారాలను, 3 షెడ్‌లను తొలగించారు. కార్యాచరణకు 15 జేసీబీలు, 10 ఇటాచీలను ఉపయోగించారు. ఆక్రమణల తొలగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అయినా అడ్డుపడి జేసీబీ అద్దాలు పగులగొట్టిన శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యాచరణలో వలయ అటవీశాఖ అధికారి కె.మహేష్, డీఎస్పీ నందకుమార్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దయానంద, 150 మంది అటవీ, 60 మంది పోలీస్, రిజర్వ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక నేతలు

రాయచూరు రూరల్: కార్మికులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సమాఖ్య సంచాలకుడు షబ్బీర్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి మాట్లాడారు. కార్మికులకు నెలకు రూ.10 వేల పింఛన్, రూ.26 వేలను కళ్యాణ మండలి నుంచి కేటాయించాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు సహాయధనం కేటాయించాలన్నారు. శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు

శ్రీనివాసపురం: శ్రావణమాసం రాగానే పూలు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. శ్రావణమాసంలో వరుసగా పండుగలు వస్తున్న నేపథ్యంలో పూలు, పండ్ల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. శుక్రవారం వరమహాలక్ష్మీ వ్రతం కావడంతో పూల ధరలు బాగా పెరిగాయి. మహిళలు వర మహాలక్ష్మీ వ్రతాన్ని చేయడం కోసం పూలు, పండ్లు కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు తరలివచ్చారు. దొడ్డపేట, పాత బస్టాండు, చెన్నయ్య రంగమందిరం ముందు, ఎంజీ మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ధరలు బాగా పెరిగినా మహిళలు మాత్రం తప్పనిసరి పరిస్థితిలో కొనుగోలు చేయక తప్పలేదు. ప్రత్యేకంగా కనకాంబరాల ధరలు గగనానికి చేరుకున్నాయి. ఏకంగా కిలో కనకాంబరాల ధర రూ.2 వేలు పలికాయి. నెల రోజుల క్రితం రూ.400 ఉన్న కనకాంబరాల ధర నేడు ఏకంగా రూ.2 వేలకు చేరింది.

చంద్రయాన్ సక్సెస్‌పై సంబరాలు



విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: చంద్రయాన్–3 విజయవంతం కావడంపై బుధవారం రాత్రి పట్టణంలో బీజేపీ కార్యకర్తలు జాతీయ జెండాను పట్టుకుని విజయోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరిన మొట్టమొదటి దేశం భారత్ కావడం గర్వకారణమన్నారు. చంద్రుడిపై కాలుమోపిన అమెరికా, రష్యా, చైనాల సరసన నాలుగో దేశంగా భారత్ చేరడం గొప్ప విషయమన్నారు. ఈ ఘనత భారతీయ ఇస్రో శాస్త్రవేత్తలకే చెందుతుందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు లక్ష్మణగౌడ, హొదలి నారాయణస్వామి, పణసమాకనహళ్లి నారాయణస్వామి, రామాంజి, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

సాక్షి,బళ్లారి: తమ వృత్తి, పనులతో దైనందిన జీవితంలో బిజీగా గడిపే ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకుంటే మానసిక ప్రశాంతతతో జీవితం సాఫీగా సాగుతుందని మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన గురువారం నగరంలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ప్రసాదం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ఇకపై ప్రతి గురువారం సాయంత్రం ఆలయానికి వచ్చి పోయే భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తానన్నారు. గురు రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతోనే తాము ఈ స్థాయికి వచ్చామన్నారు. ఏ దేవుడినైనా భక్తితో కొలిస్తే ఖచ్చితంగా మంచి జరుగుతుందన్నారు. మన బ్యాంకు ఖాతాలో డబ్బులు ఉంటే ఏటీఎంలో ఎలా డబ్బులు తీసుకునేందుకు వీలవుతుందో అలానే మనం కూడా దైవప్రార్థన, మంచి పనులు చేస్తే మనకు మంచి జరుగుతుందన్నారు.

అత్యాచార నిందితులకు జైలు శిక్ష

కోలారు: మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.60 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి బి.పి.దేవమానె గురువారం తీర్పు వెలువరించారు. బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో వినోద్‌కుమార్ అనే వ్యక్తిపై బంగారుపేటె పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. మరో కేసులో బుద్ధిమాంద్య మైనర్ బాలికను తిండి ఇప్పిస్తానని ఆశ చూపి తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నిందితుడు, బంగారుపేటె సంజయ నగర్ నివాసి చంద్రప్ప అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తూ జడ్జి దేవమానె తీర్పు ఇచ్చారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన మహిళా సంఘం నేతలు

బళ్లారిఅర్బన్: నగరంలోని మిల్లర్‌పేట్ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆస్మియ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా కార్యదర్శి అర్శియబాను, శక్తి సేవా సంఘ అధ్యక్షురాలు ప్రవల్లిక ఆ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థాయిలో రాణించడంతో ఉపాధ్యాయులను సన్మానించినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యాభ్యాస సమయంలో కాలాన్ని వృథా చేయకుండా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి తమ సంస్థ నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఉర్దూ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇప్పటికే ఉన్నత స్థాయిలో రాణించారన్నారు. కార్యక్రమంలో ఆస్మియ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్ ఖలీఫ్, గ్రామీణ అధ్యక్షురాలు నసీమాబాను, శక్తి సేవా సంఘం పదాధికారులు కుమారమ్మ, కేపీవైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రీతి, యల్లమ్మ, చంద్రకళ, వనజాక్షి, పాఠశాల హెచ్‌ఎం సునంద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి వ్యక్తి మృతి



తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సకు చేరిన దృశ్యం

రాయచూరు రూరల్: విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ పేలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సింధనూరులో గురువారం చోటు చేసుకుంది. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనే రక్షణ గోడ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ పేలి సమీపంలో ఉన్న సుమారు 45 ఏళ్ల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ మరణించాడని పోలీసులు తెలిపారు.